ప్రతిపక్షం

www.prathipaksham.in

ఆదివారం 08.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 319 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



వరల్డ్ కప్ తొలి మ్యాచ్ లో భారత్ విజయం 10

ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం

భవనం మొదటి అంతస్తులో చెలరేగిన మంటలు



- సీజ్డ్ ప్రాపర్టీ విభాగంలో అగ్నిప్రమాదం
- మంటల్లో కాలిపోయిన కీలక పత్రాలు?
- విలువైన హార్డ్ డిస్కులు అగ్నికి ఆహుతి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 7 : హైదరాబాద్ నగరంలోని నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ల్యాబ్ భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో కీలక పత్రాలు మంటల్లో కాలిపోయినట్లు సమాచారం. మొదటి అంతస్తులో ఉన్న కంప్యూటర్ ల్యాబ్‌లో తొలుత మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే మంటలు భవనంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించాయి. దీంతో లోపల ఉన్న కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. అగ్నిప్రమాదం కారణంగా ఆ ప్రాంతమంతా దట్టంగా నల్లటి పొగ అలుముకుంది. ప్రమాదాన్ని గమనించిన కార్యాలయ సిబ్బంది ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. అగ్నిప్రమాదానికి సంబంధించి.. హైదరాబాద్ పోలీస్ సెంట్రల్ జోన్ డీసీపీ కె.శిల్పవల్లి మీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయని ఆమె తెలిపారు. శనివారం ఉదయం 10:00 గంటలకు అగ్ని ప్రమాదంపై సమాచారం అందిందని డీసీపీ శిల్పవల్లి వివరించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగిందని చెప్పారు. నేర పరిశోధనకు సంబంధించిన ఫైల్స్, ఎవిడెన్స్‌కు సంబంధించి ఈ ల్యాబ్ నుంచే ఆపరేషన్ జరుగుతుందని తెలిపారు. మంటల్లో కీలక ఫైల్స్ కాలిపోయిన విషయంపై ఇంకా స్పష్టత లేదన్నారు. మొదటి అంతస్తులో కంప్యూటర్స్ ఉంటాయని ఆమె

...:: మిగతా 2లో





"కేసీఆర్ మనోడు కాదని పరాయి వాడని పక్క రాష్ట్రం గురించే ఆలోచిస్తారు. ఏపీ మాజీ మంత్రి రోజా పెట్టిన చేపలు పులుసు తిని రాయలసీమను రతనాల సీమ చేస్తానని కేసీఆర్ చెప్పారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, తప్పులను సరిదిద్దుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్తున్నాం. బీఆర్ఎస్‌ను ప్రజలు బొందపెట్టారు. కాంగ్రెస్‌తో పోరాడటం మా వల్ల కాదని, బీజేపీతో బీఆర్ఎస్ కలిసిపోయింది. కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం చేసుకున్నాయి. పదేళ్లలో సమస్యలు పరిష్కరించి ఉంటే బీఆర్ఎస్ నేతలు అడగకుండానే ఓటేసేవారు.

-సీఎం రేవంత్‌రెడ్డి

మోడీని చూసి ఓటేస్తారా?

పెళ్లి పెద్దను చూసి పిల్లనిస్తారా?

- కేసీఆర్ మనోడు కాదు.. పరాయి వాడు
- పక్క రాష్ట్రం గురించే ఆలోచిస్తాడు
- పదేళ్లు అధికారంలో ఉండి చేసిందేమీ లేదు
- బీఆర్ఎస్, బీజేపీలపై సీఎం రేవంత్‌ధ్వజం
- కేసీఆర్ నిర్లక్ష్యానికి రంగారెడ్డి జిల్లా బలైంది
- గోదావరి నీళ్లు రంగారెడ్డికి ఎందుకు తీసుకరాలే?
- ప్రభుత్వంతో కలిసి పనిచేసే వారిని గెలిపించండి
- పరిగి బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 7: పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్, పన్నెండేళ్లు కేంద్రంలో ఉన్న ప్రధాని మోదీ.. తెలంగాణకు చేసిందేమీ లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. "మోడీని చూసి ఓట్లు వేయాలని బీజేపీ నేతలు చెబుతున్నారు.. ఎవరైనా పెళ్లి పెద్దను చూసి పిల్లనిస్తారా?" అంటూ సీఎం ప్రత్యర్థి పార్టీలపై విరుచుకుపడ్డారు. వికారాబాద్ జిల్లా పరిగిలో శనివారం నిర్వహించిన "ప్రజా పాలన - ప్రగతి బాట" బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్, బీజేపీలపై మండి పడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఏనాడైనా పట్టించుకున్నారా? అంటూ బీజేపీ, బీఆర్ఎస్‌లను నిలదీశారు. ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు కోసం రూ.38 వేల కోట్లతో నాటి సీఎం రాజశేఖర్‌రెడ్డి పూనుకున్నారని అన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక రంగారెడ్డి జిల్లాలోని ప్రాజెక్టులను

...:: మిగతా 2లో



భారత్ పై 25% అదనపు సుంకం రద్దు

రష్యా నుంచి చమురు కొనుగోళ్ల కారణంగా భారత్‌పై విధించిన అదనపు 25 శాతం ప్రతీకార సుంకాన్ని డొనాల్డ్ ట్రంప్ రద్దు చేశారు. దీనికి సంబంధించి ఆయన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేసినట్లు వైట్ హౌస్ ప్రకటించింది.

9



మలేషియా చేరుకున్న ప్రధాని

ప్రధాని మోదీ మలేసియాలో పర్యటిస్తున్నారు. రెండు రోజులపాటు ఆయన మలేసియాలో ఉంటారు. ఈ మేరకు ప్రత్యేక విమానంలో శనివారం మోదీ మలేసియా చేరుకున్నారు. ఆయనకు ఆ దేశ ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఘన స్వాగతం పలికారు.

9



కాంగ్రెసోళ్లు బంగారం ఇచ్చేవాళ్లు కాదు

పుస్తెలతాడు ఎత్తుకెళ్లే బ్యాచ్

- ఎన్నికలకు ముందు కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చింది..
- వాటిలో ఒక్క హామీనైనా నెరవేర్చిందా?
- మోదీ, రేవంత్ రెడ్డి ఇద్దరూ తోడు దొంగలు
- వారి మాటలు నమ్మి మోసపోవద్దు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 7: 'కాంగ్రెసోళ్లు బంగారం ఇచ్చేవాళ్లు కాదు.. మెడలో పుస్తెలతాడు ఎత్తుకెళ్లే బ్యాచ్' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. 'కాంగ్రెస్ నేతలు దండుపాళ్యం బ్యాచ్.. స్టువర్టుపురం దొంగలని' ఎద్దేవా చేశారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ పాల్గొన్నారు. ముందుగా కొయ్యగుట్టలో అమరవీరుల స్తూపం వద్ద కేటీఆర్ నివాళులర్పించారు. కొయ్యగుట్ట నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి ఆయన భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన

...:: మిగతా 2లో

హరీశ్‌రావుకు నిరసన సెగ

డౌన్ డౌన్ అంటూ హోరెత్తిన నినాదాలు

- గజ్వేల్లో మల్లన్నసాగర్ 'ముంపు' బాధితుల నిరసన
- బాధితులు, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ
- చెప్పులు విసురుకున్న ఇరు వర్గాలు
- హరీశ్‌రావు రాక ముందే ఆందోళన

ప్రతిపక్షం ప్రతినిధి

సిద్దిపేట, ఫిబ్రవరి 7: గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లోని మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ భూనిర్వాసిత (ఆర్ అండ్ ఆర్) కాలనీలో శనివారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ముంపు గ్రామాల్లో శనివారం మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి వెళ్లిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు నిరసన సెగ తగిలింది. గజ్వేల్ పట్టణంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు హరీశ్ రావు వస్తున్నారని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, మల్లన్నసాగర్

...:: మిగతా 2లో





వీటిపై జీరో టారిఫ్

ఇండియా-అమెరికా ట్రేడ్ డీల్ అమలులోకి వచ్చిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా టారిఫ్‌లను ట్రంప్ తగ్గించాడు. ఈ నేపథ్యంలో ఏయే ఉత్పత్తులపై ఎలాంటి పన్నులు ఉంటాయి.. అవి ఇండియాకు ఎలాంటి మేలు కలిగిస్తాయి అనే అంశాలపై చర్చ జరుగుతోంది.

9

మూడు కార్పొరేషన్లుగా జీహెచ్ఎంసీ

- నగరపాలక సంస్థలుగా హైదరాబాద్, మల్కాజిగిరి
- 35 లక్షల జనాభా ఉండేవిధంగా కొత్త కార్పొరేషన్లు
- ఈనెల 10న అధికారికంగా ప్రకటన?

...:: 2లో





51 మంది మావోయిస్టుల లొంగుబాటు

- భారీగా డంప్, ఆయుధాలు స్వాధీనం

...:: 2లో

రసవత్తరంగా మున్సిపల్ వార్

- పార్టీల ఎత్తుకు పైఎత్తులు
- పొలిటికల్ గేమ్‌లో పైచేయి సాధించేదెవరు?
- కారు పార్టీ ముఖ్యనేతల సెగ్మెంట్లపై కాంగ్రెస్, బీజేపీ దృష్టి
- సీఎం, మంత్రులు నియోజకవర్గాలపై బీఆర్ఎస్ స్పెషల్ ఫోకస్
- కేసీఆర్, కేటీఆర్ ఇలాకాపై కాంగ్రెస్, బీజేపీ ఫోకస్
- సీఎం, మంత్రుల నియోజకవర్గాల్లో కారు పార్టీ స్ట్రాటజీస్
- రాజకీయ ప్రత్యర్థులకు ఝలక్ ఇచ్చేందుకు పోటాపోటీ ప్లాన్స్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 7: మున్సిపల్‌ఎన్నికల ప్రచార గడువు దగ్గర పడుతుండడంతో పార్టీలన్నీ హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ప్రత్యర్థుల ఇలాకాపై ప్రత్యేక దృష్టి పెట్టి, ఒకరిపై మరొకరు పైచేయి సాధించేలా ప్రచారం కొనసాగిస్తున్నారు. కేసీఆర్, కేటీఆర్ నియోజకవర్గాల్లోని మున్సిపాలిటీలపై కాంగ్రెస్, బీజేపీ సీరియస్ ఫోకస్ పెడితే, సీఎం, మంత్రుల సొంత సెగ్మెంట్లలో సత్తా చాటేందుకు కారు పార్టీ స్ట్రాటజీస్ ప్లే చేస్తోంది. కాంగ్రెస్, బీజేపీ కీలక నేతలను టార్గెట్ చేస్తూనే, కవిత అనుచరులు పోటీ చేస్తున్న సెగ్మెంట్లలో తమ పవర్ ఏంటో చూపించాలని బీఆర్ఎస్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు పురపోరును ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ప్రచార పర్వంలో అన్ని పార్టీల నుంచి కీలక నేతలు బిజీ అయిపోయారు. ఈ క్రమంలో రాజకీయ ప్రత్యర్థుల నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టితో పని చేస్తున్నారట అధికార, విపక్ష నేతలు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇలాకా గజ్వేల్‌తో పాటు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎమ్మెల్యేగా ఉన్న సిరిసిల్లపై కాంగ్రెస్, బీజేపీ స్పెషల్ ఫోకస్ పెట్టాయట. కేసీఆర్ నియోజకవర్గం పరిధిలో గజ్వేల్, తూప్రాన్, కేటీఆర్ నియోజకవర్గంలోని సిరిసిల్ల మున్సిపాలిటీకి ఎన్నికలు జరుగుతున్నాయి. గజ్వేల్, తూప్రాన్‌లో



పట్టు జారకుండా బీఆర్ఎస్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తోంది. మాజీ మంత్రి హరీశ్ రావు ఈ మున్సిపాలిటీలకు స్పెషల్ ఇంచార్జ్‌గా ఉండగా, ఈ రెండు మున్సిపాలిటీలకు ఇద్దరు సీనియర్ లీడర్లను ఇంచార్జ్‌లుగా నియమించింది అధిష్టానం.
కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లో రెండు మున్సిపాలిటీలను గెలుచుకుని బీఆర్ఎస్‌ను డైలమాలో పడేయాలని అధికార కాంగ్రెస్ పార్టీ ప్లాన్. ఎలాగైనా గజ్వేల్, తూప్రాన్ మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందేనని..ఇంచార్జ్ మంత్రులకు,

...:: మిగతా 2లో



ముంబై మేయర్‌గా రితూ తావ్డే

బృహన్ ముంబై కార్పొరేషన్-బీఎంసీ మేయర్‌గా బీజేపీ కార్పొరేటర్ రితూ తావ్డే నామినేషన్ దాఖలు చేశారు. అలాగే డిప్యూటీ మేయర్‌గా సంజయ్ శంకర్ ఘాడి నామినేషన్ దాఖలు చేశారు.

9

రాష్ట్రీయం



ఎన్‌సీసీలో విద్యార్థుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి

- తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- ఎన్‌సీసీ క్యాడెట్లను సత్కరించిన గవర్నర్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 7: ఎన్‌సీసీలో విద్యార్థుల భాగస్వామ్యాన్ని మరింత ఎక్కువగా ప్రోత్సహించాలని విద్యా సంస్థలను తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కోరారు. శనివారం లోక్‌భవన్లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఇటీవల న్యూఢిల్లీలో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించిన రిపబ్లిక్ డే పరేడ్ కంటింజెంట్ 2026 అధికారులు, క్యాడెట్లను సత్కరించారు. యువ మనస్సులను రూపొందించడంలో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్సిసి) పాత్రను ప్రశంసించిన గవర్నర్, యువతలో క్రమశిక్షణ, నాయకత్వం మరియు సామాజిక బాధ్యత భావాన్ని పెంపొందించడంలో దాని సహకారాన్ని ప్రశంసించారు. ఎన్సిసి శిక్షణా శిబిరాలు క్యాడెట్లను మనస్సాక్షి మరియు బాధ్యతాయుతమైన పౌరులుగా మారడానికి అవసరమైన లక్షణాలతో సన్నద్ధం చేస్తాయని ఆయన ఉద్ఘాటించారు. క్యాడెట్లను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ, నాయకత్వం, ధైర్యం, ఆత్మవిశ్వాసం మరియు క్రమశిక్షణను పెంపొందించడంలో ఎన్సిసి ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. ఎఈ కార్యక్రమంలో గవర్నర్ సీనియర్ ఎన్సిసి అధికారులు మరియు కంటింజెంట్ సభ్యులను వారి విజయాలకు గుర్తింపుగా జ్ఞాపికలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎన్సిసి టిఎస్, ఏపీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎన్. సైలానీ పాల్గొన్నారు; ఎన్సిసి నుండి సీనియర్ అధికారులు; లోక్ భవన్ అధికారులు పాల్గొన్నారు.

మూడు కార్పొరేషన్లుగా జీహెచ్ఎంసీ

- నగరపాలక సంస్థలుగా హైదరాబాద్, మల్కాజిగిరి
- 35 లక్షల జనాభా ఉండేవిధంగా కొత్త కార్పొరేషన్లు
- ఈనెల 10న అధికారికంగా ప్రకటన?



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్: 300 డివిజన్లతో దేశంలోనే అతి పెద్ద మహానగరంగా విస్తరించిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ)ను మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ ఫిబ్రవరి 10న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటనించనున్నట్లు సమాచారం. గతేడాది డిసెంబరు 3వ తేదీన జీహెచ్ఎంసీ 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 డివిజన్లతో అతిపెద్ద నగరపాలక సంస్థగా ఆవిర్భవించింది. ప్రస్తుత జీహెచ్ఎంసీని 70లక్షల జనాభాతో కూడిన 6 జోన్లకు పరిమితం చేసి సగటున 35 లక్షల జనాభా ఉండేవిధంగా మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్లను 3 జోన్ల చొప్పున ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, ఖైరతాబాద్, గోల్కొండ, సికింద్రాబాద్ లతో జీహెచ్ఎంసీ కార్పొరేషన్, మల్కాజిగిరి, ఎల్బీనగర్, ఉప్పల్ లతో మల్కాజిగిరి కార్పొరేషన్ (ఎంఎంసీ), కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, సైబరాబాద్ కార్పొరేషన్ (సీఎంసీ) ఏర్పాటు కానున్నాయి.

హైదరాబాద్ నగర అభివృద్ధే లక్ష్యంగా

రాజధాని హైదరాబాద్ నగర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిన విషయం విదితమే. దీనిలో భాగంగానే బాహ్యవలయ రహదారి(ఓఆర్ఆర్) పరిధిలో ఉన్న 27 పురపాలికలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసింది. దాంతో ఓ దశలో జీహెచ్ఎంసీ దేశంలోనే అతి పెద్ద మున్సిపల్ కార్పొరేషన్ కానుందనే ప్రచారం జరిగింది. కానీ, పరిపాలనా సౌలభ్యం కోసం దీన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పరిపాలన సజావుగా సాగేందుకు హైదరాబాద్ పరిధిలో పోలీసు, పురపాలక శాఖల సరిహద్దులు ఒకేవిధంగా ఉండేలా చూడాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది. ఇటీవలే రాజధాని పరిధిలోని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లను పునర్వ్యవస్థీకరించింది. హైదరాబాద్ పరిధిని పెంచడంతో పాటు రాచకొండను మల్కాజిగిరిగా మార్చనున్నట్లుగా సమాచారం.

17 ఏళ్ల తర్వాత ప్రత్యేక అధికారి పాలన

హైదరబాద్లో 17 ఏళ్ల తర్వాత స్పెషల్ ఆఫీసర్ పాలన రాబోతుంది. పాలకమండలి లేనప్పుడు మేయర్‌కు సమాన హోదాలో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు ప్రత్యేక అధికారులను నియమించి పరిపాలనను నిర్వర్తిస్తుంది. చివరి సారిగా 2008 సెప్టెంబరు 4వ తేదీ నుంచి 2009 డిసెంబరు 4వ తేదీ వరకు ఎస్.పి.సింగ్ కమిషనర్, ప్రత్యేక అధికారి హోదాలో జీహెచ్ఎంసీ పరిపాలన బాధ్యతలను చేపట్టారు. ఆయనకు ముందు అంటే 12 మున్సిపాలిటీలను హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసి జీహెచ్ఎంసీని ఏర్పాటు చేసినప్పుడు గ్రేటర్ హైదరాబాద్ మొట్టమొదటి కమిషనర్, స్పెషల్ ఆఫీసర్‌గా సి.వి.ఎస్.కె.శర్మ నియామకం అయ్యారు. ఆయన 2007 ఏప్రిల్ 16వ తేదీ నుంచి 2008 సెప్టెంబరు 4వ తేదీ వరకు పని చేశారు. పాత జీహెచ్ఎంసీలో రమారమి కోటి మంది జనాభా ఉండేది. ప్రస్తుత జీహెచ్ఎంసీ పరిధిలో 1.34కోట్ల మంది జనాభా ఉంది. పాత నగరంలో జనాభా అధికంగా ఉన్నందువల్ల డివిజన్ల సంఖ్య దాదాపు రెట్టింపయినట్లుగా అధికారులు వివరిస్తున్నారు. గ్రేటర్ పరిధిలో విలీనమైన 27 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో జనాభా అంతంతమాత్రమే. పాత గ్రేటర్ హైదరాబాద్‌తో పోలిస్తే ఆయా స్థానిక సంస్థలు రెట్టింపు విస్తీర్ణంలో ఉన్నాయి. జనాభా మాత్రం 30లక్షలే. వాటి పరిధిలో 47 డివిజన్లు ఏర్పాటయ్యాయి.

కాంగ్రెసోళ్లు బంగారం ఇచ్చేవాళ్లు కాదు

పుస్తెలతాడు ఎత్తుకెళ్లే బ్యాచ్

మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చిందని.. వాటిలో ఒక్క హామీనైనా నెరవేర్చిందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో తులం బంగారం లేదు.. స్కూటీలు లేవు.. ఆరు గ్యారెంటీలు లేవని విమర్శించారు. రైతుబంధు లేదు.. రైతు భరోసా లేదని అన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని చెప్పి మోసం చేశారని అన్నారు. అసలు కాంగ్రెస్ చెప్పిన నాలుగు వేల పెన్షన్ ఎవరికైనా వస్తుందా? అని ప్రశ్నించారు. ఫ్రీ బస్సు పేరుతో రేవంత్ రెడ్డి మహిళలను మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ మనిషి కాదు అని అన్నారు. మోదీ, రేవంత్ రెడ్డి ఇద్దరూ తోడు దొంగలని ఆరోపించారు. రేవంత్, ప్రధాని మోదీ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌నే గెలిపించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

రేవంత్ రెడ్డి ఏనాటికైనా బీజేపీ మనిషే

రేవంత్ రెడ్డి ఏనాటికైనా బీజేపీ మనిషే, ఆయన కప్పుకున్న ముసుగు తొలగించి చూడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రజలను కోరారు. రేవంత్ ఏనాటికీ కాంగ్రెస్ మనిషి కాలేదని, ఆయన ముందు నుంచి బీజేపీ మనిషి అని, రేవంత్ ముమ్మాటికి బడే భాయ్ తమ్ముడు అని కేటీఆర్ అన్నారు. అందుకే రాష్ట్రంలోని మైనారిటీలు, మత రాజకీయాలను వ్యతిరేకించే ప్రతి ఒక్కరూ రేవంత్ రెడ్డి కప్పుకున్న బీజేపీ ముసుగును తొలగించి చూడాలని, ఆయన లోపల ఉన్న బీజేపీ నాయకుడిని గుర్తించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్నాం కాబట్టి మున్సిపల్ ఎన్నికల్లో మాకు ఓటు వేయాలని కాంగ్రెస్ చెప్తున్న వాదన అర్థరహితమన్నారు. అధికారంలో ఉండి గత రెండు సంవత్సరాల్లో ఏం చేశారో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పాలన్నారు. ఒకవేళ రానున్న రెండు సంవత్సరాల పాటు అధికారంలో ఉంటే.. ఆ తరువాత మా ప్రభుత్వం వస్తుందని, అప్పుడు ఖచ్చితంగా పట్టణాలను కాంగ్రెస్ కంటే గొప్పగా గతంలో మాదిరి అభివృద్ధి చేస్తామని కేటీఆర్ అన్నారు. మైనారిటీలకు, బీసీలకు భారీ ఎత్తున బడ్జెట్ ఇస్తామని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఖచ్చితంగా ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలైతే కాంగ్రెస్ పార్టీ ప్రయోజనాలు పొందిన వాళ్లు మాత్రమే ఆ పార్టీకి ఓటు వేయాలని, మిగిలిన వాళ్లు ఆ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. రూ. 4000 పెన్షన్, రూ. 2500 రూపాయలు మహిళలకు, మరోవైపు విద్యా భరోసా కార్డు గానీ, రైతు భరోసా గానీ, కళ్యాణ లక్ష్మి, తులం బంగారం వచ్చిన వాళ్లు మాత్రమే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. కానీ ఇవేవీ ఇవ్వకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీలోకి పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎందుకు పోయారో బాన్సువాడ ప్రజలకు సమాధానం చెప్పవలసిన అవసరం ఉందని కేటీఆర్ డిమాండ్ చేశారు.

మోడీని చూసి ఓటేస్తారా?

మొదటిపేజీ తరువాయి

నిర్వీర్యం చేశారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ నాయకుడని చెప్పుకునే కేసీఆర్, రంగారెడ్డి జిల్లాకు గోదావరి జలాలను ఎందుకు అడ్డుకున్నారని సీఎం ధ్వజమెత్తారు. కేసీఆర్ మనోడు కాదని పరాయి వాడని పక్క రాష్ట్రం గురించే ఆలోచిస్తారని, ఏపీ మాజీ మంత్రి రోజా పెట్టిన చేపల పులుసు తిని రాయలసీమను రతనాల సీమ చేస్తానని కేసీఆర్ చెప్పారని సీఎం ఆరోపించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, తప్పులను సరిదిద్దుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్తున్నామని స్పష్టం చేశారు.

బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం

బీఆర్ఎస్‌ను ప్రజలు బొందపెట్టారని, కాంగ్రెస్‌తో పోరాడటం మా వల్ల కాదని, బీజేపీతో బీఆర్ఎస్ కలిసిపోయిందని, కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం చేసుకున్నాయని విమర్శించారు. పదేళ్లలో సమస్యలు పరిష్కరించి ఉంటే బీఆర్ఎస్ నేతలు అడగకుండానే ఓటేసేవారని అన్నారు. సమస్యలు పరిష్కరించి ఉంటే బీఆర్ఎస్, బీజేపీ నేతలు వంగి వంగి దండాలు పెట్టాల్సిన పరిస్థితి ఉండేది కాదని హితవు పలికారు. కేసీఆర్, అతని బంధువులందరికీ పదవులు ఉండాలి కాని నిరుద్యోగ పిల్లలకు ఉద్యోగాలు వద్దా అని ప్రశ్నించారు. 'రాసిపెట్టుకో కేసీఆర్, కిషన్‌రావు ఇంకోసారి కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందని, ఇప్పటి నుంచి 8 ఏళ్ల వరకు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని, కాంగ్రెస్ హయాంలో దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతాం' అని అన్నారు. ఎన్నికల్లో ఏం కుట్రలు చేస్తారో చేయండని, ఎవరెవరు అడ్డొస్తారో చూద్దామని సీఎం అన్నారు. బీజేపీ కార్యకర్తలు తమ బీ-ఫారమ్‌లను బీఆర్ఎస్ కార్యాలయంలో తెచ్చుకుంటున్నారని, ఇది బీజేపీ-బీఆర్ఎస్‌మధ్య ఉన్న చీకటి ఒప్పందాలకు నిదర్శనమని రేవంత్‌అన్నారు. అప్పులున్నా ఎన్నో సంక్షేమ పథకాలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత పాలకులు చేసిన తప్పులను సరిచేస్తూ పాలన కొనసాగిస్తున్నామని, రెండేళ్ల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు బీఆర్ఎస్, బీజేపీ ప్రయత్నించలేదని ఆరోపించారు.

చేవెళ్ల ప్రాజెక్టు కేసీఆర్‌ద్రోహం

ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కేసీఆర్ కావాలనే పక్కన పెట్టారని ఆరోపించారు. చేవెళ్ల వద్ద ఉన్న శిలాఫలకం దీనికి సజీవ సాక్ష్యమని చెప్పారు. రంగారెడ్డి జిల్లాకు 3 టీఎంసీల గోదావరి జలాలు అందితే వేల ఎకరాలకు సాగునీరు లభించేదని, కానీ ఆ అవకాశాన్ని గత ప్రభుత్వం తుంచేసిందన్నారు. లక్ష్మీదేవిపల్లిలో రిజర్వాయర్‌కు సంబంధించిన భూసేకరణ త్వరలో పూర్తిచేసి ప్రాజెక్టును పూర్తి చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. "కేసీఆర్ నిర్లక్ష్యానికి రంగారెడ్డి జిల్లా బలైంది" అని విమర్శించారు. లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలేశ్వరంగా మారిందని ఎద్దేవా చేశారు. ఆ ప్రాజెక్టుతో ప్రజలకు మేలు చేయకుండా, కుటుంబ సభ్యులు ఫామ్ హౌస్‌లు, వ్యాపారాలు పెట్టుకున్నారని ఆరోపించారు. గోదావరి జలాలు తీసుకువచ్చి తాండూరు, పరిగి, వికారాబాద్ ప్రాంతాలను సస్యశ్యామలం చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారు..

కేసీఆర్, హరీష్‌రావు, కేటీఆర్‌ల విమర్శలకు సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. "శుక్రాచార్యుడు ఫామ్ హౌస్ నుంచి మారీచుడు, సుబాహులను ఊర్లమీదకు పంపించాడంటూ ధ్వజమెత్తారు. మా అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారు" అని వ్యాఖ్యానించారు. ట్యాపింగ్ లాంటి చిల్లర పనులకు నోటీసులు ఇవ్వక ఏం చేస్తారని ప్రశ్నించారు. "దళితుడిని సీఎం చేస్తానన్న దొంగ హామీల చరిత్రను ఎవ్వరూ చెరిపేయలేరు. తెలంగాణ చరిత్ర ఉన్నంతకాలం పాపాల భైరవుడి చరిత్ర చెరిగిపోదు" అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చివరగా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి కాలనీల అభివృద్ధికి బాట వేయాలని ప్రజలను కోరారు. కేసీఆర్ దళితులను మోసం చేస్తే దళితుడైన గడ్డం ప్రసాద్ ప్రస్తుతం స్పీకర్‌గా ఉన్నారని, దళిత వ్యక్తిని సీఎం చేస్తానని చెప్పి కేసీఆర్ మోసం చేశారని సీఎం తెలిపారు. తాండూర్‌కు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఇస్తామని, పరిగి, వికారాబాద్ మున్సిపాల్టీలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. మూసీని ప్రక్షాళన చేస్తామంటే బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. మూసీ సమీపంలోని ఇళ్లలో బీజేపీ నేతలు ఒకరోజు నిద్ర పోయారని, వరదలు వచ్చినప్పుడు మూసీ సమీపంలోని ఇళ్లకు వెళ్లాలని బీజేపీ నేతలను కోరానని, వరదలు వచ్చినప్పుడు బీజేపీ నేతలు వెళ్లి ఉంటే మూసీలో కొట్టుకుపోయి కృష్ణానదిలో తేలేవాళ్లని అన్నారు. 70 వేల ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు చేపట్టి నిరుద్యోగ సమస్యను తొలగించామని పేర్కొన్నారు.

తాండూరుకు కాగ్నా నుంచి తాగునీరు

తాండూరుకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, కాగ్నా నుంచి తాగునీరు అందజేస్తామన్నారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ నియోజకవర్గాలకు కృష్ణా జలాలు తరలించి లక్ష 50 వేల ఎకరాలకు నీరు అందిస్తామని తెలిపారు. పదేళ్లుగా పూర్తి చేయని అప్పా జంక్షన్-మన్నెగూడ రోడ్డును కోర్టు కేసులు పరిష్కరించి వేగవంతం చేశామని, తాండూర్ రోడ్డును కూడా పూర్తి చేస్తామని చెప్పారు. త్వరలో రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు రానున్నాయని, వికారాబాద్‌ను ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని సీఎం వెల్లడించారు. రెండేళ్లలో పేదలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 70 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేశామని గణాంకాలతో వివరించారు. ఈ సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాదకుమార్, మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, కాలె యాదయ్య, బుయ్యని మనోహర్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

రసవత్తరంగా మున్సిపల్ వార్

మొదటిపేజీ తరువాయి

స్థానిక నేతలకు ఆ పార్టీ పెద్దలు సూచించినట్లు సమాచారం. అయితే కాంగ్రెస్ ఎత్తులకు మాజీ మంత్రి హరీశ్‌రావు పైఎత్తులు వేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో గజ్వేల్, తూప్రాన్ మున్సిపాలిటీస్‌లో గులాబీ పార్టీదే విజయమంటూ..అన్నీ తానై పని చేస్తున్నారు. పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగిన హరీశ్ తనదైన శైలిలో ప్రచారం సాగిస్తున్నారు.

సిరిసిల్ల మున్సిపాలిటీపై నజర్

ఇక బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సొంత సెగ్మెంట్‌లో సిరిసిల్ల మున్సిపాలిటీపై అధికార కాంగ్రెస్‌తో పాటు బీజేపీ కూడా స్పెషల్ ఫోకస్ పెట్టింది. కేంద్రమంత్రి బండి సంజయ్ సిరిసిల్ల మున్సిపాలిటీలో కాషాయ జెండా ఎగరవేసేందుకు గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారట. సిరిసిల్లలో కాంగ్రెస్ ప్రభావం తక్కువే అయినా ప్రధాన పోరు బీఆర్ఎస్, బీజేపీ మధ్య జరగవచ్చంటున్నారు. పార్టీ సీనియర్ నాయకురాలు తుల ఉమను ఇంచార్జ్‌గా పెట్టి కేటీఆర్ అంతా తానై నడిపిస్తున్నారు. టికెట్ల కేటాయింపు నుంచి నామినేషన్స్ వరకు అన్నింటినీ స్వయంగా కేటీఆర్ పర్యవేక్షించారు. సిరిసిల్ల మున్సిపాలిటీని ఎలాగైనా గెల్చుకుంటామని బీఆర్ఎస్ ధీమాగా ఉంటే..కాంగ్రెస్, బీజేపీ సై అంటే సై అంటుండటంతో ఉత్కంఠ రేపుతోంది. కాంగ్రెస్, బీజేపీలు కారు పార్టీ పార్టీ ముఖ్యనేతల సెగ్మెంట్లపై దృష్టి పెడితే, బీఆర్ఎస్.. సీఎం, మంత్రులు నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. మంత్రులు, వారు ఇంచార్జ్‌లు ఉన్న మున్సిపాలిటీలు, సీఎం ప్రత్యేక చొరవ తీసుకుని ప్రచారం చేస్తున్న పురపాలక సంఘాల్లో గెలిచి, కాంగ్రెస్‌కు షాక్ ఇవ్వాలనేది బీఆర్ఎస్ స్ట్రాటజీగా తెలుస్తోంది. అటు జాగృతి అధ్యక్షురాలు కవిత అనుచరులు పోటీ చేస్తున్న మున్సిపాలిటీస్‌పై కూడా బీఆర్ఎస్ నజర్ పెట్టింది. ఆమెకు ఏ మాత్రం పట్టులేదని ఈ ఎన్నికల్లోనే ప్రూవ్ చేయాలని..ఓట్లు చీలకుండా..తమ ఓట్లు జాగృతికి వెళ్లకుండా జాగ్రత్త పడుతోందట కారు పార్టీ. కవిత కూడా ఇదే మాట చెబుతున్నారు. జాగృతి పోటీ చేస్తున్న చోటనే హరీశ్‌రావు తిరుగుతున్నారని ఆరోపిస్తున్నారామె. ఇలా ఎత్తుకు పైఎత్తు పాలిటిక్స్‌తో మున్సిపల్ ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది. ఈ పొలిటికల్ గేమ్‌లో ఎవరు పైచేయి సాధిస్తారో ఈనెల 13వరకు వేచి చూడాలి మరి.

హరీశ్‌రావుకు

నిరసన సెగ

మొదటిపేజీ తరువాయి

భూనిర్వాసితులు ఆందోళనకు దిగారు. తమకు అన్యాయం చేసిన హరీశ్ రావు కాలనీకి రావద్దంటూ వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిరసనకారులు 'హరీశ్ రావు డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. మరోవైపు బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా ప్రతి నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ముంపు గ్రామాల బాధితులు, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య పోటా పోటీ నినాదాలు కొనసాగాయి. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారి, ఇరువర్గాలు ఒకరిపై ఒకరు చెప్పులు విసురుకోవడంతో ఘర్షణ చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న గజ్వేల్ ఏసీపీ, పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు స్వల్పంగా లాఠీఛార్జ్ చేయడంతో ఉద్రిక్తత కొంతమేర తగ్గింది. ఈ పరిణామాల నేపథ్యంలో హరీశ్‌రావు గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లోనే చాలా సేపు నిలిచిపోయినట్లు సమాచారం. పోలీసు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం

మొదటిపేజీ తరువాయి

వెల్లడించారు. 5 ఫైర్ ఇంజిన్‌ల సాయంతో మంటలను పూర్తిగా అదుపు చేశామని డీసీపీ తెలిపారు. ఈ కార్యాలయంలో పనిచేస్తున్న ఆఫీస్ బాయ్ మంటలను గమనించి సమాచారం అందించారని వివరించారు. ఆఫీస్ బాయ్ గమనించి వెంటనే మంటలార్పే ప్రయత్నం చేశారని అన్నారు. ఈ క్రమంలో అతను అస్వస్థతకు లోనయ్యారని.. వెంటనే 108లో ఆస్పత్రికి తరలించామని డీసీపీ తెలిపారు. ఈ ప్రమాదం జరిగినప్పుడు నలుగురు ఉద్యోగులు లోపలే ఉన్నారన్నారు. మంటలు గమనించి వారు సురక్షితంగా బయటపడ్డారని ఆమె చెప్పారు. ల్యాబ్‌లో కీలకమైన కేసులు, ఫోరెన్సిక్ ఆధారాలకు సంబంధించిన డాక్యుమెంట్లు ఏవైనా దెబ్బతిన్నాయా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. కాగా, ఈ అగ్ని ప్రమాదంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓటుకు నోటు కేసు సహా పలు కీలక కేసులకు సంబంధించిన డాక్యుమెంట్లు, ఎవిడెన్స్‌లు ఇక్కడే ఉండటంతో ఈ అగ్నిప్రమాదం వెనుక కుట్ర కోణం ఉండొచ్చని అంటున్నారు.

విలువైన హార్డ్ డిస్కులు
అగ్నికి ఆహుతి: డీఎఫ్ఓ శ్రీ దాస్

తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో మంటలు అదుపులోకి వచ్చాయని డీఎఫ్ఓ శ్రీ దాస్ తెలిపారు. మొదటి అంతస్తులోని వివిధ కేసులకు సంబంధించిన సీజ్డ్ ప్రాపర్టీ విభాగంలో అగ్నిప్రమాదం సంభవించిందన్నారు. చాలా విలువైన హార్డ్ డిస్కులు, డాక్యుమెంట్స్ అగ్నికి ఆహుతయ్యాయని వివరించారు. ఇవాళ ఉదయం 10:22 గంటలకు అగ్నిప్రమాదం గురించి సమాచారం అందిందని ఆయన అన్నారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నామని.. అప్పటికే మంటలు ఎగసి పడుతున్నాయని తెలిపారు. కెమికల్ ల్యాబ్ మెటీరియల్ మొత్తం రెండో అంతస్తులో ఉందని చెప్పుకొచ్చారు. అయితే రెండో అంతస్తుకు మంటలు వ్యాపించలేదన్నారు. మొదటి అంతస్తులో సెన్సిటివ్‌గా ఉన్న ప్లాస్టిక్ వస్తువుల కాలిపోయాయని వివరించారు. హార్డ్ డిస్కులు పూర్తిగా కాలిపోయాయా? పాక్షికంగా కాలాయా? అన్నది పరిశీలించాలని డీఎఫ్ఓ తెలిపారు.

ప్రమాదంపై అనుమానాలు: కేటీఆర్

హైదరాబాద్ నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఓటుకు నోటు కేసుకు సంబంధించిన వాయిస్ రికార్డింగ్‌లను, ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం పుట్టించిన తప్పుడు ఆధారాలను కప్పిపుచ్చడానికి చేసిన ప్రయత్నంగా కనిపిస్తుందని సందేహం వ్యక్తంచేశారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా కేటీఆర్ స్పందించారు.



గాయం నుంచి కోలుకున్న వాషింగ్టన్ సుందర్ రెండో టీ20కి అందుబాటులో ఉంటారు. ఢిల్లీ వేదికగా నమీబియాతో జరిగే మ్యాచులో జట్టులో చేరుతారు. న్యూజిలాండ్‌తో తొలి వన్డే సమయంలో సుందర్ గాయపడ్డారు. ఆ సిరీస్‌లో సుందర్ స్థానంలో బదోనిని తీసుకున్నా టీ20 వరల్డ్‌కప్ స్క్వాడ్‌లో మాత్రం ఆయన స్థానాన్ని రీప్లేస్ చేయలేదు.
- కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్

పర్యావరణ పరిరక్షణపై అవగాహన తరగతులు

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 7 : రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, వాతావరణ మార్పులపై అవగాహన పెంపొందించడంలో ఈపీటీఆర్ఐ కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అన్నారు. పర్యావరణ మార్పులపై పరిశోధన, ఇంటర్న్ షిప్ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ పై అవగాహన తరగతులు, జెఎన్టీయూ, ఉస్మానియా యూనివర్సిటీలలో విద్యార్థులతో అవగాహన కార్యక్రమాలు, పబ్లికేషన్స్ ప్రచురణలు మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. ఈపీటీఆర్ఐ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశం నేడు డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. ఈ సమావేశానికి బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, వాతావరణ మార్పులపై అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. పరిశోధన, శిక్షణ, సామర్థ్య వృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈపీటీఆర్ఐ ద్వారా అమలవుతున్న ప్రస్తుత కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు, శిక్షణా కార్యక్రమాలు, పరిశోధన ప్రాజెక్టులు, మానవ వనరుల అభివృద్ధి, ఆర్థిక అంశాలపై బోర్డ్ సభ్యులతో విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు అనుగుణంగా పర్యావరణ అనుకూల కార్యక్రమాలను వేగవంతం చేయాలని, వివిధ శాఖలతో సమన్వయం పెంచాలని ఆయన సూచించారు. పరిశ్రమలు, పట్టణాభివృద్ధి, ఘన వ్యర్థాల నిర్వహణ, నీటి, వాయు కాలుష్య నియంత్రణ, పచ్చదనం పెంపకం వంటి అంశాల్లో మరింత చురుకైన పాత్ర పోషించాలని సమావేశంలో చర్చించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పర్యావరణ పరిరక్షణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి టి.కె. శ్రీదేవి, బోర్డ్ మెంబర్స్, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

51 మంది మావోయిస్టుల లొంగుబాటు

- భారీగా డంప్, ఆయుధాలు స్వాధీనం

ప్రతిపక్షం, కొత్తగూడెం, ఫిబ్రవరి 7: పార్టీ విధానాలు, సిద్ధాంతాలు నచ్చకపోవడంతో విసిగిపోయిన పలువురు మావోయిస్టులు లొంగుబాట పడుతున్నారు. ఈ క్రమంలోనే ఛత్తీస్‌గఢ్ పోలీస్ అధికారుల ఎదుట 51 మంది మావోయిస్టులు సాయుధంగా శనివారం లొంగిపోయారు. వీరిపై రూ.85 లక్షల రివార్డులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు సుక్మా జిల్లా పోలీస్ అధికారుల ఎదుట 21 మంది మావోయిస్టులు సాయుధంగా లొంగిపోయారు. వీరిపై రూ.76 లక్షల రివార్డులు ఉన్నాయి. లొంగిపోయిన మావోయిస్టులందరికీ తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున నగదును చెక్కు రూపంలో పోలీస్ అధికారులు అందజేశారు. మరోవైపు గరియా బంద్ జిల్లా అటవీ ప్రాంతంలో నిర్వహించిన సెర్చింగ్ ఆపరేషన్‌లో కొండల్లో ఆరు చోట్ల మావోయిస్టుల డంపును భద్రతా దళాలు శనివారం స్వాధీనం చేసుకున్నాయి. స్వాధీనం చేసుకున్న ఆయుధాల్లో రెండు ఇన్సాస్ రైఫిళ్లు, ఒక 303 రైఫిల్, ఒక నాటు తుపాకీ, ఒక నాటు బారెల్ గ్రనేడ్ లాంచర్ (బీజీఎల్), రెండు 12 బోర్ గన్స్, రెండు సింగిల్ షార్ట్ వెపన్స్, 127 లైవ్ బుల్లెట్లు, 8 మ్యాగజైన్లు, 22 బీజీఎల్ షెల్స్ ఉన్నాయి.



బ్యాక్‌డోర్‌లో బ్యాక్‌లాగ్ రిక్రూట్‌మెంట్


- తీవ్ర ఆవేదనలో నిరుద్యోగ యువత
- బీఆర్ఎస్‌హయాంలో ఉద్యోగాలను అమ్ముకున్నారు
- మెరిట్ ఉన్న అభ్యర్థులనే భర్తీ చేయాలని డిమాండ్
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో నిరుద్యోగత పెరిగి యువత తీవ్ర ఆవేదనలో ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. గ్రామాల నుంచి యువకులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం హైదరాబాద్ వచ్చి ట్రైనింగ్ తీసుకుంటూ, వేల రూపాయల ఖర్చు పెట్టినా తెలంగాణ ఏర్పడినప్పటికీ చిన్నపాటి ఉద్యోగాలకే అవకాశం దొరకడం యువతను నిరుత్సాహంలోకి నెట్టినట్లు ఆమె తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్ర స్థాయి పోస్టులను "ప్రొవిజన్" పట్టుకొని, పరీక్షలు లేకుండా కొందరు వ్యక్తులకు ఉద్యోగాలు ఇచ్చారు. నిర్మల్‌లో 44 పోస్టులు 10-15 లక్షల రూపాయలకు అమ్మబడ్డాయని, ఆ అన్యాయం తెలిసిన తరువాత యువత ఫైట్ చేయడంతో కొంతమేర రిక్రూట్‌మెంట్ ఆపినా అప్పటి కాంట్రాక్టు ఉద్యోగులు న్యాయం పొందలేదని చెప్పారు. అప్పటి బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి ఇలాంటి అన్యాయాలకు అడ్డుపడుతున్నారని, అందుకే యువత దీనిని గమనించాల్సిన అవసరం ఉదన్నారు. ప్రస్తుతంలో మళ్లీ ట్రాన్స్‌కో, జెన్‌కో, ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబ్ ఆర్డినేట్ వంటి పోస్టుల భర్తీ జరుగుతున్నా, ఇవన్నీ ఎస్సీ, ఎస్టీ, బీసీల బ్యాక్‌లాగ్ పోస్టులు, గతంలో రిక్రూట్ చేయని వాటే. అయితే కొంతమంది రాజకీయ నాయకులు, అవినీతి అధికారులు డబ్బులు తీసుకుని వాటిని అమ్ముకునే ప్రయత్నాలు చేస్తున్నారని యువత భయపడుతున్నది. నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్ సహా అనేక జిల్లాల యువత తెలంగాణ జాగృతి వద్దకు వచ్చి తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందే స్ట్రిక్ట్ వార్నింగ్ ఇవ్వాలని, కలెక్టర్లు ఈ పోస్టులను మెరిట్ ఉన్న అభ్యర్థులకే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. డబ్బులు ఇచ్చి ఉద్యోగాలు పొందే ప్రయత్నం ఎవరూ చేయని విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చినట్లయితే డబ్బులు ఇచ్చిన, తీసుకున్న వారిని కఠినంగా శిక్షిస్తామని, మెరిట్ ఆధారంగా ఉద్యోగాల కోసం ప్రయత్నించే యువతకు జాగృతి అండగా ఉంటుందని ఆమె తెలిపారు. ఈ సమస్యపై ప్రభుత్వం ఇప్పుడే సీరియస్‌గా దృష్టి పెట్టి విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

సాగులో ఉన్న భూములకే 'రైతు భరోసా'

- శాటిలైట్ మ్యాపింగ్ ఆధారంగా సాయం
- వచ్చే యాసంగి నుంచే కొత్త విధానం
- తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం



ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్: రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో రైతు భరోసా పంపిణీపై కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమైంది. ఇకపై పట్టా ఉన్న ప్రతి భూమికీ కాకుండా, వాస్తవంగా సాగులో ఉన్న భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. రాబోయే యాసంగి సీజన్ నుంచే ఈ కొత్త నిబంధనలను అమలు చేసేందుకు కసరత్తు వేగవంతం చేసింది. వానాకాలం సీజన్లో జరిగిన సాగు వివరాలను ప్రాతిపదికగా తీసుకొని అర్హులైన రైతులకు నగదు జమ చేయాలని భావిస్తున్నది. అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన శాటిలైట్ మ్యాపింగ్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. రాష్ట్రంలో ఉన్న పట్టా భూమిలో 812శాతం సాగులో తేడా (20లక్షల ఎకరాలు) కనిపిస్తున్నట్లు తెలిసింది. ఈ డేటా ఆధారంగా అర్హులకు మాత్రమే రైతు భరోసా నిధులు జమ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దేశంలోనే తొలిసారిగా శాటిలైట్ ఆధారిత టెక్నాలజీతో పంటల విస్తీర్ణం లెక్కింపును చేపట్టగా.. నీటి లభ్యత తక్కువగా ఉన్న జిల్లాల్లో ఖాళీ భూముల శాతం అధికంగా ఉన్నట్లు తేలింది. ఒక గ్రామంలో 500 ఎకరాల సాగు యోగ్యభూమి ఉంటే.. 400 నుంచి 450 ఎకరాల్లో మాత్రమే పంటలు వేస్తున్నారని శాటిలైట్ ఇమేజెస్ స్పష్టం చేశాయి. అయితే, ఈ శాటిలైట్ మ్యాపింగ్ తో పంట బీమా అమలులో రైతులకు నష్టపరిహారం సకాలంలో అందడమే కాకుండా, వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, కొనుగోళ్లు, అమ్మకాల్లో పారదర్శకత తీసుకురావడానికి ఉపయోగపడనుంది. సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే స్పష్టం చేశారు. సాగు భూముల గుర్తింపు కోసం శాటిలైట్ సర్వే నిర్వహిస్తారని, గ్రామాల్లో సర్వే నెంబర్లవారీగా ఏఈవోలు క్షేత్ర స్థాయిలో పర్యటించి కచ్చిత వివరాలు సేకరించి లోటుపాట్లు సరిచేస్తారని సమాచారం. అగ్రికల్చర్ యూనివర్సిటీ రూపొందించిన పంట వివరాలను ఈనెల 14 తరువాత ప్రభుత్వానికి అందిస్తే.. టెక్నికల్ కమిటీలో చర్చించి దీనిపై నిర్ణయం తీసుకోనుంది. వానాకాలం, యాసంగి పంటల సాగు సమయంలో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు తెలంగాణ సర్కార్ 'రైతు భరోసా' పేరిట అర్హులైన రైతుల ఖాతాల్లో ఎకరానికి రూ. 6వేల చొప్పున జమ చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం యాసంగి సీజన్‌కు సంబంధించి రైతుల ఖాతాల్లో నగదు జమ కావాల్సి ఉంది. ఆ నగదు కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే, రైతుభరోసా డబ్బులు ఎప్పుడు పడతాయనే అంశంపై ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టమైన ప్రకటన చేయలేదు.



కాంగ్రెస్ రెబెల్ అభ్యర్థికి ప్రచారం

- జీవన్ రెడ్డిపై హైకమాండ్ సీరియస్
- చర్యలకు రంగం సిద్ధం!

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ సీనియర్ నేత, జగిత్యాల నియోజకవర్గానికి చెందిన జీవన్ రెడ్డిపై హైకమాండ్ సీరియస్ అయింది. ఆయనపై చర్యలు తీసుకునేందుకు రెడీ అయింది. జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ రెబల్స్ తరపున ఆయన ప్రచారం నిర్వహించడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో నిలిపిన అభ్యర్థులను కాదని.. రెబల్స్ కు మద్దతుగా ప్రచారం నిర్వహించడంపై హైకమాండ్ సీరియస్ గా ఉంది. ఇది పార్టీ క్రమశిక్షణ రాహిత్యం కిందకు వస్తుందని హైకమాండ్ భావిస్తోంది.. ఈ క్రమంలో ఆయనపై చర్యలు తీసుకునేందుకు అధిష్టానం సిద్ధమవుతోంది. మున్సిపల్ ఎన్నికల్లో ఎమ్మెల్యే సంజయ్ అనుచరులకు బీఫామ్స్ ఇచ్చారని జీవన్ రెడ్డి గతంలోనే ఆరోపణలు చేశారు. తన అనుచరులకు బీఫామ్ ఇవ్వకుండా మోసం చేశారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అంతేకాదు.. మరో అడుగు ముందుకేసి తన అనుచరులను బరిలో నిలిపిన జీవన్ రెడ్డి.. వారికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇటు జీవన్ రెడ్డి, అటు సంజయ్ మధ్య నెలకొన్న వర్గపోరుతో కాంగ్రెస్ పార్టీకి, అభ్యర్థులకు నష్టం కలుగుతుందని హైకమాండ్ భావిస్తోంది.



తెలంగాణలో కాంగ్రెస్ హవా నడుస్తుంది

- ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్
- నిర్మలా జగ్గారెడ్డి తో సమావేశం

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 7: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ హవా నడుస్తుందని ఏఐసిసి సెక్రటరీ సచిన్ సావంత్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రచార పరిస్థితులను సమీక్షించేందుకు తెలంగాణలో పర్యటించిన ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, పార్టీ బలాన్ని ప్రత్యేకంగా హైలైట్ చేశారు. డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తో సమావేశమైన సందర్భంగా సావంత్, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో క్లీన్ స్వీప్ చేయడంలో సందేహం లేదని చెప్పారు. సచిన్ సావంత్ మాట్లాడుతూ, ఈ ఎన్నికల ప్రచారం కోసం రాష్ట్రవ్యాప్తంగా పర్యటించారని, మొత్తం తెలంగాణలో కాంగ్రెస్ హవా నడుస్తోందని తెలిపారు. గత బిఆర్ఎస్ పాలనలో అవినీతి కారణంగా రాష్ట్రం అధోగతికి చేరిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు రుణ మాఫీ, ఉచిత విద్యుత్, సన్న బియ్యం, ఉచిత బస్సు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాల ద్వారా లబ్ధి చేరుతున్నదని పేర్కొన్నారు. బీజేపీ మతం, కులాల మధ్య గొడవల ద్వారా రాజకీయ లబ్ధి పొందుతున్నట్టు ఆయన విమర్శించారు. పఠాన్ చెరు నియోజకవర్గంలోని జ్యోతి రావు పూలే విగ్రహ ధ్వంసం ఉదాహరణగా గుర్తిస్తూ, బీజేపీ శివాజీ, రాముడు వంటి మహా వ్యక్తుల పేర్లను రాజకీయ లబ్ధికోసం ఉపయోగించుకుంటూ వారి స్ఫూర్తిని వదిలేస్తోందని చెప్పారు. టీఆర్ఎస్ నుండి బిఆర్ఎస్ గా పార్టీ పేరు మార్చినా ప్రజలకు కొత్తగా కలిసిపోవడం లేదని, దేశవ్యాప్తంగా అంబాసిడర్ గుర్తింపు కూడా ప్రజల వద్ద ప్రాధాన్యం కోల్పోయిందని పేర్కొన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ స్వీప్ చేయడం పక్కా అని ధీమాగా చెప్పారు.

అక్రెడిటేషన్ కార్డుల జారీకి దరఖాస్తులు ఆహ్వానం

- ఈ నెల 9 నుంచి ఆన్లైన్లో సమర్పించాలి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 7: సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో 2026-28 సంవత్సరానికి జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమాచార శాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితి గడువు ఈ నెల 28వ తేదీతో ముగియనున్నందున అర్హత కలిగిన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం మీడియా యాజమాన్యాలు తమ జర్నలిస్టుల పేర్ల జాబితాను జిల్లా పౌరసంబంధాల అధికారికి సమర్పించాలని సూచించారు. యాజమాన్యాల ద్వారా పంపిన పేర్లలో ఉన్న జర్నలిస్టులు సమాచార పౌరసంబంధాల శాఖ అధికారిక వెబ్ సైట్ http://ipr.telangana.gov.in ద్వారా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలలో ఆన్ లైన్ దరఖాస్తులను ఈ నెల 9వ తేదీ నుంచి సమర్పించాలని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

- మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 7: సంగారెడ్డి మున్సిపాలిటీలోని 38 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రజలను కోరారు. సంగారెడ్డి పట్టణ ప్రజలతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి ఒక్కో వార్డుకు రూ.8 కోట్ల చొప్పున మొత్తం రూ.300 కోట్ల నిధులతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. తాను ప్రస్తుతం ఎమ్మెల్యేగా లేకపోయినా సంగారెడ్డి ప్రజల పనులు చేయిస్తున్నానని, భవిష్యత్తులో కూడా అదే విధంగా చేస్తానని తెలిపారు. గతంలో 5,500 మందికి ఇంటి స్థలాల సర్టిఫికెట్లు ఇచ్చామని గుర్తు చేస్తూ, ఇప్పటికీ స్థలాలు లేని అర్హులైన వారికి 80 గజాల చొప్పున స్థలాలు ఇప్పిస్తానని చెప్పారు. ఈ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో ఇప్పటికే మాట్లాడినట్లు వెల్లడించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇండ్ల వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ మెల్లమెల్లగా అన్ని పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణంపై ప్రతిపక్షాలు కావాలని రాద్ధాంతం చేస్తున్నాయని ఆరోపించారు. 60 సీట్లు ఉన్న బస్సులో 100 మంది మహిళలు ప్రయాణిస్తే సమస్యలు రావా? అని ప్రశ్నించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి "బియ్యం తక్కువ ఉన్నా తినేవాళ్లు ఎక్కువగా ఉన్నట్టు" ఉందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు గెలిచిన వార్డుల్లో సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి అన్ని అభివృద్ధి పనులు చేపిస్తానని చెప్పారు. "జగ్గారెడ్డి మాటంటే మాటే" అని అన్నారు. తన భార్య నిర్మల సంగారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని, తాను మాత్రం తెలంగాణ అంతా తిరుగుతూ పార్టీ కోసం పనిచేస్తానని తెలిపారు. సదాశివపేటలో ఓ మహిళకు రూ.లక్ష సహాయం చేస్తే తనపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని, అయినా ప్రజల కోసం పని చేయడం మాననని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

బీసీ రిజర్వేషన్ల వ్యతిరేకికి బీఆర్ఎస్ టికెట్?

- తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి భవానీ వేముల ఆగ్రహం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 7: బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కోర్టులను ఆశ్రయించిన గుట్టెంగారి మాధవరెడ్డికి బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ ఇవ్వడాన్ని తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి భవానీ వేముల తప్పుబట్టారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీల త్యాగాల పునాదులపై ఏర్పడిన బిఆర్ఎస్ పార్టీ బీసీ రిజర్వేషన్ల వ్యతిరేకులకు అండగా నిలవడం దురదృష్టకరమని ఆమె విమర్శించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల చట్టం అమలైన తర్వాత స్థానిక సంస్థల్లో పెంచిన రిజర్వేషన్లను కోర్టుల ద్వారా కొట్టివేయించడంలో మాధవరెడ్డి కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఇలాంటి వ్యక్తికి గులాబీ కండువా కప్పి కౌన్సిలర్ టికెట్ ఇవ్వడం ద్వారా బీఆర్ఎస్ పార్టీ బీసీ సమాజానికి తప్పుడు సంకేతాలు ఇస్తోందని ఆరోపించారు. బీసీల రాజకీయ హక్కులను హరించిన మాధవరెడ్డిని తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బీసీల పక్షాన నిజంగా బిఆర్ఎస్ నిలబడాలనుకుంటే ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకొని బీసీ సమాజానికి క్షమాపణ చెప్పాలని, 48 గంటల్లోగా తమ నిర్ణయాన్ని ప్రకటించాలని భవానీ వేముల డిమాండ్ చేశారు.

అవకాశం ఇవ్వండి.. వార్డు రూపురేఖలు మారుస్తా

- కాంగ్రెస్‌తోనే సంక్షేమం సాధ్యం
- 20వ వార్డు అభ్యర్థి గోపగోని శోభన్‌బాబు విజ్ఞప్తి



ప్రతిపక్షం, హుస్నాబాద్, ఫిబ్రవరి 7: "పదవి కోసం కాదు.. మీ సేవకుడిగా మీ ముందుకు వస్తున్నా. ఒక్క అవకాశం ఇచ్చి చూడండి.. మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో 20వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతా" అని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి గోపగోని శోభన్ బాబు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన 20వ వార్డులో గడపగడపకూ తిరుగుతూ ఉధృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శోభన్ బాబు మాట్లాడుతూ.. వార్డు అభివృద్ధిపై తనకున్న స్పష్టమైన విజన్‌ను ప్రజల ముందు ఉంచారు. వార్డులో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కేవలం మౌలిక వసతులే కాకుండా, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడటంతో పాటు, పారిశుధ్య నిర్వహణలో ఎక్కడా రాజీ పడకుండా నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం, మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో హుస్నాబాద్ పట్టణం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయని శోభన్ బాబు పేర్కొన్నారు. ఈ అభివృద్ధి ప్రస్థానం నిరంతరాయంగా సాగాలంటే మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరాలని, అందుకోసం 20వ వార్డు ప్రజలు విచక్షణతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.



సమస్యలపై పోరాడే సీపీఐ అభ్యర్థులను గెలిపించండి

- మాజీ ఎమ్మెల్యే, సిపిఐ నేత చాడ వెంకటరెడ్డి

ప్రతిపక్షం, హుస్నాబాద్, ఫిబ్రవరి 7: హుస్నాబాద్ పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడేటి 9,16,17,18 వార్డుల్లో సీపీఐ అభ్యర్థులను మున్సిపల్ ఎన్నికల ఎనగందుల లక్ష్మి నారాయణ, కొయడ కొమురయ్య, గడిపె మల్లేశ్, సిరిగిరి కనకవ్వలను గెలిపించాలని చాడ వెంకటరెడ్డి కోరారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్ లో జరిగిన సిపిఐ అభ్యర్థుల సమావేశంలో సీపీఐ జాతీయ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణంలోని త్రాగునీటి సరఫరా కరెంటు సమస్యలు పేదలకు ఇళ్ల స్థలాలు పక్క ఇండ్లు మంజూరు చేసింది సిపిఐ అని గుర్తు చేశారు. సీపీఐ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని, పేదల సంక్షేమం కొరే సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజివరెడ్డి, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, మండల సహాయ కార్యదర్శి పొదిల కుమారస్వామి, సీపీఐ నాయకులు అయిలేని మల్లారెడ్డి, జంగ విజయ, కాల్వల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తా

- కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ 26వ వార్డు అభ్యర్థి పాటి సుమలత జైపాల్ రెడ్డి



ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 7: నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ 26వ వార్డు అభ్యర్థి పాటి సుమలత జైపాల్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 26వ వార్డు అభివృద్దే ధ్యేయంగా పోటీలో ఉన్నానని మీ అందరి సహకారంతో వార్డులోని సమస్యలను పరిష్కరించి సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల మాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలను కోరారు. తనకు అవకాశం కల్పించి చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే ఐదేళ్లపాటు అందరికీ అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు. ఈ నెల 11న పోలింగ్‌లో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

నిస్వార్థంతో సేవచేస్తా.. ఆశీర్వదించండి

- 15వ కౌన్సిలర్ అభ్యర్థి అప్పల సంధ్యా సురేష్ యాదవ్



ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 7: నిస్వార్థంతో సేవ చేస్తా నిండు మనసుతో ఆశీర్వదించండి వార్డు ప్రజల సమస్యలను పరిష్కరించడానికి మొదటి ప్రాధాన్యతనిస్తూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అప్పల సంధ్యా సురేష్ యాదవ్ అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. మొయినాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మొయినాబాద్ లోని 15వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ వేశానని వార్డు సభ్యులందరూ మద్దతుతో విజయం సాధిస్తానని అన్నారు. ప్రచారంలో భాగంగా 15వ వార్డులోని వివిధ కాలనీలలో ప్రజలను కారు గుర్తుపై ఓటు వేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. వార్డు అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతానని సేవ చేయడానికి మీ ముందుకు వస్తున్న ఒక్క అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. స్వచ్ఛంద కార్యక్రమాలు సైతం నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. వార్డులో సమస్యల పరిష్కారానికి అధికారుల సూచనలు సలహాలు పాటిస్తానని చెప్పారు. వార్డు ప్రజలకు విద్య, వైద్యం, పరిశుభ్రతపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు పరుస్తానని హామీ ఇచ్చారు. 15వ వార్డుకు స్వచ్ఛందంగా సేవ చేయాలని సంకల్పంతో వార్డు ప్రజల ముందు 5 గ్యారంటీలను వార్డు ప్రజలకు ఇస్తున్నానని వెల్లడించారు మొదటిది సొంత నిధులతో వార్డులో జరిగే ప్రతి ఆడబిడ్డ వివాహానికి 21 వేల రూపాయల ఆర్థిక సాయం చేస్తానన్నారు. ప్రతి కాలనీలో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ లైన్లను సమగ్ర ప్రణాళికతో క్రమబద్ధీకరిస్తానని, సొంత నిధులతో ప్రతి ఇంటి పెద్దకు 5 లక్షల రూపాయల జీవిత బీమా అందిస్తానని వెల్లడించారు. ప్రతి కాలనీలో చెత్త బండ్ల ఏర్పాటు చేసి రోజువారి చెత్త సేకరణ చేయిస్తానన్నారు డ్రైనేజీ లేని కాలనీలలో డ్రైనేజీ లైన్లను నిర్మాణం చేపడతానని వెల్లడించారు భూషణ్ కాలనీ స్టార్ కాలనీ భరద్వాజ్ కాలనీ సహారా కాలనీ అదే విధంగా లక్ష్మీ గణపతి కాలనీలలో పూర్తి సిసి రోడ్ల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని పేర్కొన్నారు. 15వ వార్డులో సమస్యల పరిష్కరించేందుకు ప్రత్యేక వాట్సాప్ హెల్ప్ లైన్ ను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపడతానని 15వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి అప్పల సంధ్యా సురేష్ యాదవ్ గ్యారంటీలను మేనిఫెస్టోలో పొందుపరిచారు. కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వార్డు సభ్యులను విజ్ఞప్తి చేశారు.



'యోగిదా' మూవీ సెట్‌లో ఓ వ్యక్తిని చితకబాదాను. కేరళలో షూటింగ్ జరుగుతున్న సమయంలో ఓ వ్యక్తి ఫొటో దిగేందుకు వచ్చాడు. అతడు తాగి ఉండటంతో ఫొటో ఇచ్చేందుకు నా అంకుల్ ఒప్పుకోలేదు. దీంతో అంకుల్‌ని కొట్టి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అది చూసి కోపంలో పరిగెత్తుకుంటూ వెళ్లి అతడిని చితకబాదాను.
- హీరోయిన్ సాయి ధన్సిక

ఓపెన్ వాయిస్

ఎప్‌స్టీన్ ఫైల్స్.. అంతులేని కథ

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం సెగలు ఇప్పుడు ఒక్కొక్క దేశాన్ని తాకుతున్నాయి.. అమెరికాలో సంచలనం సృష్టించిన జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసులోని రహస్య పత్రాలను 'ఎప్‌స్టీన్ ఫైల్స్' అంటున్నారు. ఇటీవల అమెరికా ప్రభుత్వం ఈ పత్రాలను బహిర్గతం చేయడంతో ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఎప్‌స్టీన్ అమెరికన్ బిలియనీర్. మైనర్ బాలికలను లైంగిక అక్రమ రవాణా చేసినట్లు నిర్ధరణ అయింది. 2019లో ఎప్‌స్టీన్ జైలులో ఉండగానే ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సేకరించిన కోర్టు పత్రాలు, సాక్ష్యాలు, విమాన ప్రయాణ వివరాలు, కాంటాక్ట్ లిస్టులను ప్రభుత్వం విడతల వారీగా విడుదల చేస్తూ వస్తోంది. అమెరికా, బ్రిటన్ ఇలా ఎన్నో దేశాలను వణికిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లోని కుబేరుల్ని సైతం షేక్ చేస్తున్న అంశం ఎప్‌స్టీన్ ఫైల్స్. చాలా ఏళ్లుగా ఈ విషయంలో చర్చ జరుగుతూనే ఉన్న.. ఇటీవల వరుసగా ఇందులోని విషయాలు బయటకు వచ్చాయి. అప్పటివరకు వీటి గురించి బహిరంగంగా మాట్లాడని సెలబ్రిటీలు, సెలబ్రిటీలు భార్యలు కూడా ఇప్పుడు మాట్లాడుతున్నారు. ఇప్పుడు ఈ రొచ్చు బాలీవుడ్‌కి తాకింది. హిందీ సినిమాకు చెందిన ఇద్దరి పేర్లు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉన్నాయంటూ ప్రచారం జరుగుతోంది. వారే దర్శక నటుడు అనురాగ్ కశ్యప్, దీపక్ చోప్రా. దీంతో ఇప్పుడు బాలీవుడ్‌లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఓ ఈవెంట్ కోసం అనురాగ్ కశ్యప్ 2017లో బీజింగ్ వెళ్లారంటూ పుకార్లు వచ్చాయి. వీటిపై అనురాగ్ కశ్యప్ స్పందించి ఖండించారు. "వక్తగా నాకు నెలకు చాలా ఆహ్వానాలు వస్తుంటాయి. అరుదుగా వాటిపై స్పందిస్తుంటా. అయితే నా జీవితంలో ఇప్పటివరకూ బీజింగ్ వెళ్లలేదు" అని క్లారిటీ ఇచ్చేశారు. ఇక దీపక్ చోప్రా మాట్లాడుతూ నేనెప్పుడూ నేరపూరిత కార్యకలాపాల్లో భాగం కాలేదు. ఎప్‌స్టీన్‌తో నా పరిచయం పరిమితమైనది. వివాదాస్పద లైంగిక నేరాల ఘటనతో నాకు సంబంధం లేదు అని చెప్పేశారు.అయితే ఈ పత్రాల్లో ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తుల పేర్లు ఉండటం కలకలం రేపుతోంది. ఎప్‌స్టీన్ బాధితులకు జరిగిన అన్యాయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన ఈ క్షమాపణలు తెలిపారు. అమెరికాలో బ్రిటన్ రాయబారి వంటి అత్యంత కీలకమైన పదవిని పీటర్ మాండెల్సన్‌కు కట్టబెట్టడం అప్పట్లో పెద్ద చర్చకు దారితీసింది. అయితే మాండెల్సన్ తనవద్ద అబద్ధాలు చెప్పి ఆ పదవిని దక్కించుకున్నారని ప్రధాని కీర్ స్టార్మర్ ఆరోపించారు. జెఫ్రీ ఎప్‌స్టీన్ తనకు అంతగా పరిచయం లేని వ్యక్తి అని, అతనితో ఎలాంటి లోతైన సంబంధాలు లేవని మాండెల్సన్ నమ్మించారని ప్రధాని వెల్లడించారు. ఆయన మాటలను నమ్మి చేసిన నియామకం ఇప్పుడు ప్రభుత్వానికి తలవంపులు తెచ్చిందని స్టార్మర్ అంగీకరించారు. పీటర్ మాండెల్సన్ 2024 డిసెంబరులో రాయబారిగా బాధ్యతలు చేపట్టారు. అయితే 2008లోనే ఎప్‌స్టీన్ లైంగిక నేరాల కేసులో దోషిగా తేలినప్పటికీ.. మాండెల్సన్ ఆయనతో స్నేహాన్ని కొనసాగించినట్లు కొన్ని ఈమెయిల్స్, మరికొన్ని పత్రాలు బయటకు వచ్చాయి. ఇలా వీరిద్దరి మధ్య ఉన్న సంబంధంలోని చీకటి కోణాలు వెలుగులోకి రావడంతో స్టార్మర్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే గతేడాది సెప్టెంబరులో ప్రధాని కీర్ స్టార్మర్ పీటర్ మాండెల్సన్‌ను పదవి నుంచి తొలగించారు.ఎప్‌స్టీన్ ఫైళ్లలో విడుదలైన నగ్న ఫోటోలు, వీడియోలు బ్లర్ చేయకుండా చాలా రోజులుగా ఆన్‌లైన్‌లో ఉన్నాయి. ఈ తప్పు గురించి అమెరికా అధికారులను ముందే హెచ్చరించినా, ఆ కంటెంట్ కొన్ని రోజుల పాటు ఆన్‌లైన్‌లోనే ఉండిపోయింది. దీంతో బాధితులకు భర్తీ చేయలేని నష్టం కలిగింది' అని న్యాయవాదులు అంటున్నారు.ఎప్‌స్టీన్ బాధితులైన అనేక మందిని గుర్తించగలిగే సమాచారం కలిగిన వేలాది పత్రాలలో భాగమని న్యాయవాదులు చెబుతున్న ఫైల్స్‌ను వెరిఫై పరిశీలించింది.ఎప్‌స్టీన్ ఫైళ్లలో భాగంగా దాదాపు 40 వేర్వేరు చిత్రాలు ప్రచురించారని న్యూయార్క్ టైమ్స్ శుక్రవారం రిపోర్ట్ చేసినటప్పుడు బాధితుల సంఘాలు మొదట ఈ విషయం గురించి మాట్లాడాయి.బాధితులు పేర్లు, చిత్రాలను సరిగ్గా సవరించే వరకు వెబ్‌సైట్‌ను మూసివేయాలని కోరిన తర్వాత, సమస్యను త్వరగా పరిష్కరించేందుకు న్యాయశాఖ అంగీకరించిందని మంగళవారం న్యూయార్క్ జడ్జి ఒకరు తెలిపారు."సాంకేతిక లేదా మానవ తప్పిదం" కారణంగా ఫైల్స్ అప్‌లోడ్ అయ్యాయని పేర్కొంటూ, న్యాయశాఖ తన వెబ్‌సైట్ నుంచి వేలాది పత్రాలను తొలగించింది . అంతకుముందు రోజే రిడక్షన్ లోపాలను సరిచేస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, బుధవారం కూడా చాలా చిత్రాలు ఆన్‌లైన్‌లో ఉన్నాయని వెరిఫై గుర్తించింది. "జరిగిన నష్టం పూడ్చలేనిది" అని బాధితుల తరపు న్యాయవాది బ్రాడ్ ఎడ్వర్డ్స్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రతిపక్షం
హైదరాబాద్
ఆదివారం
08.02.2026

ఆరోగ్య భారత్ కల సాకారమయ్యేనా?

దేశంలో మారుతున్న వ్యాధుల సరళి మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అంటువ్యాధులను జయించామని చంకలు గుద్దుకుంటున్న తరుణంలోనే, మధుమేహం, రక్తపోటు, గుండెపోటు వంటి జీవనశైలి వ్యాధులు ప్రతి ఇంటినీ పలకరిస్తున్నాయి. వీటికి కావాల్సింది మందుల షాపులు కాదు, నిరంతర ఆరోగ్య పర్యవేక్షణ మరియు అవగాహన. కానీ మన దగ్గర అన్నీ 'ప్యాచ్‌వర్క్' పనులే. బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి కేటాయిస్తున్న అరకొర నిధులు మన ప్రాధాన్యతలను ఎగతాళి చేస్తున్నాయి. గత రెండు దశాబ్దాలుగా జీడీపీలో ప్రజారోగ్య వ్యయం ఒక శాతం దగ్గరే కునారిల్లుతుండటం మన పాలకుల చిత్తశుద్ధికి నిదర్శనం.



వెంక గారి భూమయ్య
9848559863

భారతదేశం నేడు ఒక విచిత్రమైన సంధి కాలంలో ఉంది. ఒకవైపు ప్రపంచ ఆర్థిక వేదికలపై అగ్రగామిగా వెలుగుతున్నామన్న ఆత్మవిశ్వాసం, మరోవైపు దేశంలోని సామాన్యుడికి కనీస వైద్యం అందించలేకపోతున్నామన్న చేదు నిజం మనల్ని నిరంతరం వెంటాడుతున్నాయి. 2047 నాటికి 'వికసిత భారత్' అంటూ మనం వేసుకుంటున్న రంగుల చిత్రంలో ఆరోగ్య రంగం అనే పునాది మాత్రం బీటలు వారుతూనే ఉంది. ఇటీవల 'లాన్సెట్ కమిషన్' వంటి అంతర్జాతీయ వేదికలు వెల్లడిస్తున్న వాస్తవాలు మనల్ని ఒకటే ప్రశ్నిస్తున్నాయి: మనం నిర్మిస్తున్న ఆరోగ్య వ్యవస్థ నిన్నటి రోగాల కోసం సిద్ధం చేసిన కాలం చెల్లిన నమూనానా లేక రేపటి తరం అవసరాలను తీర్చే ఆధునిక వ్యవస్థా? ఆర్భాటపు ప్రకటనలు, అంకెలా గారడీ మధ్య సామాన్యుడి ప్రాణం ఇంకా గాలిలోనే దీపమై మిగిలిపోతోంది. ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న గణాంకాలకు, క్షేత్రస్థాయిలో రోగి అనుభవిస్తున్న నరకానికి మధ్య అగాధం నానాటికీ పెరుగుతోంది.

గత ఎనిమిదేళ్లుగా 'ఆయుష్మాన్ భారత్' పేరుతో మనం ఒక మహా యజ్ఞాన్ని నిర్వహిస్తున్నాం. పది కోట్లకు పైగా ఉచిత చికిత్సలు, రెండు లక్షల కోట్ల రూపాయల ప్రజల సొమ్ము ఆదా అంటూ ప్రభుత్వ గొంతులు వినిపిస్తున్న అంకెలు వినడానికి ఇంపుగానే ఉన్నాయి. కానీ, ఈ అంకెల వెనుక దాగున్న అసలు సిసలైన 'అయోమయం' అత్యంత భయంకరమైనది. చేతిలో బీమా కార్డు ఉన్నప్పటికీ, ఆసుపత్రి గడప తొక్కగానే రోగికి ఎదురయ్యే అవమానాలు, గంటల కొద్దీ నిరీక్షణ, అదనపు వసూళ్లు, పడకల కొరత మన వ్యవస్థాత్మక వైఫల్యానికి నిలువుటద్దం. పథకాల పరిధి పెరగడం గొప్ప విషయమే కావచ్చు, కానీ ఆ సేవల్లో నాణ్యత మచ్చుకైనా కనిపించకపోవడం అత్యంత దారుణం. గణంకాలతో గెలిచామని సంబరపడుతున్న పాలకులు, క్షేత్రస్థాయిలో ఉన్న రోగి ఆవేదనను వినలేకపోవడం శోచనీయం. కేవలం కార్డులు పంచడం వల్ల ఆరోగ్యం రాదు, ఆ కార్డుకు తగ్గ గౌరవం ఆసుపత్రిలో దొరికినప్పుడే ఆ పథకానికి సార్థకత చేకూరుతుంది.

మన ఆరోగ్య వ్యవస్థ ఎదుర్కొంటున్న అతిపెద్ద శాపం దాని 'ఆసుపత్రి కేంద్రిత' ధోరణి. వ్యాధి ముదిరిన తర్వాత ఆసుపత్రికి వెళ్లే రోగిని ఒక వినియోగదారుడిలా చూసే కార్పొరేట్ సంస్కృతి మనల్ని పూర్తిగా ఆవహించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పి హెచ్ సి) నేడు దిక్కులేని దీపాల్లా మారాయి. గ్రామాల్లో కనీసం జ్వరం వస్తే పారాసిటమాల్ ఇచ్చే నాథుడు లేక, గర్భిణీలు ప్రసవ వేదనతో కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సి రావడం మన ఆధునిక నాగరికతకే మచ్చ. నివారణే ప్రాధాన్యంగా ఉండాల్సిన వ్యవస్థ, కేవలం 'వ్యాపారమే' పరమావధిగా సాగుతోంది. నివారించగలిగే వ్యాధులకు కూడా వేల రూపాయలు వసూలు చేసే కార్పొరేట్ మాఫియాను కట్టడి చేయడంలో ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోంది. ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు లేకపోవడం, మందుల కొరత వెన్నాడుతుండటం వంటి అంశాలు మనం ప్రాథమిక వైద్యాన్ని ఎంతగా నిర్లక్ష్యం చేస్తున్నామో చెబుతున్నాయి.

మరోవైపు, దేశంలో మారుతున్న వ్యాధుల సరళి మనల్ని



ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అంటువ్యాధులను జయించామని చంకలు గుద్దుకుంటున్న తరుణంలోనే, మధుమేహం, రక్తపోటు, గుండెపోటు వంటి జీవనశైలి వ్యాధులు ప్రతి ఇంటినీ పలకరిస్తున్నాయి. వీటికి కావాల్సింది మందుల షాపులు కాదు, నిరంతర ఆరోగ్య పర్యవేక్షణ మరియు అవగాహన. కానీ మన దగ్గర అన్నీ 'ప్యాచ్‌వర్క్' పనులే. బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి కేటాయిస్తున్న అరకొర నిధులు మన ప్రాధాన్యతలను ఎగతాళి చేస్తున్నాయి. గత రెండు దశాబ్దాలుగా జీడీపీలో ప్రజారోగ్య వ్యయం ఒక శాతం దగ్గరే కునారిల్లుతుండటం మన పాలకుల చిత్తశుద్ధికి నిదర్శనం. అభివృద్ధి చెందిన దేశాలు తమ ఆదాయంలో అధిక భాగాన్ని ప్రజల ఆరోగ్యం కోసం ఖర్చు చేస్తుంటే, మనం మాత్రం అంకెలను మారుస్తూ కాలం గడిపేస్తున్నాం. పేదవాడి ఆరోగ్యం కంటే పథకాల ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత లభిస్తోందనేది చేదు నిజం.

డిజిటల్ హెల్త్ మిషన్, హెల్త్ ఐడీలంటూ మనం చేస్తున్న హడావుడి చూస్తుంటే, ఆకలితో ఉన్నవాడికి ఆధార్ కార్డు ఇచ్చినట్లుగా ఉంది. డేటా సేకరించడం వల్ల రోగి రోగం నయం కాదు. ఆ డేటా ఆధారంగా తక్షణమే అంబులెన్స్ అందేలా, ఆసుపత్రిలో బెడ్ దొరికేలా వ్యవస్థను పటిష్టం చేయాలి. కేవలం సాంకేతికతతో కాలం గడిపేయడం వల్ల ఒరిగేదేమీ లేదు. ప్రైవేట్ రంగం దోపిడీని అరికట్టలేని అశక్తత, ప్రభుత్వ ఆసుపత్రుల దుస్థితిని మెరుగుపరచలేని నిర్లక్ష్యం మన ఆరోగ్య వ్యవస్థను అధోగతికి తొక్కుతున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రులు ఇచ్చే బిల్లులు సామాన్యుడి వెన్ను విరుస్తుంటే, ప్రభుత్వ నియంత్రణ సంస్థలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. కార్పొరేట్ శక్తుల లాభాపేక్ష ముందు సామాన్యుడి ప్రాణం బలికావాల్సిందేనా? ఇది పాలకుల వైఫల్యం కాదా?

ఇప్పటికైనా మేల్కోకపోతే, 2047 నాటికి మనం చూసేది వికసిత భారతాన్ని కాదు, రోగగ్రస్త భారతాన్ని. పథకాల కవరేజీ కంటే సేవల నాణ్యతపై, కాగితాల మీద సంతకాల కంటే క్షేత్రస్థాయి ఫలితాలపై దృష్టి పెట్టాలి. వికేంద్రీకరణ ద్వారా అధికారాలను కింది స్థాయికి బదిలీ చేయాలి. జిల్లా స్థాయిలోనే వైద్య సౌకర్యాలు మెరుగుపడాలి. ఆశా కార్యకర్తలను, స్థానిక సంస్థలను భాగస్వాములను చేస్తూ ఒక సమగ్ర మార్పును తీసుకురావాలి. అరకొర సంస్కరణలతో కాలం గడపడం మానేసి, వ్యవస్థను మూలాల నుండి ప్రక్షాళన చేయడమే నేటి అవసరం. లేదంటే, మనమంతా అద్భుతమైన అంకెల వెనుక అస్థిరమైన జీవితాలను గడుపుతూనే ఉండాలి. ఆరోగ్యకరమైన భారతం కేవలం నినాదాల వల్ల కాదు, నిబద్ధతతో కూడిన నిర్మాణాత్మక మార్పుల వల్లే సాధ్యమవుతుంది. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రకటనల మోజు వీడి, ప్రజా ఆరోగ్యంపై వాస్తవిక పెట్టుబడులు పెట్టాలి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

శ్మశానం: మరణం పలకరించే చోటు కాదు.. జీవితం పాఠాలు నేర్పే బడి!



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ
9490754169

మనిషి అన్నాక జీవితంలో ఎన్నో చూస్తాడు సుఖాలు ఉంటాయి, కష్టాలూ ఉంటాయి. ఇవన్నీ అనుభవిస్తూ మనం సాగిపోతుంటాం. కానీ జీవితం ఎంత చిన్నదో మనకు అర్థమయ్యేలా చేసేది మాత్రం శ్మశానమే. అక్కడ జరిగే అంత్యక్రియలు చూస్తే, 'ఏదీ మనతో రాదు' అనే నిజం స్పష్టంగా కనిపిస్తుంది. శ్మశానం అంటే మృతదేహాలను కాల్చే స్థలం మాత్రమే కాదు, అది మనకు జీవిత పాఠాలు నేర్పే ఒక ప్రదేశం. అక్కడ పడుకున్న ప్రతి ఒక్కరూ ఒకప్పుడు మనలాగే ఎన్నో కలలు కన్నవాళ్ళే, ఎంతో సంపాదించిన వాళ్ళే. కానీ ఆఖరికి ఏదీ తీసుకెళ్లకుండా ఒట్టి చేతులతోనే వెళ్ళిపోయారు. శ్మశానంలో అడుగు పెట్టగానే కొన్ని నిజాలు మన కళ్ళకు కట్టినట్లు కనిపిస్తాయి. అక్కడ డబ్బున్నవాడు, లేనివాడు అనే తేడాలు ఉండవు. చదువుకున్నామా లేదా, అధికారంలో ఉన్నామా లేదా అన్నది ఆ చితి ముందు అప్రస్తుతం. అందరూ ఆఖరికి ఒకే దారిలో, సమానంగా వెళ్లాల్సిందే. బయటి ప్రపంచంలో మనం సృష్టించుకున్న ఈ గోడలన్నీ అక్కడ అర్థం లేనివిగా మారిపోతాయి. మన ఇల్లు, మన పేరు, మన హోదా.. ఇవన్నీ శాశ్వతం అని మనం భ్రమపడతాం. కానీ, 'ఏదీ మనతో రాదు' అని శ్మశానం నిశబ్దంగా హెచ్చరిస్తుంది. మనం ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించే ఈ శరీరం కూడా ఆఖరికి మట్టిలో కలిసిపోవాల్సిందే అని తెలిసినప్పుడు.. జీవితం మీద ఒక కొత్త స్పష్టత వస్తుంది. ఆ నిప్పుల్లో కరుగుతున్న శరీరాన్ని చూస్తే, ఈ క్షణంలో మనం ఎలా బతుకుతున్నాం అన్నదే ముఖ్యమని అర్థమవుతుంది. శ్మశానం మనకు ఒక నిశబ్ద సత్యాన్ని బోధపడుతుంది. జీవితాంతం మనం ఆస్తుల కోసం, హోదా కోసం ఎంత తాపత్రయపడినా.. ఆఖరికి మనం తీసుకెళ్లేది ఏమీ ఉండదు. మనిషి వెళ్లేటప్పుడు ఒంటి మీద ఒక తెల్ల బట్ట తప్ప, చేతిలో చిల్లిగవ్వ కూడా ఉండదు. కష్టపడి సంపాదించినవన్నీ ఇక్కడే ఆగిపోతాయి. అక్కడ మండుతున్న చితిని చూస్తుంటే ఒకటి బాగా అర్థమవుతుంది. డబ్బు అవసరమే కానీ, అదే జీవితం కాదు. సౌకర్యాలు కావాలి కానీ, అవే మనకు తృప్తిని ఇవ్వవు. నిజమైన సంపద మనం సంపాదించుకున్న ఆస్తుల్లో లేదు, మనం పంచుకున్న ప్రేమలో, మన మంచితనంలో ఉంది. అక్కడ తనవారిని కోల్పోయి ఏడుస్తున్న మనుషుల్ని చూసినప్పుడు బంధాల విలువ ఏంటో తెలుస్తుంది. అక్కడ ఎవరూ చనిపోయిన వ్యక్తి బ్యాంక్ బ్యాలెన్స్ గురించి మాట్లాడరు. అతను ఎంత



మంచివాడో, అందరితో ఎలా కలిసిపోయేవాడో, ఎంత ప్రేమగా ఉండేవాడో.. ఆ జ్ఞాపకాలనే గుర్తు చేసుకుంటారు. చివరికి మిగిలేది మనం సంపాదించిన కోట్లు కాదు, మనం సంపాదించుకున్న మనుషులు మాత్రమే. నిజానికి, శ్మశానం మనకు నేర్పే అతి పెద్ద పాఠం ఒకటే జీవితంలో అన్నిటికంటే ముఖ్యం మన మనుషులే. మన కుటుంబం, స్నేహితులు, ఆత్మీయులు.. వీళ్లతో మనం గడిపే ప్రతి క్షణం, పంచుకునే ఆ ప్రేమ, ఆ జ్ఞాపకాలే అసలైన ఆస్తి. ఈ బంధాలను కాపాడుకోవాలని, మనవారికి సమయం ఇవ్వాలని అక్కడ ఆ నిశ్శబ్దం మనల్ని హెచ్చరిస్తుంది. అక్కడ పడుకున్న ప్రతి మనిషికి ఒకప్పుడు ఎన్నో ఆశలు ఉండేవి, రేపు ఇది చేయాలి, అది సాధించాలి అనే లక్ష్యాలు ఉండేవి. కానీ ఇప్పుడు వాళ్ళకి 'రేపు' అన్న మాటే లేదు. నిజానికి మనలోని అహంకారాన్ని దహనం చేసే ప్రదేశం శ్మశానం. మనం సాధించిన విజయాలు, మనకున్న తెలివితేటలు చూసుకుని ఎంతో గర్వపడతాం. కానీ అక్కడ అడుగుపెట్టగానే అర్థమవుతుంది.. మనమంతా మట్టి నుంచి వచ్చి, మట్టిలోకి వెళ్లాల్సిందేనని. ఖాళీ చేతులతో వచ్చాం, ఖాళీ చేతులతోనే వెళ్ళిపోతాం. ఈ నిజాన్ని తెలుసుకున్నప్పుడు మనలో గర్వం పోయి వినయం వస్తుంది. మనం ఎవరమో గొప్పవాళ్ళమని కాదు, ఈ అనంతమైన విశ్వంలో మనమంతా కేవలం కొద్దిరోజుల అతిథులం మాత్రమే. ఈ స్పృహ మనలో ఎదుటివారి పట్ల దయను, ప్రేమను పెంచుతుంది. శ్మశానం నుంచి బయటకు వచ్చినప్పుడు మనం మునుపటిలా ఉండకూడదు; మన ఆలోచనల్లో మార్పు రావాలి. ప్రతి రోజును దేవుడిచ్చిన వరంగా భావించి, ప్రతి క్షణాన్ని అర్థవంతంగా గడపాలి. పనికిరాని గొడవలకు, అనవసరమైన పట్టింపులకు సమయాన్ని వృథా చేయకుండా.. ఉన్నంతలో ప్రశాంతంగా, ప్రేమగా బతకడం నేర్చుకోవాలి. రేపు మనం ఈ లోకాన్ని విడిచి వెళ్ళినప్పుడు, మనం సంపాదించిన ఆస్తులు కాదు, మనం పంచిన ప్రేమే అందరికీ గుర్తుండాలి. మన జీవితం మరొకరికి స్ఫూర్తిని ఇచ్చేలా ఉండాలి. నిజానికి శ్మశానం మనల్ని నిద్రలేపుతుంది. 'పైపైన కనిపించే ఈ లోకం శాశ్వతం కాదు' అని గుర్తుచేస్తూ, లోతైన జీవిత విలువల వైపు మన దృష్టిని మళ్ళిస్తుంది. మనం పెంచుకున్న సంస్కారం, మన నైతికత, మన ఆధ్యాత్మిక బలం—ఇవే మనల్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి. మనం చేసే మంచి పనులు, మనం చూపించే దయ, మనం అందించే సాయం.. ఇవే మనం ఈ లోకానికి ఇచ్చి వెళ్లే నిజమైన కానుకలు. ఆ జ్ఞాపకాలు, ఆ మంచితనమే తరతరాలుగా అందరి మనసుల్లో మనల్ని బతికించి ఉంచుతాయి నిజానికి, శ్మశానం అంటే కేవలం మరణం మనల్ని పలకరించే చోటు కాదు.. అది జీవితం తాలూకు అసలు పాఠాలు నేర్పే ఒక బడి. మనలో నిద్రిస్తున్న మనిషిని నిద్రలేపే ఒక గుడి. మన విలువలేంటో మనకు స్పష్టంగా చూపించే అద్దం. జీవితం చాలా చిన్నది, ఉన్నప్పుడే దాన్ని అర్థవంతంగా గడపమని శ్మశానం మనకు గుర్తు చేస్తుంది. మనుషులు, మన బంధాలు ఎంత గొప్పవో.. వాటిని ఎంత జాగ్రత్తగా గుండెల్లో పెట్టుకోవాలో అక్కడ అర్థమవుతుంది. సమయం తిరిగి రానిదని, దాన్ని వృథా చేయకూడదని అక్కడ ప్రతి చితి మనకు చెబుతుంది. మరణం అంటే జీవితం ముగిసిపోవడం కాదు, అసలు జీవితం అంటే ఏంటో తెలుసుకునే ఒక గొప్ప అవకాశం. ఈ నిజాన్ని ఒక్కసారి మనసుతో అర్థం చేసుకుంటే.. మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మరింత ప్రేమతో, మరింత కృతజ్ఞతతో చూడగలుగుతాము.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)



అమరత్వం రాతికి.. అనంత వేదన తల్లికి



కోట దామోదర్
9391480475

యుద్ధం దేశానికి గెలుపుని ఇస్తుంది; కానీ ఎన్నో తల్లుల గుండెల్లో మాత్రం శాశ్వత ఓటమిని మిగుల్చుతుంది. అలాంటి ఓ విషాద క్షణమే యుద్ధ స్మారక స్థలంలో తన కొడుకు పేరు చెక్కబడి ఉండటం చూసిన ఒక తల్లి కన్నీళ్లతో కూలిపోవడం. ఆ క్షణం వ్యక్తిగత దుఃఖం మాత్రమే కాదు; అది దేశ చరిత్రలో మౌనంగా దాగిన త్యాగాల ప్రతిధ్వని. ఆమె అడుగులు స్మారక ప్రాంగణంలో నెమ్మదిగా పడుతున్నాయి. గోడలపై చెక్కబడిన వేల పేర్ల మధ్య, తన కొడుకు పేరు కనిపించిన క్షణంలో కాలం ఒక్కసారిగా ఆగినట్టైంది. ఆ పేరు ఒక అక్షరాల సమూహం కాదు; ఆ పేరు ఒక బాల్యపు నవ్వు, ఒక యువకుడి కల, ఒక సైనికుడి ప్రమాణం. తల్లి చేతులు ఆ పేరును తాకినప్పుడు, ఆ రాతిలో కాదు తన గుండెల్లోనే స్పర్శ పడినట్టు అనిపించింది. "దేశం కోసం ప్రాణం ఇస్తున్నాడు" అన్న గర్వం ఆమె కళ్లలో ఒకప్పుడు వెలిగింది. కానీ ఆ గర్వానికి వెనుక దాగి ఉన్న శూన్యత, ఆ రోజు స్పష్టంగా బయట పడింది. ఇంటి ముంగిట వినిపించని అడుగుల శబ్దం, తలుపు తట్టని చేతులు, తల్లి పిలుపుకు స్పందించని గొంతు అన్నీ ఒక్కసారిగా ఆమె కన్నీళ్లుగా జారాయి. యుద్ధ స్మారకాలు రాళ్లతో నిర్మించబడ్డవి కావు; అవి తల్లుల కన్నీళ్లతో, భార్యల నిరీక్షణతో, పిల్లల నిశ్శబ్దంతో నిర్మించబడ్డాయి. అక్కడ ప్రతి పేరు ఒక కథ. ప్రతి కథ వెనుక ఒక కుటుంబం. ఆ తల్లి కన్నీళ్లు మనకు ఒక ప్రశ్న వేస్తాయి గెలుపు విలువ ఎంత? ఆ విలువను మోసిన హృదయాల ధర ఎంత? ఆమె చివరికి కన్నీళ్లను తుడుచుకొని, ఆ పేరుకు నమస్కరించింది. ఆ నమస్కారం ఓడిపోయినదానికి కాదు త్యాగానికి. దేశం నిలబడ్డ పునాది మీద నిలబడి ఉన్న ఒక తల్లి మౌన నమస్కారం అది. మనం ఆ మౌనాన్ని వినాలి; ఆ త్యాగాన్ని మరవకూడదు. ఎందుకంటే ప్రతి స్వేచ్ఛాయుత శ్వాస వెనుక, ఒక తల్లి అశ్రువు ఉంది.

(వ్యాసకర్త కవి, రచయిత)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

తెలంగాణ అంతటా.. కాంగ్రెస్ జెండా రెపరెప

- **మున్సిపల్ ప్రచారంలో మంత్రులు తుమ్మల, పొన్నం**



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 7: రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో యావత్ తెలంగాణలోని అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే కాంగ్రెస్ పార్టీ విజయానికి పునాదిగా నిలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు.హుస్నాబాద్, జమ్మికుంట, హుజురాబాద్ పట్టణాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. గత రెండు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం అసాధ్యమని భావించిన అనేక సమస్యలకు గుండె ధైర్యంతో, వీరోచితంగా పరిష్కారాలు చూపించిందని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. దశాబ్దాలుగా దేశం ఎదురు చూస్తున్న కుల గణనను అమలు చేసిన దేశంలోనే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా బలహీన వర్గాలకు సామాజిక న్యాయం చేయాలనే ఉద్దేశంతో కుల గణన చేపట్టిన ఘనత ప్రజా పాలన ప్రభుత్వానిదేనన్నారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న మాదిగ ఉపకులాల సమస్యను పరిష్కరిస్తూ ఎస్సీ వర్గీకరణను అమలు చేసి చూపించామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ఇప్పటివరకు రూ.9,800 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ధనికులతో సమానంగా పేదలు కూడా నాణ్యమైన ఆహారం తీసుకోవాలనే ఉద్దేశంతో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని స్పష్టం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ ఉద్యమం జరిగిందని గుర్తు చేస్తూ... ప్రజా పాలన ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే 75 వేల ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగ యువతకు భరోసా ఇచ్చిందన్నారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని, పంజాబ్‌ను అధిగమించి పంటల ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నామని చెప్పారు.రైతు భరోసా అమలు చేశామని, రూ.21 వేల కోట్లతో రైతు రుణమాఫీ పూర్తిచేశామని తెలిపారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు రూ.22 వేల కోట్లతో 4 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. చేనేత కార్మికుల రుణమాఫీ చేసి వారికి ఆర్థిక భరోసా కల్పించామని అన్నారు. గతంలో "కంటోన్మెంట్‌లో బుద్ధి చెప్తాం" అన్నవారికి ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పి కాంగ్రెస్ పార్టీని గెలిపించారని అన్నారు. జూబ్లీహిల్స్‌లో "మీ పని అయిపోయింది" అన్నప్పటికీ ప్రజలు 25 వేల మెజారిటీతో కాంగ్రెస్‌ను గెలిపించారని గుర్తు చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీగా గెలిచారని తెలిపారు.

కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

- **ఎన్నికల కోసం బీఆర్ఎస్,బీజేపీ చీకటి ఒప్పందం**
- **ఎన్నికల ప్రచారంలో మంత్రి దుద్దిళ్ల ఘాటు విమర్శ**



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 7: కార్పొరేషన్ ఎన్నికల్లో మెజార్టీ డివిజన్లతోపాటు మేయర్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు,శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. శనివారం కరీంనగర్ నగర పాలక సంస్థ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూరు, నగరం లో ని పలు డివిజన్లలో నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రసంగిస్తూ కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో 4045 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తారని సర్వేలు చెబుతున్నాయని, దీంతో బీఆర్ఎస్, బీజేపీల ఓటమి ఖాయమని తేలిపోవడంతో ఆ పార్టీలు ఉనికి కోసం తండ్లాడుతున్నాయన్నారు. సైద్ధాంతిక వైరుధ్యాలు కలిగిన ఆ రెండు పార్టీలు ఎన్నికల కోసం రహస్య ఒప్పందం చేసుకున్నాయని శ్రీధర్ బాబు మండిపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీలు దొందు దొందేనని, ఈ పార్టీలను నమ్ముకుంటే నష్టపోవడం తప్పదన్నారు.బీఆర్ఎస్,బీజేపీల వల్ల అభివృద్ధి సాధ్యం కాదని, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారురు.కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అనేక పథకాలు అమలుచేస్తున్నదని మంత్రి చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం చేతకాలేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు ఇవ్వడమే కాకుండా కొత్తగా పేర్ల నమోదుకు అవకాశం కల్పించిందన్నారు. దొడ్డు బియ్యానికి బదులు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తూ పేదల కడుపులు నింపుతున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం పావలా వడ్డీకి రుణాలు ఇవ్వలేకపోయిందని,కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు నాలుగు పర్యాయాలు వడ్డీలేని రుణాలు అందజేసిందని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి సొంతింటి కలను సాకారం చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం విద్యావంతులైన యువతీయువకులకు ఉద్యోగావకాశాలు కల్పించడం పూర్తిగా వైఫల్యం చెందిందని శ్రీధర్ బాబు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి,ఉద్యోగాల కల్పనకు పెద్దపీట వేసిందన్నారు.ఇప్పటికే గ్రూపు 1,గ్రూపు 2,గ్రూపు 3, గ్రూపు 4 పరీక్షలు నిర్వహించి ఉద్యోగ నియామకాలు చేపట్టిందని గుర్తు చేశారు.అలుగునూరు అభివృద్ధిలో అగ్రగామిగా నిలవాలంటే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి అఖండ మెజార్టీతో గెలిపించాలని శ్రీధర్ బాబు ప్రజలను కోరారు.ఈ కార్యక్రమం లో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పలువురు పాల్గొన్నారు.



అవకాశమివ్వండి.. అభివృద్ధిచేస్తా

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 7: ప్రజలు అవకాశం ఇచ్చి గెలిపిస్తే వార్డు అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ పార్టీ 9వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి సురేష్ యాదవ్ అన్నారు. శనివారం 9వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి అభ్యర్థి సురేష్ యాదవ్ జోరుగా ప్రచారం నిర్వహించారు. అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ ఆదరించి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వార్డు అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానన్నారు. మీలో ఒకడిగా..మీ కష్టసుఖాలు తెలిసిన వాడిగా మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మీ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు.

దక్షిణ బద్రీనాథ్ ఆలయంలో భవ్య ఆధ్యాత్మిక కార్యక్రమం

ప్రతిపక్షం,మేడ్చల్, ఫిబ్రవరి 7: మేడ్చల్ సమీపంలోని బండ మైలారం గ్రామం వద్ద ఉన్న దక్షిణ బద్రీనాథ్ ఆలయంలో ఉత్తరాఖండ్ కళ్యాణకారి సంస్థ ఆధ్వర్యంలో భవ్య ఆధ్యాత్మిక కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పన్నెండు జ్యోతిర్లింగాలలో మొదటిదైన సోమనాథ్ జ్యోతిర్లింగం యొక్క పవిత్ర శకలం, మరియు మా యమునా చాడీని ప్రతిష్టించారు.మహారాజ్ జీ పవిత్ర సందర్శన సందర్భంగా, భక్తులు చార్ ధామ్ యొక్క గొప్పతనం మరియు సోమనాథ్ శివలింగ శకలం యొక్క దైవిక ప్రాముఖ్యత గురించి ప్రవచనాలను విన్నారు. ఈ సోమనాథ్ శివలింగ శకలంలో శివుని దైవిక చైతన్యం, కరుణా శక్తి, మరియు అనుగ్రహం నిరంతరం నెలకొని ఉంటాయని విశ్వసిస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా:సురేష్ సెమ్వాల్, అధ్యక్షుడు, ఉత్తరాఖండ్ చార్ ధామ్ తీర్థ పురోహిత్ మహాపంచాయత్ మరియు ఫైవ్ గంగోత్రి టెంపుల్ కమిటీ,డా. బ్రజేష్ సట్టి, జనరల్ సెక్రటరీ, చార్ ధామ్ తీర్థ పురోహిత్ మహాపంచాయత్ మరియు ఫైవ్ గంగోత్రి టెంపుల్ కమిటీ,ఎం. శ్రీలత శోభనా రెడ్డి, డిప్యూటీ మేయర్, జిహెచ్ఎంసి, తెలంగాణ ఆలయ కమిటీ సభ్యులు విక్రమ్, రికేష్ పెట్వాల్, రాజేష్ బడోని, స్మితా బడోని, అనిరుధ్ బడోని, రుద్ర బడోని, అనిల్ సింగ్, అనిల్ బండారి, రోషన్ సింగ్, విజయ్ లసిహ్యాల్ తదితరులు పాల్గొన్నారు.



'ఒవైసీ.. కరీంనగర్ నా అడ్డా!'

- **ముస్లిం మహిళలంతా బీజేపీ వైపు**
- **కరీంనగర లో కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్**



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ ఎంఐఎంతో ఒప్పందం చేసుకొని కరీంనగర్ మేయర్ పీఠాన్ని అప్పగించేందుకు సిద్ధమైందని ఆరోపించారు. ట్రిపుల్ తలాఖ్ రద్దు తర్వాత ముస్లిం మహిళలంతా బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. ఏయ్ ఒవైసీ..."కరీంనగర్ నా అడ్డా... ఇక్కడ ఎగిరేది కాషాయ జెండానే" అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠం ఈసారి భారతీయ జనతా పార్టీదేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్‌లో పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన... నగర ప్రజల ఆస్తులకు తాను రక్షణ కవచంగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఇకపై కరీంనగర్‌లో ప్రజల భూములు, స్థలాలు కబ్జా చేసే నాయకుల అంతు చూస్తానని హెచ్చరించారు. గతంలో బీఆర్ఎస్ పాలనలో భూ కబ్జాలకు పాల్పడిన 9 మంది కార్పొరేటర్లను అరెస్ట్ చేయించి జైలుకు పంపిన విషయాన్ని గుర్తు చేశారు.కరీంనగర్‌లో బీఆర్ఎస్ పనైపోయిందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీ కేవలం 4 సీట్లకే పరిమితం కాబోతోందన్నారు. కాంగ్రెస్, ఎంఐఎం కలిసినా 20 సీట్లు కూడా దాటబోవని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కరీంనగర్‌కు వరదలా నిధులు వస్తున్నాయని, మేయర్ పీఠం బీజేపీకి అప్పగిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. చచ్చి బతికి అయినా ప్రజలకు సేవ చేయడానికే తాను రాజకీయాల్లోకి వచ్చానని, ఈ జన్మంతా ప్రజల సేవకుడిగానే ఉంటానని అన్నారు కరీంనగర్ నగర ముఖచిత్రం మారడానికి కేంద్ర ప్రభుత్వ స్మార్ట్ సిటీ నిధులే కారణమన్నారు. భూ కబ్జాదారులు ప్రజల స్థలాలను ఆక్రమిస్తుంటే, తాము అభివృద్ధిపై దృష్టి పెట్టామని చెప్పారు. రేకుర్తి చౌరస్తా నుంచి చింతకుంట వరకు రహదారి అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్లు, బస్తీ దవాఖాన వంటి పనులన్నీ కేంద్ర నిధులతోనే జరిగాయని తెలిపారు. అమృత్ 2.0 ద్వారా ప్రతి గల్లీకి తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని, కొత్త రిజర్వాయర్లు, సంప్ హౌసులు, పైపులైన్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.ఈ సందర్భంగా కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... నగర అభివృద్ధిలో బండి సంజయ్ కుమార్ పాత్ర లేదని చెప్పడం హాస్యాస్పదమన్నారు. కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ హోదా వచ్చినప్పటికీ 2020 వరకు అభివృద్ధి ఎందుకు జరగలేదో గంగుల కమలాకర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ ఎంపీగా గెలిచిన తర్వాతే స్మార్ట్ సిటీకి రూ.196 కోట్లు విడుదలయ్యాయని గుర్తు చేశారు. మొత్తం రూ.856 కోట్ల స్మార్ట్ సిటీ నిధులను వినియోగించి కరీంనగర్ నగరాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు. రోడ్లు, పార్కులు, డ్రైనేజీలు, వాకింగ్ ట్రాకులు, ఓపెన్ జిమ్ములు, స్మశాన వాటికల అభివృద్ధిలో బండి సంజయ్ కీలక పాత్ర ఉందని పేర్కొన్నారు. చేసిన అభివృద్ధిని ప్రజలు చూస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు మద్దతు ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు.

కుటుంబ పాలనతో రాష్ట్రం దివాలా


- **కాంగ్రెస్-బీఆర్ఎస్ పై కిషన్ రెడ్డి ఘాటు విమర్శలు**
- **ఇంద్రేశంలో మున్సిపాలిటీ లో బీజేపీ గర్జన**



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 7 : ఇంద్రేశం మునిసిపాలిటీ ఎన్నికల ప్రచారం వేడెక్కుతోంది. ప్రచారంలో భాగంగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ నీతివంతమైన పాలన అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా చేస్తామని చెప్పి వారి కుటుంబాన్నే బంగారంగా మార్చుకున్నారని ఆరోపించారు. పదేళ్ల బీఆర్ఎస్ కుటుంబ పాలనతో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్‌ను ఎన్నుకున్నారని, అయితే కాంగ్రెస్ కూడా కుటుంబ రాజకీయాలనే కొనసాగిస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి బలమైన, సమర్థవంతమైన ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని ప్రజలకు పిలుపునిచ్చారు.మోడీ ప్రభుత్వ పథకాలపై మాట్లాడిన కిషన్ రెడ్డి, దేశవ్యాప్తంగా కోట్లాది పేదలకు మరుగుదొడ్లు నిర్మించామని, పేద మహిళలకు సబ్సిడీ గ్యాస్ అందిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతున్నామని చెప్పారు. రైతులకు సబ్సిడీ ఎరువులు అందిస్తున్నామని పేర్కొన్నారు.మోడీ పాలనలో ఉగ్రవాదాన్ని కట్టడి చేసి దేశంలో శాంతియుత వాతావరణం నెలకొల్పామని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాల్లో బీఆర్ఎస్ నేతల దుర్మార్గాలు బయటపడ్డాయని పేర్కొన్నారు.ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓటర్లు గుణపాఠం చెప్పాలని, మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

ఓఆర్ఆర్ పై ఘోర రోడ్డు ప్రమాదం

- **అతివేగంతో రెండు నిండు ప్రాణాలు బలి**
- **నలుగురికి తీవ్ర గాయాలు**



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 7 : కారు అతి వేగం రెండు నిండు ప్రాణాలు బలి తీసుకోవడంతో పాటు మరో నలుగురికి తీవ్ర గాయాల పాలైన సంఘటన పటాన్చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. బౌరంపేట సింహపురి కాలనీకి చెందిన హరి ప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి తన సొంత కారులో హైదరాబాద్లోని జూపార్క్ సందర్శించి తిరిగి వస్తున్న క్రమంలో.. పటాన్చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పోచారం ఔటర్ రింగ్ రోడ్డు పై నుండి అత్యంత వేగంతో సర్వీస్ రోడ్డుపై అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న హరి ప్రసాద్ భార్య మౌనిక (36), స్నేహితుడు నవీన్ (30) లు అక్కడికక్కడే మృతి చెందారు. కారు డ్రైవింగ్ చేస్తున్న హరిప్రసాద్ తో పాటు శ్రీ హర్ష, అమృత, శుశ్రుతతో పాటు ఏడాదిన్నర బాబు అగస్త్య లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మెరుగైన వైద్య చికిత్స కోసం పటాన్చెరు లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సైబర్ నేరాల నివారణకు అవగాహన ఒక్కటే మార్గం

- **అత్యాశకు పోయి ఇబ్బందుకు లోనుకాకూడదు**
- **సైబర్ నేరాల నివారణకు జిల్లా పోలీసులతో కలిసి నడవండి**
- **జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**


ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 7 : ప్రస్తుతం సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలలో ఆన్‌లైన్ మోసాలు అతిపెద్ద సమస్యగా మారాయి. సైబర్ నేరాల నుండి ప్రజలను రక్షించేందుకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ, సైబర్ సెక్యూరిటీ బ్రాంచ్ ఆధ్వర్యంలో "సైబర్ జాగృత దివాస్", ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. గడిచిన సంవత్సర కాలంలో సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 1050 సైబర్ అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన రూ. 35.72 కోట్లలో నుండి రూ. 7.36 కోట్లను హోల్డ్ చేసి, తిరిగి బాధితులకు అందించేలా చర్యలు తీసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ అమాయక ప్రజల బలహీనతే, సైబర్ నేరాగాళ్ల బలంగా వివిధ రకాల సైబర్ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ను వినియోగించి కొత్త పద్ధతుల్లో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు అన్నారు. సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని అనవసర లింక్ లను ఓపెన్ చేసి, ఇబ్బందులకు గురి కావొద్దని అన్నారు. ఈజీ మనికి అలవాటు పడి, అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్లు పన్నిన వలలో పడవద్దని, ఈజీ మని అంటే మోసం అని గుర్తించాలని అన్నారు. సైబర్ నేరాలకు గురిఅవుతున్న వారిలో విధ్యావంతులే అధికం అని, మల్టీ లెవెల్ మార్కెటింగ్, నకిలీ ట్రేడింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగాల, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, డిజిటల్ అరెస్ట్ వంటి ఆన్లైన్ మోసాల పట్ల అవగాహ కలిగి ఉండాలని, మొదట డబ్బులు వస్తున్నట్లు ఆశ చూపించి, ఆతర్వాత ఆన్లైన్ మోసాలకు పాల్పడతారని గుర్తించాలన్నారు. డిజిటల్ అరెస్ట్ అంటే ఎవ్వరూ బయపడాల్సిన అవ్వయం లేదని, అసలు డిజిటల్ అరెస్ట్ ఉండదని అన్నారు. ఆన్లైన్‌లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలని, తెలియని లింక్స్, ఏపీకె ఫిల్స్ ఓపెన్ చేసి మోసపోవద్దని అన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురి అయినట్లైతే వెంటనే (గోల్డెన్ అవర్)/48 గంటలలోపు 1930 కు కాల్ చేసి గాని, యన్.సి.ఆర్.బి. (https://www.cybercrime.gov.in) పోర్టల్ నందు కాంప్లయింట్ నమోదు చేయాలని ఎస్పీ గారు సూచించారు.

కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోవద్దు

- **బీఆర్ఎస్ అభ్యర్థులనే గెలిపించాలి**
- **గంగుల కమలాకర్, బోయినపల్లి వినోద్ కుమార్**



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 7: కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయి గోసపడొద్దు అని ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ పార్లమెంటు సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ ప్రజలను హెచ్చరించారు. కరీంనగర్ నగరంలోని 30, 32, 38 డివిజన్లలో బీఆర్ఎస్ అభ్యర్థులు షేక్ యూసుఫ్, నక్క పద్మ, మాధవి రవివర్మలను గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావుతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి అడ్డదారిలో అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయలేక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారిపై, బీఆర్ఎస్ పార్టీపై బురదజల్లుతూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాల్సిన ముఖ్యమంత్రి... నిత్యం ప్రతిపక్షాలపై ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. దేశంలో ఇలాంటి దిక్కుమాలిన ముఖ్యమంత్రిని ఎక్కడా చూడలేదని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. నోరు తెరిస్తే బూతులు మాట్లాడటం, సీఎం అనే హోదాను మరిచిపోయి వీధి రౌడీలా దిగజారుడు మాటలు మాట్లాడడం రేవంత్ రెడ్డికే చెల్లిందన్నారు. "లాగుల తొండలు ఇడుస్తా... పేగులు మెడలో వేసుకుంటా... కనుగుడ్లతో గోలీలు ఆడుతా" వంటి మాటలు మాట్లాడటం ముఖ్యమంత్రికి తగునా అని ప్రశ్నించారు.గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. మహిళలకు రూ.2,500 ఆర్థిక సహాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆసరా పెన్షన్ల పెంపు, తులం బంగారం, స్కూటీలు, నిరుద్యోగ భృతి, రెండు లక్షల ఉద్యోగాలు వంటి కీలక హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ముస్లిం పిల్లలు పండ్ల దుకాణాలు, ఫంక్చర్ షాపుల్లో పని చేస్తూ చదువులకు దూరమయ్యే పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి బీఆర్ఎస్ అభ్యర్థులకే ఓటు వేయాలని ప్రజలను కోరారు. కరీంనగర్ నగర భవిష్యత్తు కోసం బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.



దేశంలోని మొట్టమొదటి క్వాంటమ్ వ్యాలీకి అమరావతిలో పునాది పడటం గర్వంగా ఉంది. ఐటీ రెవల్యూషన్‌కి హైటెక్ సిటీ ఏం సాధించిందో, క్వాంటమ్ టెక్నాలజీలో అమరావతి అచీవ్ చేస్తుంది. మోదీ నాయకత్వంలో ఆత్మనిర్భర్ వికసిత్ భారత్ వైపు అడుగులేస్తున్నాం. క్వాంటమ్ టెక్నాలజీలో నోబెల్ సాధిస్తే రూ.100 కోట్లు ఇస్తాం.
- ఏపీ సీఎం చంద్రబాబు ట్వీట్

ప్రాంతీయం



ప్రభుత్వానికి ప్రజలను ఎదుర్కొనే నైతిక హక్కు లేదు

- అవినీతి రహిత ఇందూరుగా తీర్చిదిద్దుతాం
- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 7: ప్రభుత్వానికి ప్రజలను ఎదుర్కొనే నైతిక హక్కు లేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. శనివారం నగరంలోని 50వ డివిజన్ శివాజీ నగర్‌లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి జగదీష్ కులకర్ణి మద్దతుగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఒక్కదానిని కూడా అమలు చేయని చేతగాని, అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అని తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలను ఎదుర్కొనే నైతిక హక్కు లేదన్నారు. మన ఇందూర్ మన మేయర్ అని భారతీయ జనతా పార్టీ నినాదం వినిపిస్తేనే ఇతర పార్టీలకు గుబులు పుడుతోందని అన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక వర్గానికి భయపడి “ఇందూరు” అనే పేరు కూడా పలకలేని పరిస్థితిలో ఉన్నాయని తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్, మైనార్టీ పార్టీలు, ఎంఐఎం మధ్య చీకటి ఒప్పందం కుదిరిందని ఆరోపించారు. గత పదేళ్ల పాలనలో పెద్ద పెద్ద మాటలు చెప్పినప్పటికీ, ఒక్క నిరుపేద కుటుంబానికి కూడా డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు అందించలేని చేతకాని మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్తా పాలనపై మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే హయాంలో అభివృద్ధి లేకుండా అవినీతి కమీషన్లు, కాంట్రాక్టర్లకే ప్రాధాన్యం ఇచ్చారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలలో ఏ ఒక్కటి కూడా అమలు చేయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హిందూ దేవతలను అవమాన పరుస్తున్న పార్టీలకు ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను భారతీయ జనతా పార్టీ ఒక ఛాలెంజ్‌గా స్వీకరించి, మెజార్టీ స్థానాల్లో గెలిచి మేయర్ పీఠాన్ని తప్పకుండా కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు కిట్టు పాటిల్, బాలకృష్ణ, దీపక్, అల్లాడి రాజు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, 50వ డివిజన్‌కు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

విధుల్లో సమయపాలన పాటించాలి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 7: కోర్టు విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది విధుల్లో నిబద్ధత, క్రమ శిక్షణ, సమయపాలన తప్పనిసరిగా పాటించాలని నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అన్నారు. అప్పగించిన బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని సూచించారు. శనివారం నిజామాబాద్ పోలీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్ లో కోర్ట్ డ్యూటీ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ప్రతి సిబ్బంది పాత్ర అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. కోర్ట్ డ్యూటీ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది కూడా సమర్థవంతంగా పనిచేయడంలో కీలక భూమిక వహిస్తున్నారని తెలిపారు.



అనుమానాస్పద స్థితిలో వాటర్ ఆపరేటర్ మృతి

- గుట్టు చప్పుడు కాకుండా మృతదేహాన్ని మార్చురీకి తరలించిన అధికారులు
- మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ బంధువుల ఆందోళన



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 7: అనుమానాస్పద స్థితిలో వాటర్ ట్యాంక్ ఆపరేటర్ మృతి చెందిన సంఘటన సిద్దిపేట పట్టణం లోని లోలెవల్ వాటర్ వర్క్స్ స్టార్ రూమ్ లో చోటుచేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామానికి చెందిన ఒగ్గు రాములు(65) సిద్దిపేట పట్టణంలోని లో లెవెల్ వాటర్ వర్క్ స్టోర్ రూమ్ లో వాటర్ ఆపరేటర్ గా పని చేస్తున్నాడు. రోజులాగే శుక్రవారం రాత్రి కూడా పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో, స్టోర్ రూమ్ లోనే ఉన్న అతన్ని వాటర్ ట్యాంకర్ వచ్చి బలంగా ఢీకొట్టింది. అతను అక్కడికక్కడే చనిపోగా, గమనించిన మరో వర్కర్ పోశయ్య, పై అధికారులకు సమాచారం ఇవ్వడంతో, అక్కడికి చేరుకున్న పోలీసులు, అధికారులు రాములు మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ హాస్పిటల్ మార్చురీకి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు, బంధువులకు సమాచారం అందజేశారు. వారు మార్చురి వద్దకు చేరుకొని తమకు తెలియకుండా మృతదేహాన్ని తరలించడంపై అనుమానం వ్యక్తం చేశారు. స్టోర్ రూమ్ లో ఉన్న ట్రాక్టర్ దానంతట అదే వచ్చి రాములు ను ఢీకొట్టడంపై అనుమానం వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని నిరసన తెలిపారు. అనంతరం సిద్దిపేట మున్సిపల్ ఆఫీస్ కి వెళ్లి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. కాగా మృతుడికి భార్య లక్ష్మీ గతంలోనే మరణించగా, కొడుకు శ్రీనివాస్ ఉన్నారు.



మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ కి పట్టం కట్టండి

- దుబ్బాక మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జీ ఉమ మహేశ్వర్

ప్రతిపక్షం, దుబ్బాక, ఫిబ్రవరి 7: దుబ్బాక మున్సిపాలిటీ అభివృద్ధి కావాలంటే అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ అభ్యర్థులకి పట్టం కట్టాలని ఎన్నికల ఇంచార్జ్ ఉమ మహేశ్వర్ అన్నారు. శనివారం దుబ్బాక పట్టణంలోని అర్యవైశ్య సంఘంలో బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల మేధావుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఇంచార్జీ ఉమ మహేశ్వర్ మాట్లాడుతూ... దేశంలో బీజేపీ పార్టీ అధికారంలో ఉందని, మెదక్ లో ఎంపీగా రఘునందన్ రావు అధికారంలో ఉన్నారని దుబ్బాక మున్సిపాలిటీ అభివృద్ధి కావలంటే బిజెపి పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థుల కమలం పువ్వు గుర్తుకు ఓటు గెలిపించుకోవాలని కోరారు. రాష్ట్రంలో అధికారంలో లేని బీఆర్ఎస్ పార్టీ, కేంద్రంలో అధికారంలో లేని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే దుబ్బాక మున్సిపాలిటీ అభివృద్ధి కాదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీని గెలిపించుకుంటే దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ఉన్న 20 వార్డులను కేంద్ర నిధులతో అభివృద్ధి చేసుకోవచ్చాన్నారు. మెదక్ ఎంపీ గా ఉన్న రఘునందన్ రావు దుబ్బాక ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో దుబ్బాక పట్టణంలోని పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసి దుబ్బాక ప్రజలకు అందుబాటులోకి తెచ్చారన్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రఘునందన్ రావు చేసిన అభివృద్ధి పనులను దుబ్బాక మున్సిపల్ ప్రజలు గమనించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఎండ్లు అధికారంలో ఉండి దుబ్బాక మున్సిపాలిటీని అభివృద్ధి చేయలేదన్నారు. ఈనెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని, గెలిపిస్తే మెదక్ ఎంపీ రఘునందన్ రావు సహకారంతో కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి దుబ్బాక మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ చింత సంతోష్, అసెంబ్లీ కన్వీనర్ ఎస్. ఎన్ చారి, సీనియర్ నాయకులు కిష్టమ్మ గారి సుభాష్ రెడ్డి, పల్లె వంశీ కృష్ణ గౌడ్,కానుగంటి శ్రీనివాస్, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం, లాయర్లు, ప్రయివేట్ డాక్టర్లు తదితరులు ఉన్నారు.

“



ఏఐ వల్ల ఉద్యోగాలకున్న ముప్పను ఎదుర్కొనేందుకు భారత్ ఇప్పుడిప్పుడే సిద్ధమవుతోంది. ఏఐ ప్రభావం తక్కువగా ఉండే హెల్త్‌కేర్, టూరిజం, ఆరెంజ్ ఎకానమీ వంటి రంగాలపై దృష్టి పెట్టాలి. స్కిల్లింగ్ ద్వారానే ఈ సవాలును ఎదుర్కోవచ్చు. ప్రైవేట్ పెట్టుబడుల విషయంలో కేవలం ప్రోత్సాహకాలు సరిపోవు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి ఇంకా కొనసాగే ఛాన్స్ ఉంది.

\- సీఈఏ
అనంత నాగేశ్వరన్

సంక్షేమ పథకాల అమలు కాంగ్రెస్ తోనే సాధ్యం

- బీఆరెస్, బీజేపీ భాయ్ భాయ్
- మంత్రి అజరుద్దీన్



ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో నిరుపేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, ప్రజా ప్రభుత్వం గా కాంగ్రెస్ పేరు పొందిందని రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి అజరుద్దీన్ పేర్కొన్నారు. శనివారం కామారెడ్డి పట్టణంలోని పలు వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజహారుద్దీన్ ఉధృత ప్రచారం నిర్వహించారు.ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న నాయకులు, హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మంత్రి మహమ్మద్ అజహారుద్దీన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తోందని, రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారంటీలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తున్నారని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలు సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని అన్నారు. రైతు భరోసా రైతులకు ఎకరాకు రూ. 6,000 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తూ వ్యవసాయాన్ని పండుగ చేస్తున్నారన్నారు. ఉద్యోగ నియామకాలు: గత రెండేళ్లలో దాదాపు 51,000 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగుల ఆశాజ్యోతిగా నిలిచారన్నారు. మైనారిటీ సంక్షేమం కోసం మైనారిటీల విద్య, ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి, వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. అభివృద్ధి కొనసాగాలంటే స్థానిక సంస్థల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలిఅని అజారుద్దీన్ ప్రజలకు పిలుపునిచ్చారు. అజారుద్దీన్ బిజెపి బిఆర్ఎస్ పార్టీల పై ధ్వజమెత్తారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ అహంకారం వీడితేనే అభివృద్ధి సాధ్యమని స్థానిక ఎమ్మెల్యేపై నిప్పులు చెరిగారు. ఎమ్మెల్యే గెలిచినప్పటి నుండి ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదని, గతంలో ఏమీ చేయని వ్యక్తి, రేపు చేస్తాడనే నమ్మకం మాకు లేదు, ప్రజలకు అసలే లేదన్నారు. అధికార గర్వం ఇద్దరు ముఖ్యమంత్రులను ఓడించానని చెప్పుకోవడం తప్ప, కామారెడ్డి కోసం ఆయన సాధించిన ఘనత ఒక్కటీ లేదన్నారు. అధికార అహం నెత్తికెక్కితే చిన్న, పెద్ద అనే వ్యత్యాసం ఉండదని, కేసీఆర్ అంతటి వాడే తన అహంకారంతో నేడు కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందని గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్ పర్సన్, కౌన్సిలర్ అభ్యర్థులు, స్థానిక నాయకులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచిర్యాల మేయర్‌గా ముఖేష్ గౌడ్‌ను గెలిపించండి

- బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే బీపీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పిస్తాం
- మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్



ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 7: మంచిర్యాల కార్పొరేషన్ లో మేయర్ పదవిని కైవసం చేసుకొని గాజుల ముఖేష్ గౌడ్ ని మేయర్గా ప్రజలు ఓటు వేసి గెలిపించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నవిస్ స్పష్టం చేశారు. మంచిర్యాల కార్పొరేషన్ లో భాగంగా శనివారం మంచిర్యాలలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. రోడ్ షో పట్టణంలోని బిజెపి కార్యాలయం నుండి బయలుదేరి ఐబి చౌరస్తా వరకు చేరుకున్న అనంతరం ఆయన భారీగా తరలివచ్చిన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తాను కాలేజీ చదువుకున్న రోజుల్లో మంచిర్యాల పట్టణముతో చాలా సంబంధం ఉన్నదని అన్నారు. విద్యార్థి దశలో మంచిర్యాలకు చాలా సార్లు వచ్చేవాడిని తెలిపారు. మంచిర్యాలలో బీజేపీ జెండాను ఎగురవేయాలని తెలిపారు. తెలంగాణ ప్రజలు చైతన్యవంతమైన వారిని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కెసిఆర్ కుటుంబం తెలంగాణ ఆదాయాన్ని తన కుటుంబం దోచుకుంది అన్నారు. అదేవిధంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఆదాయాన్ని దోచుకునేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకే గూటి పక్షులని తెలిపారు. తమ పార్టీ రాష్ట్రంలో అధికారంలో వస్తే బడుగు బలహీన వర్గాలకు దామాషా పద్ధతిలో రిజర్వేషన్ కల్పిస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చీకటి ఒప్పందం చేసుకున్నారని అన్నారు. ఓటుకు నోటు కేసు ఆధారాల్ని ఇప్పటికే మాయం చేసినట్లు తెలుస్తుందన్నారు. గోదావరి నది జనాలని ఈ ప్రాంత ప్రజలకు అందించి పాడిపంటలు తాగునీరు అందే విధంగా తమ పార్టీ తగు చర్యలు తీసుకుంటుందని అన్నారు. గాజుల ముఖేష్ గౌడ్ ని మంచిర్యాల క్లియర్ గా గెలిపిస్తే భారత ప్రధాని నరేంద్ర మోడీని మంచిర్యాలకు తీసుకువచ్చి ఇక్కడ ఉన్న బడుగు బలహీన వర్గాలకు తగిన మేలు చేసే విధంగా పూసి తీసుకునే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పాలనలో దేశం అనేక నష్టాలకు గురి అయిందని అన్నారు. కార్పొరేషన్ లో మేయర్ పదవి గెలిస్తే చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. బలహీనవర్గాల ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామచంద్ర రావు మాట్లాడుతూ బీజెపి అధికారంలోకి వస్తే అవినీతిని అడ్డుకొని నీతివంతమైన పాలనను అందిస్తామన్నారు. టిఆర్ఎస్ కాంగ్రెస్ తుమ్మ బంక లాంటి బంధం రాష్ట్రంలో వారికి ఉందన్నారు. నోటుకు ఓటు కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు అరెస్టు చేయడం ప్రశ్నించారు. ప్రజల పనుల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం చేకూర్తే రాష్ట్ర ఆదాయాన్ని టిఆర్ఎస్ కాంగ్రెస్ నాయకులు తమ జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు వీరబెల్లి రఘునాథరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర గౌడ్, గాజుల ముఖేష్ గౌడ, మహారాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తో పాటు జిల్లా నాయకులు కార్పొరేటర్ ఎన్నికల్లో పోటీ చేసే 60 మంది అభ్యర్థులు ప్రజలు పాల్గొన్నారు.



డివిజన్ ప్రజలకు సేవకై జీవితం అర్పిస్తా

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 7: మంచిర్యాల తన జీవితాన్ని వాడు ప్రజల సేవకై అర్పిస్తానని తెలిపారు డివిజన్ ప్రజల సేవ కోసమే 44వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు నిరుపేదల అభ్యున్నతి కోసం తమవంతు కృషి చేస్తానని అన్నారు తనను ఎన్నికలలో గెలిపించి చేతి గుర్తుకు వేటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు గెలుపు అనంతరం డివిజన్ ప్రజల రుణం తీర్చుకుంటారని పేర్కొన్నారు



47వ డివిజన్ అభ్యున్నతికి అహర్నిశలు కృషి

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 7: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో గల 47 వ డివిజన్ ప్రజల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తానని 47 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొల్లం భీమన్న తెలిపారు శనివారం వార్డులోని ప్రజల ఇంటింట ప్రచారం చేస్తూ తన ఓటు వేసి గెలిపిస్తే ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు వృద్ధులకు వికలాంగులకు పెన్షన్ ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు డివిజన్లో సిసి రోడ్లు వీధిదీపాలను అమర్ స్థానం చెప్పారు నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు నిత్యం ప్రజల మధ్య ఉంటూ సేవలందిస్తున్నారు త్రాగునీటి శాశ్వత పరిష్కారం కల్పిస్తున్నారు డివిజన్లో రోడ్లకు అండర్ డ్రైనేజ్ సిస్టమును ఏర్పాటు చేస్తామన్నారు చౌరస్తాలలో సొంత ఖర్చులతో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తానని తెలిపారు ఈనెల 11న జరిగే పోలింగ్ తేదీన చేతి గుర్తు ఓటు వేసి గెలిపించాలని కోరారు

ప్రధానిని ఒప్పించి అమృత్ సిటీతో గజ్వేల్ అభివృద్ధి

- అధికారం లేని బీఆర్ఎస్, నిధుల్లేని కాంగ్రెస్
- రైతుల భూములు లాక్కున్న టీఆర్ఎస్‌కు గజ్వేల్‌లో శిక్ష ఖాయం
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 7: అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నిధుల కొరతతో ఉండగా, బీఆర్ఎస్ పార్టీ కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో లేదని, అలాంటి పార్టీలకు ఓటేస్తే తెలంగాణకు ఒరిగేదేమీ లేదని మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు . గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శనివారం నాడు గజ్వేల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. అధికారం లేని బీఆర్ఎస్, నిధుల్లేని కాంగ్రెస్‌తో పట్టణాల అభివృద్ధి అసాధ్యమని స్పష్టం చేశారు. ప్రజలకు నిజమైన అభివృద్ధి కావాలంటే బీజేపీకే ఓటు వేయాలని ఈటల పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పరిస్థితి మరింత దయనీయంగా ఉందని, గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలకే ఒక్క రూపాయి నిధులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఎద్దేవ చేశారు.ఈ పరిస్థితుల్లో మున్సిపాలిటీలకు కాంగ్రెస్ ఏం చేస్తుందని ప్రశ్నించిన ఈటల, కాంగ్రెస్‌కు ఓటేస్తే మున్సిపాలిటీలు అభివృద్ధి కేంద్రాలుగా కాకుండా పాలకుల స్వార్థ ప్రయోజనాల కేంద్రాలుగా మారుతాయన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు గెలిస్తే ప్రస్తుత ప్రభుత్వ సహకారం ఉండదని, దాని భారం నేరుగా పట్టణ ప్రజలపై పడుతుందని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలు అన్నీ కేవలం 15వ, 16వ ఫైనాన్స్ నిధుల కోసమే ప్రభుత్వం నిర్వహిస్తోందని విమర్శించారు. మీడియాను అడ్డుపెట్టుకుని ఆర్భాటం చేస్తూ ప్రజలను మభ్యపెడుతోందని మండిపడ్డారు. మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ పూర్తి సహకారం ఉంటుందని పేర్కొన్న ఈటల, తాను మోదీని ఒప్పించి గజ్వేల్‌కు అమృత్ సిటీ తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణకు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి ఎలా చేయాలో చేసి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్, కొండా పోచమ్మ సాగర్ ప్రాజెక్టుల కారణంగా వేలాది రైతులు భూములు కోల్పోయారని, పరిశ్రమల పేరిట ప్రభుత్వం అనేక ఎకరాల భూములను గుంజుకుందని ఆరోపించారు. భూములు తీసుకునే సమయంలో ఇచ్చిన హామీలు నేటికీ నెరవేర్చలేదని, ముంపు బాధిత రైతుల పరిస్థితి చేపను నీటిలో నుంచి బయటకు తీసినట్లుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలు గత పాలనలో జరిగిన విధ్వంసానికి సజీవ సాక్ష్యాలని, పదేళ్లు గడిచినా బాధితులు బీఆర్ఎస్ వైపు చూడరని స్పష్టం చేశారు. రైతుల భూములు లాక్కున్న టీఆర్ఎస్‌కు గజ్వేల్‌లో శిక్ష తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా బీజేపీ అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, కప్పర ప్రసాద్ రావు, గజ్వేల్ ఎన్నికల ఇంచార్జ్ ఆకుల విజయ్, సీనియర్ నాయకులు ఎల్ల రామిరెడ్డి, నలగామ శ్రీనివాస్, సింగం సత్తయ్య, బండారు మహేష్, పట్టణ అధ్యక్షులు మనోహర్ యాదవ్‌తో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రాంతీయం

అత్యాధునిక టెక్నాలజీతో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ

- 120 మెట్రిక్ టన్నుల ప్రాసెస్ సామర్థ్యం
- వ్యర్థాలతో నాలుగు మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం
- ఉత్తర తెలంగాణకు వర ప్రదాయిని
- ఆయిల్ రిఫైనరీ యూనిట్ కు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి
- రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రతిపక్షం,నంగునూరు, ఫిబ్రవరి 7: రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో పండిన ఆయిల్ ఫామ్ పంటను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.రాష్ట్ర వ్యవసాయ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న మొదటి రోజే నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి సంబంధించిన ఫైల్ సంతకం పెట్టామన్నారు. దేశంలోనే అత్యాధునిక టెక్నాలజీతో నర్మెటలోని ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని నిర్మించినట్లు తెలిపారు. ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డితో కలిసి నంగునూరు మండలం నర్మెటలోని ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఈనెల చివరిలో గాని వచ్చే నెల మొదటి వారంలో గాని రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభించేందుకు అవసరమైన తీసుకుంటున్నామని తెలిపారు. అందులో భాగంగానే ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సందర్శించినట్లు చెప్పారు. ఫ్యాక్టరీలో దాదాపు అన్ని పనులు పూర్తయ్యాయని అన్నారు. ఆయిల్ ఫామ్ పిప్పి తో కూడిన వ్యర్థాలతో నాలుగు మెగావాట్ల కెపాసిటీ గల విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ పూర్తవుతోందని చెప్పారు. పనులు మొత్తం పూర్తిగా గానే ఫ్యాక్టరీ ప్రారంభించడానికి ముఖ్యమంత్రి సమయం కోరుతామన్నారు. ఫ్యాక్టరీలోనే మూడు రోజుల పాటు రైతు మేళా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆయిల్ ఫామ్ పంటలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేసి వ్యవసాయ యాంత్రీకరణ, అధునాతన వ్యవసాయ పద్ధతులపై ప్రదర్శన చేపడతామని తెలిపారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులచే రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

120 మెట్రిక్ టన్నుల ప్రాసెస్..

ఉత్తర తెలంగాణకు వరప్రదాయిని

నర్మెటలో నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ లో 120 మెట్రిక్ టన్నుల వరకు గెలలను ప్రాసెస్ చేసే అవకాశం ఉందన్నారు. ఈ ఫ్యాక్టరీ ఉత్తర తెలంగాణకు వరప్రదాయనిగా మారుతుందన్నారు. ఒకటిన్నర సంవత్సరంలోనే ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణం ప్రారంభించిన రోజు ఆయిల్ ఫామ్ గెల ఒక మెట్రిక్ టన్నుకు రూ.12 వేలు మాత్రమే అని చెప్పారు. ప్రస్తుతం రూ.24,456లకు పెరిగిందన్నారు. మన రాష్ట్రంలో నిర్ణయించే ఆయిల్ ఫామ్ గెలల ధర దక్షిణ భారత దేశంలో అమలవుతున్నదని అన్నారు. రాష్ట్రంలో మూడు, నాలుగు సంవత్సరాల నుండి ఆయిల్ ఫామ్ తోటలను పెంపకం పెరిగిందన్నారు. ఈ తోటల నుంచి పంట చేతికొచ్చే సమయానికి ఫ్యాక్టరీ అందుబాటులో దీని నిర్మాణాన్ని వేగంగా వేగంగా చేపట్టామన్నారు. ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ముఖ్యమంత్రి ప్రారంభించడంతో పాటు ఆయిల్ రిఫైనరీ యూనిట్ నిర్మించడానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. దేశంలో ప్రస్తుతం 12 లక్షల ఎకరాలలో ఆయిల్ ఫామ్ పంట సాగు అవుతోందన్నారు. దేశంలో 70 లక్షల ఎకరాలకు ఆయిల్ ఫామ్ పంట సాగు చేయవలసిన అవసరం ఉందన్నారు. సిద్ధిపేట జిల్లాలో 14 నుండి 15 వేల ఎకరాలలో ఆయిల్ ఫామ్ పంట సాగు అవుతోందన్నారు. రూ.లక్ష కోట్ల విలువైన పామాయిల్ ను ఇతర దేశాల నుండి మనదేశానికి దిగుమతి చేసుకుంటున్నామని తెలిపారు. ఎలాంటి నష్టం కలగజేయని ఆయిల్ ఫామ్ పంటను పండించేందుకు రైతులు ముందుకు రావాలని కోరారు. ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ప్రారంభించేందుకు ఎవరినైనా పనుల పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. ఖమ్మంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయిల్ ఫామ్ తోటను స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆయిల్ ఫామ్ పంటలు పండిస్తున్నారని చెప్పారు. ఆయిల్ ఫామ్ రైతులకు ఎలాంటి మార్కెటింగ్ ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేస్తున్నామన్నారు. ఎకరాకు రూ.లక్ష పైన ఆదాయం వచ్చే ఏకైక పంట ఆయిల్ ఫామ్ పంట ఒక్కటేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన వన శాఖ డైరెక్టర్, ఆయిల్ ఫెడ్ ఎండి యాస్మిన్ భాష, ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా ఉద్యాన వన అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, ఆయిల్ ఫెడ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాటలు నీటి మూటలు

- మరోసారి మోసపోవద్దు
- ఈ నెల 11న కారు గుర్తుకు ఓటేయండి
- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 7 : కాంగ్రెస్కు ఓటేసి మరోసారి మోసపోవద్దని మాజీ డిప్యూటీ స్పీకర్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం.పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. మెదక్ పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు అంకం. చంద్రకళ, (ఆర్కే)రామగిరి.శ్రీనివాస్,మ్యాదరి దీపక్ కుమార్,అస్తరిగళ్ల పల్లె రాణి బాలరాజ్,బండి పూజ నరేష్ , ఆరేళ్ళ గాయత్రి మల్లికార్జున్ గౌడ్, నింగమైల. కిరణ్ తరుపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ సహకారంతో మెదక్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానన్నారు. పట్టణ ప్రజల చిరకాల కోరిక అయిన మెదక్ జిల్లా కేంద్రం ఏర్పాటు చేసి ప్రజల కల నెరవేసినట్టు చెప్పారు. కలెక్టరేట్,జిల్లా ఎస్పీ కార్యాలయం, రోడ్ల విస్తరణ తోపాటు ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు.గత ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. మిషన్ భగీరథ పథకం త్రాగు నీటి ఎద్దడి పరిష్కారం,పంటల సాగుకు నిరంతరంగా 24 గంటల విద్యుత్ సరఫరా, రైతు బీమా, రైతు బంధు పథకాలను అమలు చేసినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ హామీలు నీటి మూటలు అయ్యాయని అన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు.ఆసరా పెన్షన్లు ,రైతులకు సంపూర్ణ రుణమాఫీ, కళ్యాణ లక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామన్న హామీలు నెరవేర్చడం లేదని ఆరోపించారు. మెదక్ పట్టణంలో అభివృద్ధి పడక వేసిందని,మెదక్లో ఎక్కడ చూసినా తాను చేసిన అభివృద్ధి పనులు దర్శనమిస్తున్నాయని అన్నారు. రెండేళ్లుగా ఒక అభివృద్ధి పని జరగలేదని చెప్పారు. ఇది మల్కాజిగిరి కాదని,ఇక్కడ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే చూస్తూ కోరుకునేది లేదన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ఆశీర్వదించి,అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. దొంగ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ను ప్రజలు మరోసారి నమ్మి మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ నాయకులు ఓటు కోసం వస్తే హామీల అమలుపై నిలదీయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్తోనే అభివృద్ధి సాధ్యమని,మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ద్విచక్ర వాహనం చోరీ

- సీసీ కెమెరాల ఆధారంగా నిందితుని గుర్తింపు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 7 : సిద్దిపేట అర్బన్ మండలం 3 టౌన్ పరిధిలో గల టి హెచ్ ఆర్ నగర్ లో చిలుక సాయి కుమార్ కు చెందిన లేజర్ మోటార్ సైకిల్ దొంగతనానికి గురైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. త్రీ టౌన్ సిఐ లక్ష్మీ బాబు తెలిపిన వివరాల ప్రకారం మోటార్ సైకిల్ దొంగతనానికి గురైందని వచ్చిన ఫిర్యాదుతో సీసీ కెమెరాల ఆధారంగా సాయంత్రం వరకు నిందితుడు వల్లపు రాజు 43, ఆకారం దుబ్బాక మండలం ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. ప్రధాన వ్యాపార కూడలిలలో కాలనీలోని ప్రధాన కూడలిలలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని ఈ సందర్భంగా సిఐ తెలిపారు. ఇటువంటి దొంగతనాలు జరిగినప్పుడు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన క్రైమ్ ఏఎస్ఐ శ్రీనివాస్, క్రైమ్ పార్టీ కానిస్టేబుల్ మంత్రి శ్రీనివాస్, బాబులను సీఐ అభినందించారు.

రెండేళ్ల పాలనలో పాలేందో, నీళ్లేందో ప్రజలకు తెలిసింది

- ఆధిపత్యం కావాలా? అభివృద్ధి కావాలా?
- నర్సారెడ్డి, మైనంపల్లి వర్గ పోరుతో తూప్రాన్ అభివృద్ధి ఆమడ దూరం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు



ప్రతిపక్షం, గజ్వేల్ /తూప్రాన్, ఫిబ్రవరి 7: రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో పాలెందో నిల్లెందో ప్రజలకు స్పష్టంగా తెలిసిందన్నారు. రెండున్నర సంవత్సరాల్లో గజ్వేల్లో ఒక్క సీసీ రోడ్డు కూడా వేయలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్రావు విమర్శించారు.గజ్వేల్ ప్రజ్ఞాపూర్, తూప్రాన్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గజ్వేల్కు రాసిన ఉత్తరాలు గద్వాల్కు వెళ్లేవని, కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత గద్వాల్కు రాసిన ఉత్తరాలు గజ్వేల్కు వచ్చే పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. రెండేళ్లలో గజ్వేల్ రోడ్లపై గుంతలు పడితే పూడ్చే సోయి కూడా కాంగ్రెస్ నాయకులకు లేదని ఆరోపించారు. గజ్వేల్ అభివృద్ధి అంతా కేసీఆర్ హయాంలో జరిగిందని, కాంగ్రెస్ పార్టీ ఈ ప్రాంతానికి చేసింది ఏమీలేదని అన్నారు. ఇటీవల ఒక బీజేపీ ఎంపీ మిషన్ కాకతీయపై నోటికొచ్చినట్లు మాట్లాడుతూ 50 వేల కోట్లు తిన్నారని ఆరోపణలు చేయడం దురదృష్టకరమన్నారు. కేసీఆర్ పాలనలో గజ్వేల్లో భూముల ధరలు కోట్లకు పెరిగాయని, రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత బంగారం ధరలు పెరిగి భూముల ధరలు పడిపోయాయని విమర్శించారు. కేసీఆర్ మొత్తం తెలంగాణను బ్రహ్మాండంగా అభివృద్ధి చేశారని, రేవంత్ రెడ్డి ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. కేసీఆర్ కట్టించిన భవనాలకు రిబ్బన్లు కట్ చేయడం, ఆయన ప్రారంభించిన పథకాలను మళ్లీ ప్రారంభించడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేసింది ఏమీలేదన్నారు. బీజేపీ పాలలో ధరలు, జీఎస్టీలు పెంచడం తప్ప ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కరోనా సమయంలో ప్రజల కోసం తాను తిరిగానని, అప్పట్లో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఎక్కడ ఉన్నారో ప్రజలే గుర్తు చేసుకోవాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఆధిపత్య రాజకీయాలు కావాలా? అభివృద్ధి కావాలా? అని ప్రజలు ఆలోచించాలని హరీష్రావు పిలుపునిచ్చారు. గతంలో కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని గుర్తు చేస్తూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఒకప్పుడు తూప్రాన్లో మూడు రోజులకోసారి మాత్రమే మంచినీళ్లు వచ్చేవని, అప్పట్లో ప్రజలు బిందెలతో రోడ్డెక్కి నిరసనలు తెలిపేవారని గుర్తు చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఇచ్చి మహిళల నీళ్ల కష్టాలు తీర్చారని అన్నారు. తూప్రాన్ను మున్సిపాలిటీగా మార్చడం, ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేయడం, ఫోర్ లైన్ రోడ్లు వేయడం వంటి అభివృద్ధి పనులు కేసీఆర్ హయాంలోనే జరిగాయని తెలిపారు. కేసీఆర్ రాకముందు తూప్రాన్కు పిల్లనియ్యాలంటే నీళ్ల సమస్య భయపెట్టేదని, నేడు తూప్రాన్కే పిల్లనియ్యాలనిపించే స్థాయికి అభివృద్ధి జరిగిందన్నారు. పది లక్షల విలువ లేని భూములను కోటి రూపాయల విలువకు తీసుకెళ్లిన కేసీఆర్ పాలనను, ప్రస్తుత కాంగ్రెస్ పాలనతో పోల్చారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత భూముల ధరలు పడిపోయి, బంగారం ధరలు ఆకాశాన్ని తాకాయని విమర్శించారు. తూప్రాన్లో కాంగ్రెస్ నాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని, నర్సారెడ్డి-మైనంపల్లి మధ్య రాజకీయ గొడవల కారణంగా ప్రజలు నష్టపోతున్నారని ఆరోపించారు. గత రెండేళ్లుగా తూప్రాన్ అభివృద్ధిని కావాలనే అడ్డుకుంటున్నారని, రోడ్లకు గుంతలు పడితే డాంబర్ వేసే పరిస్థితి కూడా లేదని అన్నారు. 50 పడకల ఆసుపత్రిలో డాక్టర్లు లేకపోవడంతో రోగులను మెదక్, గజ్వేల్కు పంపిస్తున్నారని తెలిపారు. మహిళలకు 2,500 ఇస్తామని హామీ ఇచ్చి రేవంత్ రెడ్డి మోసం చేశారని, 26 నెలల్లో ఒక్కో మహిళకు 65 వేలు బాకీ పడ్డారని అన్నారు. కల్యాణ లక్ష్మి చెక్కులు ఆపేశారని, కేసీఆర్ హయాంలో ఇచ్చిన పెన్షన్లు, రైతుబంధు వంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. కరోనా కష్టకాలంలో కూడా రైతుబంధు ఆపలేదని, ఇప్పుడు రెండు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారని విమర్శించారు. బీజేపీపై కూడా విమర్శలు చేస్తూ, తూప్రాన్కు ఒక్క హాస్పిటల్ అయినా కట్టించారా? కల్యాణ లక్ష్మి ఇచ్చారా? అని ప్రశ్నించారు. 15 లక్షలు ఇస్తామని రెండు ఏళ్లుగా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణకు ఒక్క ప్రాజెక్టు కూడా ఇవ్వలేదని చెప్పారు. పువ్వు గుర్తుకు ఓటేసినా, ఓటును మోరీలో వేసినట్టేనని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి భాషపై తీవ్ర విమర్శలు చేస్తూ, ఇది ముఖ్యమంత్రి మాట్లాడే భాష కాదని అన్నారు. ఇలాంటి బూతుల ముఖ్యమంత్రికి ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఐదేళ్ల కోసం కౌన్సిలర్లను గెలిపించాలని, రెండేళ్ల తర్వాత మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తూప్రాన్ అభివృద్ధి బాధ్యత తనదేనని, ఏ పని ఉన్నా చేసి పెడతానని హామీ ఇచ్చారు. అదేవిధంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా హరీష్ రావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర బీఆర్ఎస్ కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జాగ్రత్తగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 7: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ను జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను ఆదేశించారు. తూప్రాన్ మున్సిపాలిటీకి సంబంధించి తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ను మున్సిపల్ కమిషనర్ తో కలిసి పరిశీలించారు.తూప్రాన్ మున్సిపాలిటీ కి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు వీలుగా తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ను కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం పరిశీలించారు. ఓటర్ జాబితా నెంబర్,, ఓటర్ జాబితాలో సీరియల్ నెంబర్ను పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు డ్యూటీ ఆర్డర్ తో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తింపు కార్డు తీసుకుని రావాలని సూచించారు..ఓటింగ్ సరళి వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ను పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతగా జరిగేలా చూడాలని, ప్రతీ అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ మద్యపానంపై కఠిన చర్యలు

- సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 7: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఇకపై కఠిన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ తెలిపారు. ఇప్పటివరకు ఈ తరహా కేసుల్లో కేవలం జరిమానా మాత్రమే విధించగా, ఇకపై ఈపెట్టీ కేసుల్లో కూడా జైలు శిక్ష విధించనున్నట్లు స్పష్టం చేశారు.మద్యం సేవించి అసభ్యంగా ప్రవర్తించడం, గొడవలకు పాల్పడడం లేదా ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు కమిషనర్ హెచ్చరించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. ఎక్కడైనా బహిరంగ మద్యపానం జరుగుతున్నట్లు గమనించినట్లయితే వెంటనే డయల్ 100 లేదా సమీపంలోని స్థానిక పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.



విద్యార్థి దశలోనే పుస్తక రచన గొప్ప అలవాటు

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 7: విద్యార్థి దశలోనే పుస్తకాలు రచించడం అత్యంత గొప్ప అలవాటని స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. శనివారం క్యాంప్ ఆఫీస్లో స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాల విద్యార్థి పొట్టి వెంకటేష్ స్వయంగా రచించిన ఆధునిక కంప్యూటర్ వ్యవస్థలో వస్తున్న మార్పులు అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... ఒకప్పుడు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారిని ఎంతో గొప్పగా చూసేవారని, అయితే నేటి మారుతున్న కాలానికి అనుగుణంగా కేవలం కంప్యూటర్ పరిజ్ఞానం మాత్రమే సరిపోదని, అందులో లోతైన జ్ఞానం కూడా అవసరమని తెలిపారు. ఆధునిక కంప్యూటర్ వ్యవస్థలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శాసిస్తున్నందున, దానికి అనుగుణంగా విజ్ఞానం సంపాదించినప్పుడే కంప్యూటర్ రంగంలో నిలదొక్కుకోగలమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలను భారతీయులే ముందుండి నడిపించడం మన దేశానికి గర్వకారణమని ఆయన తెలిపారు. అంత చిన్న వయసులోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్పై, అది కూడా సులభమైన పదజాలంతో అందరికీ అర్థమయ్యేలా పుస్తకం రచించడం హర్షించదగ్గ విషయమని పేర్కొంటూ, రచయిత ప్రతిభా డిగ్రీ కళాశాల విద్యార్థి వెంకటేష్ను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ...తన పుస్తక రచనకు ఎంతో ప్రోత్సాహం అందించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సూర్య ప్రకాష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బీఆర్ఎస్ ఖాతాలో వేయాలి

- ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి హరీష్ రావు

ప్రతిపక్షం, చేగుంట, ఫిబ్రవరి 7: తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ పదవి బిఆర్ఎస్ ఖాతాలో వేయాలని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పిలుపునిచ్చారు. భారత రాష్ట్ర సమితి తరపున పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థుల గెలుపు కోసం ఆయన శనివారం ప్రచారం నిర్వహించారు. తూప్రాన్ లోని పలు వీధుల్లో మున్సిపల్ పరిధి లోని ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. టిఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులను ఆయన వివరించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మభ్యపెడుతుందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దు అని పిలుపునిచ్చారు. ముందు వచ్చేది మన ప్రభుత్వమేనని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు. పెన్షన్లు రైతుబంధు రుణమాఫీ అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కెసిఆర్ ప్రవేశపెట్టిన పథకాలను నీరుగారుస్తున్నారని విమర్శించారు. ప్రజలను మభ్యపెడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు హరీష్ రావును సన్మానించారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి టిఆర్ఎస్ నాయకులు కౌన్సిలర్ అభ్యర్థులు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



ప్రపంచానికి భారత్ ఇచ్చిన గొప్ప వరం తమిళం. తమిళ సాహిత్యం, సంస్కృతి చాలా గొప్పవి. మానవాళికి తమిళ ప్రజలు తమదైన ప్రతిభతో సేవ చేస్తున్నారు. ఇండియా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ సహా కేంద్ర కేబినెట్లో కీలక స్థానంలో తమిళులు ఉండడం గర్వంగా ఉంది. భిన్నత్వంలో ఏకత్వం భారత సంస్కృతి.

- మలేషియా పర్యటనలో ప్రధాని మోడీ

ప్రాంతీయం

ప్రజాసేవలో కాంగ్రెస్ అభ్యర్థులు ముందుంటారు

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనాంపల్లి హనుమంతరావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ అభ్యర్థులు ప్రజాసేవలో ముందుంటారని ప్రజా సంక్షేపం కోసం ఆలోచించే వారికే అభ్యర్థులుగా ప్రజల ముందు పెట్టడం జరిగిందని వారికి మాత్రమే ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పిలుపునిచ్చారు. శుక్రవారం వివిధ వార్డులలో అయినా సుడిగాలి పర్యటన చేశారు. 24.26. 10.27. 13. 11. వివిధ వార్డులలో విస్తృతంగా అయిన పర్యటించారు. ప్రజలతో మమేకమై ఆయన ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులలో వివిధ రకాల సమస్యలను ఎలా పరిష్కరిస్తామో ప్రజలకు వివరించి తెలుపుతూ ప్రభుత్వ తరపున ఎలా అభివృద్ధి చేస్తామని మైనంపల్లి స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఎలా అభివృద్ధి చేస్తాము ఒక్కసారి మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగురుతే ప్రజలకు తెలుస్తుందని ఆయన అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని కాంగ్రెస్ కౌన్సిలర్ కూతురు దగ్గర ఉండి పని చేపిస్తానని ఆయన తెలిపారు. గత పది సంవత్సరాల మెదక్ పట్టణ అభివృద్ధికి నోచుకోలేదని ఇక్కడ నిధులన్నీ ఇతర నియోజకవర్గాలకు వెళ్లాలని ఆయన తెలిపారు. మెదక్ లో సిద్దిపేట్ లాగా అభివృద్ధి పరిచిన అంటున్న మాజీ మంత్రి హరీష్ రావు సిద్ది పేట పట్టదానికి ఎన్ని నిధులు తీసుకువెళ్లాడు మెదక్ పట్టణానికి ఎన్ని నిధులు తీసుకోవచ్చాడు చెప్పాలని ప్రజలకు వివరించాలని ఆయన అన్నారు. అప్పుడే అయినా ఓటు అడగాలని ఆయన తెలిపారు మెదక్ పట్టణ అభివృద్ధికి వచ్చిన నిధులన్నీ సిద్దిపేట గజ్వేల్ మున్సిపాలిటీలకు తరలించి అక్కడ అభివృద్ధి పరిచిన ఘనత మంత్రి హరీష్ రావుకు దక్కిందని ఆయన తెలిపారు మెదక్ అభివృద్ధి చెందాలంటే అది కేవలం కాంగ్రెస్ పార్టీ తోటే సాధ్యమైతుందని ఆయన తెలిపారు గత పది సంవత్సరాల పాలనలో రేషన్ కార్డులకు ఇవ్వలేని బీఆర్ఎస్ ప్రభుత్వం ఈరోజు ప్రజలను పక్కదారి పట్టించడానికి గల్లిబల్లి మాటలు చెప్పి ప్రజల మైండ్ సెట్ ను పక్కదారి పట్టించడానికి వస్తున్నారని ప్రజలందరూ గ్రహించి తిరగబడాలని ఆయన పిలుపునిచ్చారు. డబుల్ బెడ్రూంలో పేద ప్రజలకు ఇవ్వకుండా కేవలం బిఆర్ఎస్ కార్యకర్తలకు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు భగీరథ మంచినీళ్ల కోసం తవ్విన సిసి రోడ్లను తిరిగి వేయకుండా ప్రతి వార్డులలో గుంతలు గుంతలుగా రోడ్లు ఉన్నాయని అయినా ప్రజలకు గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాల కోసం వారి అభివృద్ధి కోసం ఆలోచించే పార్టీ దేశంలో ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ పార్టీ అని కాంగ్రెస్ పార్టీకి కులమత లతో పనిలేదని పేద ప్రజలకు అండగా ఉండి వారి అభివృద్ధికి కోసం ఆలోచించే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని కాంగ్రెస్ పార్టీకి మంచి కార్యకర్తలు నాయకులు ఉన్నారని ఆయన తెలిపారు ఇప్పటికైనా ప్రజలు ఆలోచన చేసి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఆయన తెలిపారు. మైనంపల్లి స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా మెదక్ రామాయంపేట మరిన్ని కార్యక్రమాలు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ప్రజల కోసం ప్రజా సమస్యల కోసం పరితపించే నాయకులు మైనంపల్లి రోహిత్ ఉన్నారని ఆయన గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 26వ వార్డు అభ్యర్థి కొరివి రాములు. 27వ వార్డు అభ్యర్థి అయితరం లలిత.24 వ వార్డు అభ్యర్థి కానుగు రాధా భూపతిరాజ్. 13వ వార్డు అభ్యర్థి సమయుద్దిన్. 11వ వార్డు అభ్యర్థి భవాని. తో పాటు కాంగ్రెస్ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గంగాధర్ కాంగ్రెస్ నాయకులు ఉప్పల రాజేష్ బొజ్జ పవన్ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పరశురామ్ గౌడ్ తదితరులు ఉన్నారు.





మరో అవకాశం ఇవ్వండి

అసంపూర్తి పనులు పూర్తి చేస్తా

- వార్డులో 90 శాతం పనులు పూర్తి చేశా

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 7: మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ ప్రచారం వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి గుంటుకు శిరీష రాజు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటుకు శిరీష రాజు మాట్లాడుతూ గతంలో కౌన్సిలర్ గా చేసిన అనుభవంతో వార్డు ప్రజలతో తనకు విడదీయరాని సంబంధం ఉందన్నారు. వార్డులో ఏ సమస్య వచ్చినా తాను ముందుండి పరిష్కరించానని, అందుకే ప్రజలు తమను ఆదరిస్తున్నారని తెలిపారు. వార్డులో ఇప్పటికే 90 శాతం అభివృద్ధి పనులు పూర్తి చేశామని, మిగిలిన 10 శాతం పనులు గెలిచిన వెంటనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. వార్డులోని ప్రతి గల్లీలో సీసీ రోడ్లు వేయించిన ఘనత, ఇంటింటికి మిషన్ భగీరథ నల్లా నీరు అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, కేసీఆర్ కిట్, కంటి వెలుగు వంటి పథకాలు ప్రతి గడపకు చేరాయని, ప్రజలు ఇంకా ఆ మేలును గుర్తుంచుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడుస్తున్నా, మున్సిపాలిటీలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, మున్సిపాలిటీ పూర్తిగా అంధకారంలోకి వెళ్లిపోయిందని విమర్శించారు. వార్డు ప్రజలు అభివృద్ధిని కాంక్షించి, కారు గుర్తుకే ఓటు వేస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారని, మళ్లీ మున్సిపల్ పీఠంపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మున్సిపాలిటీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి సృజన టెక్ ఫెస్ట్ పోటీలకు

సిద్దిపేట పాలిటెక్నిక్ విద్యార్థుల ఎంపిక

ప్రతిపక్షం, నంగునూరు, ఫిబ్రవరి 7: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, అనుబంధ ఇంజనీరింగ్ విభాగంలో సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని రాజగోపాలపేట లోని సిద్దిపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్ ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించింది. ఈ నెల 6వ తేదీన సిద్దిపేట పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన పోటీలలో ప్రదర్శన ఈ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయింది. ఈ టెక్ ఫెస్ట్ లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎనిమిది పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం ఎనిమిది ప్రాజెక్ట్ లను ప్రదర్శించారు. ఈ పోటీలకు వై రాజు సమన్వయకర్తగా వ్యవహరించారు. జరిగిన ఈ పోటీలకు కేసముద్రం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఇ.మల్లికార్జున్ పటాన్ చెరువు బియస్ఎన్ఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ చైతన్య న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీలలో సిద్దిపేట పాలిటెక్నిక్ విద్యార్థులు మొదటి స్థానం, నారాయణఖేడ్ పాలిటెక్నిక్ విద్యార్థులు రెండవ స్థానం, గజ్వేల్ పాలిటెక్నిక్ విద్యార్థులు మూడవ స్థానం సాధించారు. ఈ సందర్భంగా సృజన టెక్ ఫెస్ట్ పోటీలలో మొదటి స్థానం పొందిన సిద్దిపేట పాలిటెక్నిక్ విద్యార్థులను ఎలక్ట్రానిక్స్ శాఖధిపతి వై రాజును మరియు ప్రాజెక్ట్ గైడ్ రాజమౌళిని ప్రధానాచార్యుడు అలుగోజు గోవర్ధన్, వివిధ విభాగ అధిపతులు అభినవ్, షెహాబాజ్, రాజు, ఎ.ఓ.రాజేశ్ అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



సిబ్బందికి విధులు, బాధ్యతలు గుర్తు చేసిన కలెక్టర్

- పనితీరుపై అధికారులతో ఆరా

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 7 : కలెక్టరేట్ కార్యాలయంలోని పలు వివిధ శాఖల కార్యాలయాలను కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్ఐసీ కార్యాలయం తో పాటు డిఆర్డిఓ, సివిల్ సప్లై, సంక్షేమ శాఖ , కార్యాలయాలను పరిశీలిస్తూ . అధికారులు సిబ్బంది పనితీరును ఆరా తీశారు. కార్యాలయాల్లో సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతూ ఆ శాఖ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యాలయాలు పరిశీలనలో కలెక్టర్ వెంట డి.ఆర్.ఓ భుజంగరావు డిఆర్డిఓ శ్రీనివాసరావు,, ఏవో యూనస్, సూపరిండెంట్ రవీందర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అధికార పార్టీ గెలిస్తే అభివృద్ధి

- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీ అని స్థానిక సంస్థలలో సైతం కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే అభివృద్ధి ముందుకు పోతుందని గత పది సంవత్సరాల పాలనలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మెదక్ పట్టణాన్ని అభివృద్ధి పరచాలంటే కాంగ్రెస్ జెండా ఎగరాలని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. శనివారం వివిధ వార్డులలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజల సమస్యలు తీర్చాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు మెదక్ మున్సిపాలిటిని రాష్టంలోనే ప్రథమ స్థానంలో ఉండేలా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. చేతి గుర్తుకు ఓటేసి మా అభ్యర్థులను గెలిపిస్తే అన్ని వార్డులో ఉన్న సమస్యలను తీర్చ ప్రతి ఒక్కరి మౌలిక సదుపాయాలను నెరవేరుస్తామన్నారు. ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ అభ్యర్థులు రాగి అశోక్. తోపాటు అభ్యర్థులు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

- ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రతిపక్షం, మిడిదొడ్డి, ఫిబ్రవరి 7: విద్యతోనే సర్వతో ముఖాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా అల్వాల కూడలిలోని పీఎంశ్రీ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.... గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలన్నారు. చరవాణిల జోలికి పోకుండా వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చాటాలన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు విద్యపై మక్కువ పెంపొందించుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ తమ వ్యక్తిగత ఖర్చులను తగ్గించుకొని విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ప్రిన్సిపల్ రఘునందన్ రావు విధి నిర్వహణలో పాఠశాల దిన దినాభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్ రెడ్డి, ఎంఈఓ ప్రవీణ్ బాబు, నైపుణ్య ఆర్గనైజేషన్ చైర్మన్ తోట కమలాకర్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాస్వామ్యానికి ఓటే పునాది

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట ఫిబ్రవరి 7: ప్రజాస్వామ్యానికి ఓటే పునాదని, శత శాతం ఓటింగ్ కోసం ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకోవాలని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులకు ప్రకటన విడుదల చేస్తూ మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని కోరారు. ఓటు వజ్రాయుధం వంటిదని, ఎలాంటి ప్రలోభాలకు లోను కావద్దని సూచించారు.



రామంచ విద్యార్థుల విహారయాత్ర

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 7: సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారంకు విహారయాత్రకు వెళ్లారు. చందులాపూర్ లోని రంగనాయక స్వామిని దర్శించుకున్నారు. ప్రాజెక్టును సందర్శించి విశేషాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆటపాటలతో ఆనందం పారవశ్యంలో మునిగి మునిగి పోయారు. వనభోజనాల తరహా సహపంక్తి భోజనాల్లో సర్పంచ్ వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యంసాని వెంకట సురేశ్ కుమార్, సర్పంచ్ భవాని నవీన్ కుమార్, ఉపసర్పంచ్ పావని తిరుపతిరెడ్డి, వార్డు సభ్యులు భారతమ్మ, రమ, సంతోష, సుమలత, ఉపాధ్యాయులు సునీత, అబేద బేగం, నాగమణి, వాణి, స్వరూప, వరప్రసాద్, యాదయ్య తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.



లక్ష్మీ నరసింహస్వామి దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

ప్రతిపక్షం, చేగుంట, ఫిబ్రవరి 7: లక్ష్మీ నరసింహస్వామి దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆకాంక్షించారు. చేగుంట మండలం బి, కొండాపూర్ సింగరాయగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. గ్రామ సర్పంచ్ రంగయ్య గారి రాజిరెడ్డి ఆలయ కమిటీ నిర్వాహకుల సమక్షంలో శనివారం రథోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తో పాటు ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పాల్గొన్నారు. వారం రోజులు పాటు జరిగిన ఉత్సవాల్లో లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణం బండ్ల బోనాల ఊరేగింపు స్వామివారి రథయాత్ర ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసరా మిఠాయి దుకాణాలను ఏర్పాటు చేశారు. కళాకారులు కళా ప్రదర్శనలచే భక్తులను ఆకట్టుకున్నారు. పరిసర ప్రాంతాల నుండి వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రవీణ రాజిరెడ్డి మాజీ సర్పంచ్ బాలనర్సు మాజీ ఎంపీటీసీ గూటం నవీన్ వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం కల్పించాలి

- అధికారులకు ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రతిపక్షం, అక్బర్‌పేట–భూంపల్లి, ఫిబ్రవరి 7: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యుత్ అధికారుల 'పల్లెబాట' కార్యక్రమం శనివారం జిల్లా విద్యుత్ అధికారుల ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పాల్గొని భూంపల్లి గ్రామంలో నిర్వహించారు.ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య విద్యుత్ అధికారులతో మాట్లాడుతూ... విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా ముందస్తు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. రైతులు కెపాసిటర్లను వినియోగించుకోవాలని, తద్వారా విద్యుత్ పొదుపుతో పాటు హై వోల్టేజ్, లో వోల్టేజ్ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.రైతులకు విద్యుత్ సమస్యలు ఎదురైన వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి తక్షణ పరిష్కారం కల్పిస్తామని తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఎత్తుగా పెరిగే చెట్ల వల్ల గాలులు, దుమారాలు వచ్చినప్పుడు సమస్యలు తలెత్తుతాయని, అలాంటి చెట్లను తొలగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పలు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని తక్షణమే పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం అక్బర్ పేట-భూంపల్లి మండలంలోని సర్పంచులు పాల్గొని తమ తమ గ్రామాల్లోని సమస్యలను వివరించారు. అనంతరం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పెరిగిన చెట్లను తొలగించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, డీఈ, ఏఈ, భూంపల్లి సర్పంచ్ జన్నారెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మండల కుమార్, సర్పంచులు మౌనిక-యేసురాజు, నారాయణరెడ్డి, రేణుక-రాజు, రజిత-దశరథ్, భాగ్యలక్ష్మి-చిరంజీవి, ప్రభాకర్, చంద్రం, దయాకర్, ఉపసర్పంచ్ బాలశెట్టి అనూష నందం, వార్డు సభ్యులు రంజిత్, ప్రవీణ్, కొండల్, విద్యుత్ అధికారులు, లైన్మెన్, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.





కేసీఆర్అక్రమాలపై చర్యలు తీసుకునే దమ్ము లేకపోతే రేవంత్ రాజీనామా చేయాలి. కేసీఆర్‌పై చర్యలు తీసుకోకుండా ఎవరు అడ్డుకుంటున్నారో రేవంత్ చెప్పాలి. చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సీఎంది కాదా? అధికారంలోకి వచ్చాక కేసీఆర్‌కు చిప్పకూడు తినిపిస్తా, దోచుకున్న డబ్బంతా కక్కిస్తా అని అన్నారు. ఇప్పుడు ఆయనపై ఈగ వాలకుండా చూసుకుంటున్నారు.
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

విశ్వ వీక్షణం

మలేషియా చేరుకున్న ప్రధాని



ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ప్రధాని నరేంద్ర మోదీ మలేసియాలో పర్యటిస్తున్నారు. రెండు రోజులపాటు ఆయన మలేసియాలో ఉంటారు. ఈ మేరకు ప్రత్యేక విమానంలో శనివారం సాయంత్రం మోదీ మలేసియా చేరుకున్నారు. ఆయనకు ఆ దేశ ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఘన స్వాగతం పలికారు. రాజధాని కౌలాలంపూర్‌లో చిన్నారులు రెండు దేశాల జాతీయ పతాకాలు చేతపట్టుకోగా.. మలేసియా ప్రధానితోపాటు ఇరు దేశాల ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఒకే కారులో మోదీ, అన్వర్ హోటల్‌కు చేరుకున్నారు. ప్రధాని హోదాలో మోదీ అక్కడ పర్యటించడం ఇది మూడోసారి. ఈ పర్యటన ద్వారా రెండు దేశాల మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలు బలోపేతం కావడంతోపాటు, కీలక అంశాల్లో సహకారం దిశగా ఒప్పందాలు జరగనున్నాయి. రక్షణ, భద్రత, ఆర్థిక పరమైన అంశాలపై మోదీ, అన్వర్ చర్చిస్తారు. మలేసియా ప్రధాని ఆహ్వానం మేరకు ఈ పర్యటన చేపడుతున్నట్లు మోదీ ప్రకటించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు వేగంగా బలోపేతం అవుతున్నాయని, ఈ పర్యటన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత వృద్ధి చేస్తుందని భావిస్తున్నట్లు మోదీ పేర్కొన్నారు. అలాగే మోదీ.. మలేసియాలోని భారతీయులతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. అక్కడ దాదాపు మూడు మిలియన్లకుపైగా భారత జాతీయులు నివసిస్తున్నారు.



భారత్ పై 25 శాతం అదనపు సుంకం రద్దు

రష్యా నుంచి చమురు కొనుగోళ్ల కారణంగా భారత్‌పై విధించిన అదనపు 25 శాతం ప్రతీకార సుంకాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రద్దు చేశారు. దీనికి సంబంధించి ఆయన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేసినట్లు వైట్ హౌస్ ప్రకటించింది. 2025 ఆగస్టులో రష్యా నుంచి భారత్ చమురు దిగుమతి చేసుకోవడాన్ని కారణంగా చూపుతూ అమెరికా 25 శాతం అదనపు సుంకాన్ని విధించింది. 'భారత్ పలు నిబంధనలను అంగీకరించిట్లు వైట్ హౌస్ తెలిపింది. 'భారత్ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా రష్యా చమురు దిగుమతులను నిలిపివేస్తామని అంగీకరించింది. అలాగే అమెరికా ఇంధన ఉత్పత్తులను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చింది. తదుపరి 10 సంవత్సరాల పాటు రక్షణ సహకారం విస్తరణకు ఫ్రేమ్‌వర్క్‌లో ప్రవేశించింది. ఈ చర్యల వల్ల భారత్ అమెరికా జాతీయ భద్రత, విదేశాంగ విధానం, ఆర్థిక ప్రయోజనాలతో తగినంతగా అనుసంధానమైంది. ఉన్నతాధికారుల సిఫారుసులు, తాజా పరిణామాల సమీక్ష అనంతరం ఈ సుంకాన్ని ఉపసంహరించుకోవాలని ట్రంప్ నిర్ణయించారు' అని వైట్ హౌస్ వెల్లడించింది.ఫిబ్రవరి 7, 2026 ఉదయం 12:01 నుంచి భారత్‌పై విధించిన 25శాతం అదనపు సుంకం తొలగిస్తున్నట్లు వైట్‌హౌస్ ఉత్తర్వులు జారీ చేసింది. హార్మోనైజ్డ్ టారిఫ్ షెడ్యూల్ కింద సంబంధిత సుంకాల నిబంధనలు రద్దు చేస్తున్నట్లు తెలిపింది. ఇప్పటికే వసూలు చేసిన సుంకాలను అమెరికా కస్టమ్స్ నిబంధనల ప్రకారం తిరిగి చెల్లిస్తామని పేర్కొంది. అవసరమైన నిబంధనలు, మార్గదర్శకాలు జారీ చేయడానికి అమెరికా విదేశాంగ మంత్రి, హోంల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి తదితరులకు అధికారాలు ఇచ్చారు.

ట్రెండ్‌కు తగిన బ్లౌజ్









ప్రతి ఒక్కరి జీవితంలో అతి పెద్ద వేడుక పెళ్లే.. ఇలాంటి వేడుకలో ప్రతిదీ గొప్పగా, అందంగా ఉండాలని కోరుకుంటూ ఉంటాం. వీటన్నింటినీ అందమైన జ్ఞాపకాలుగా ఫొటోల రూపంలో, వీడియోల రూపంలో బంధిస్తాం.. అందుకనే పెళ్లి జంటతో పాటు మిగిలిన వారు కూడా అందంగా, హుందాగా కనిపించడానికి అప్పటి ట్రెండ్, ఫ్యాషన్‌ను దృష్టిలో పెట్టుకుని రకరకాల దుస్తులను ఎంచుకుంటూ ఉంటారు. ముఖ్యంగా మహిళలు ఈ విషయంలో చాలా ముందుంటారు. నగల కన్నా, కట్టుకునే చీరలు వాటికి సంబంధించిన బ్లౌజులపైనే ఎక్కువ దృష్టి పెడతారు. వీటిని అనుసరించే నగలను కూడా ఎంపిక చేసుకుంటారు అంటే మీరు నమ్ముతారా? నిజమండీ.. నేటి మహిళలు ఇలాగే చేస్తున్నారు మరి. లక్షలు విలువ చేసే నగలు.. బ్లౌజ్‌డిజైన్‌పైన ఆధారపడుతున్నాయంటే విడ్డూరమే మరి!

కొన్ని రకాల డిజైన్డ్‌బ్లౌజులు వేసుకున్నప్పుడు వాటిపై నగలు బాగుండవు. మరికొన్ని రకాల నెక్‌లైన్ డిజైన్లపైకి మాత్రం తప్పకుండా నగలు ధరించాలి. కాబట్టి వేడుకకి కొద్దిరోజులు ముందుగానే బ్లౌజ్‌లు, వాటిపై డిజైన్లను చూసుకుని వాటిని అనుసరించి నగలను సెట్ చేసుకోవాలి. ముఖ్యంగా పెళ్లికూతురు బ్లౌజ్ డిజైన్ల గురించి తప్పనిసరిగా తెలుసుకోవాలి.



ఎ కూర్ నెక్‌లైన్ డిజైన్

కూర్ అంటే ఇటాలియన్‌లో గుండె అని అర్థం. ఈ డిజైన్ చూస్తే సేమ్‌హార్ట్‌సింబల్లా కనిపిస్తుంది. అందుకే దీనికాపేరు. దీన్ని సెలెక్ట్ చేసుకుంటే భుజాల కింది వరకు మాత్రమే వస్తుంది కాబట్టి.. దీనిపై నగలు వేసుకునే సౌకర్యం ఉంటుంది. నగలతో ఈ నెక్‌లైన్‌చూసేవారికి చాలా అందంగా కనిపిస్తుంది.

డ్రిట్టా

ఇది కూడా ఇటాలియన్‌పదమే.. ఈ డిజైన్లో నెక్‌లైన్ చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. ఇది కూడా భుజాల కిందివరకు మాత్రమే వస్తుంది. దీనిపైకి కూడా నగలు బాగుంటాయి.

స్కొల్లో వి

ఈ నెక్‌లైన్ డిజైన్ వి షేపులో ఉంటుంది కాబట్టే దీనికా పేరు. ఈ నెక్‌లైన్ డిజైన్లో కూడా స్టిచ్ చేసిన జాకెట్టు స్లీవ్ లా భుజాలపై నుంచి వస్తుంది. కానీ బ్రెస్ట్ వద్ద మాత్రం వి షేపులో ఉంటుంది. ఇది భుజాలను పట్టి ఉంచుతుంది. కాబట్టి ఇది చాలా కంఫర్టబుల్‌గా ఉంటుంది.

క్వీన్ అన్నే

క్వీన్ అన్నే మోడల్ నెక్‌లైన్ డిజైన్ చేసేందుకు మగవారు షర్ట్ ధరించినట్లు ఉంటుంది. ఈ డిజైన్‌లో కాలర్ ఉంటుంది. ఇది కంఫర్ట్‌గా ఉంటుంది. దీనిపైకి నగలు పెద్దగా నప్పవు.

కోలో ఆల్టో

ఈ మోడల్ నెక్‌లైన్ డిజైన్లో ఛాతి దగ్గర ఎలాంటి కట్స్ లేకుండా పూర్తిగా కవర్ అవుతుంది. కాబట్టి ఇది కూడా చాలా కంఫర్ట్‌గా, నిండుగా ఉంటుంది. మెడభాగం, ఛాతి భాగం.. పూర్తిగా కప్పి ఉంటుంది.

అక్కోల్లటో

ఈ నెక్‌లైన్ డిజైన్‌ను దూరం నుంచి చూస్తే కోలో ఆల్టో డిజైన్ లా కనిపిస్తుంది. కానీ దగ్గరికి వెళ్లి గమనిస్తే తేడా స్పష్టంగా కనిపిస్తుంది. ఈ డిజైన్లో భుజాల వద్ద కట్ కాస్త భిన్నంగా ఉంటుంది. కోలో ఆల్టోలో భుజాల వద్ద కట్ వేరుగా ఉంటుంది. ఈ తేడా మినహా మిగతాదంతా ఒకేలా ఉంటుంది.

బార్బెట్టా

ఈ డిజైన్ గొంతు వరకూ ఉంటుంది. కానీ కట్ వచ్చేసి క్వీన్ అన్నే డిజైన్ కంటే డిఫరెంట్‌గా ఉంటుంది. అందుకే బార్బెట్టా డిజైన్ చూస్తే క్వీన్ అన్నే డిజైన్ గుర్తొస్తుంది.

టోండా

టోండా డిజైన్లో జాకెట్ భుజాలపై నుంచి వస్తుంది. కేవలం ఛాతి వరకే ఉండి పూర్తికాకుండా భుజాలపై కూడా ఉంటుంది. టోండా డిజైన్ జాకెట్ వేసుకున్నవారు చాలా రొమాంటిక్‌గా కనిపిస్తారు.

ఇవే కాదు.. ఇంకా ఎన్నో రకాల బ్లౌజ్ డిజైన్లు అందుబాటులో ఉన్నాయి. కానీ మనం ఏదైనా బ్లౌజ్ డిజైన్‌ను ఎంచుకునేటప్పుడు అది మన బాడీషేప్‌కు సరిపోతుందా? లేదా? అనే విషయాన్ని పరిగణలోకి తీసుకుని ఎంపిక చేసుకోవాలి.









అమలులోకి ట్రేడ్ డీల్.. వీటిపై జీరో టారిఫ్

- వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ఇండియాఅమెరికా ట్రేడ్ డీల్ అమలులోకి వచ్చిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా టారిఫ్‌లను ట్రంప్ తగ్గించాడు. నేటి నుంచే ఈ టారిఫ్‌లు అమలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏయే ఉత్పత్తులపై ఎలాంటి పన్నులు ఉంటాయి.. అవి ఇండియాకు ఎలాంటి మేలు కలిగిస్తాయి అనే అంశాలపై చర్చ జరుగుతోంది. ఈ అంశంపై కేంద్ర వాణిజ్య పన్నులు, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ శనివారం స్పందించారు.



ఇండియాఅమెరికా మధ్య కొన్ని ఉత్పత్తులపై సున్నా శాతం సుంకాలు విధించే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. ట్రేడ్ డీల్ వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. రైతులకు నష్టం కలగకుండా కొన్ని ఉత్పత్తుల్ని డీల్‌కు దూరంగా ఉంచినట్లు చెప్పారు. ఇండియా నుంచి ఎగుమతి అయ్యే సోయాబీన్ ఆయిల్‌పై పరిమిత కోటా వరకు జీరో టారిఫ్‌లు ఉంటాయి. అలాగే అమెరికా నుంచి దిగుమతి చేసుకునే యాపిల్స్‌పై కూడా సున్నా సుంకాలుంటాయి. సుంకాలు లేకుండా కనీసం 80 రూపాయలకు కేజీ యాపిల్స్ దిగుమతి చేసుకుంటారు. అలాగే వైన్స్, ఆల్కహాల్ డ్రింక్స్, పప్పు ధాన్యాలు, క్యాన్సర్ డ్రగ్స్, కెమికల్స్, మెడికల్ డివైజెస్ వంటివి జీరో టారిఫ్స్ కిందకు వస్తాయి. వీటి దిగుమతులపై ఎలాంటి పన్ను ఉండదు. దీంతో ఇవి భారత మార్కెట్లో చవకగా లభిస్తాయి. అలాగే ఇండియా నుంచి ఎగుమతి అయ్యే ఫార్మా ఉత్పత్తులు, రత్నాలు, వజ్రాలు వంటి వాటిపై అమెరికా ఎలాంటి టారిఫ్‌లు విధించదు. అలాగే మన దేశం నుంచి భారీగా ఎగుమతి చేసే స్మార్ట్‌ఫోన్లపై కూడా సున్నా సుంకాలే. వ్యవసాయ రంగానికి సంబంధించి మసాలా దినుసులు, టీ, కాఫీ పౌడర్లు, కొబ్బరి ఉత్పత్తులు, వివిధ రకాల నట్స్, పండ్లు, కూరగాయలు కూడా అమెరికాకు జీరో టారిఫ్ కేటగిరిలోనే ఎగుమతి అవుతాయి. వ్యవసాయ ఉత్పత్తులపై టారిఫ్‌లు తగ్గడం వల్ల మన ఉత్పత్తులు అమెరికా మార్కెట్లో ఎక్కువగా అమ్మకాలు సాగుతాయి. ఇది మన రైతులకు మేలు చేస్తుంది. మనం దిగుమతి చేసుకునే కొన్ని ఉత్పత్తులు, ఎగుమతి చేసే ఉత్పత్తుల్ని జీరో టారిఫ్ కేటగిరిలోకి తెచ్చి, ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నాయి ఇరు దేశాలు.




ముంబై మేయర్‌గా రితూ తావ్డే

- డిప్యూటీ మేయర్ గా సంజయ్ శంకర్ ఘాడి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, ముంబై, ఫిబ్రవరి 7: బృహన్ ముంబై కార్పొరేషన్‌బీఎంసీ మేయర్‌గా బీజేపీ కార్పొరేటర్ రితూ తావ్డే నామినేషన్ దాఖలు చేశారు. అలాగే డిప్యూటీ మేయర్‌గా శివసేన (షిండే వర్గం)కు చెందిన సంజయ్ శంకర్ ఘాడి నామినేషన్ దాఖలు చేశారు. బీఎంసీ ఎన్నికల్లో బీజేపీ, శివసేన కలిసి మహాయుతి కూటమిగా బరిలోకి దిగిన సంగతి తెలిసిందే. ఈ కూటమి మెజారిటీ స్థానాలు సంపాదించింది. అయితే, మేయర్ పదవి విషయంలో మాత్రం సందిగ్ధత నెలకొంది. తాజాగా కూటమి తరఫున ముంబై మేయర్ పదవికి బీజేపీ అభ్యర్థి రితూ తావ్డే నామినేషన్ దాఖలు చేయగా, డిప్యూటీ మేయర్ స్తానం కోసం శివసేన నేత సంజయ్ శంకర్ ఘాడీ నామినేషన్ దాఖలు చేశారు. ఈ నెల 11న మేయర్, డిప్యూటీ మేయర్ స్థానాలకు ఎన్నిక జరగనుంది. 227 స్థానాలున్న బీఎంసీలో మహాయుతి కూటమి 118 స్థానాల్లో గెలుపొందింది. ఇందులో బీజేపీ 89 సీట్లు, శివసేన (షిండే) 29 సీట్లు గెలుచుకుంది. మేయర్‌గా పోటీ పడుతున్న రితూ తావ్డే 132 వ వార్డు అయిన ఘట్కోపర్ నుంచి గెలుపొందారు. ఆమె ఇప్పటివరకు మూడుసార్లు కార్పొరేటర్గా గెలిచారు. రితూ గతంలో కాంగ్రెస్‌లో ఉండేవారు. 2012లో ఆ పార్టీని వీడి బీజేపీలో చేరారు. బీఎంసీ దేశంలోనే అతిపెద్ద స్థానిక సంస్థ (కార్పొరేషన్). ఈ సంస్థ గత ఏడాది బడ్జెట్ రూ.74,450 కోట్లుగా ఉంది. బీఎంసీకి తొమ్మిదేళ్ల తర్వాత ఎన్నికలు జరగడం విశేషం. ఇక.. పాతికేళ్ల తర్వాత శివసేన ముంబై మేయర్ పదవి కోల్పోనుంది. 1997 నుంచి ఆ పార్టీయే మేయర్ పీఠాన్ని సొంతం చేసుకుంటూ వచ్చింది. ఈసారి మాత్రం శివసేన (యూబీటీ) 65 స్తానాలు మాత్రమే గెలుచుకుంది. దాని మిత్రపక్షాలైన ఎమ్మెన్నెస్ 6 సీట్లు, ఎన్సీపీ (శరద్ పవార్) ఒక సీటు, కాంగ్రెస్ 24 సీట్లు, ఏఐఎంఐఎం 8 సీట్లు, ఎస్పీ రెండు సీట్లు గెలుచుకున్నాయి. అయితే, మహాయుతి కూటమిలోనే ఉన్నప్పటికీ అజిత్ పవార్‌కు చెందిన ఎన్సీపీ సొంతంగా బరిలోకి దిగింది. కేవలం 3 సీట్లే గెలుచుకుంది. ఈ మూడు సీట్లు కూడా ఇప్పుడు మహాయుతి కూటమిలో భాగంగానే ఉంటాయి.





పొట్టి కప్పుతో హిట్ మ్యాన్.. హోరెత్తిన వాంఖడే

భారత్‌లో క్రికెట్ జ్వరం మళ్లీ మొదలైంది. నిరుడు మహిళల వన్డే ప్రపంచకప్ ప్రేక్షకులను అలరించగా.. ఇప్పుడు పొట్టి ప్రపంచకప్ సందడి ఘనంగా షురూ అయింది. ముంబైలోని వాంఖడే స్టేడియం అభిమానులతో నిండిపోగా.. అందరి కరతాళధ్వనుల మధ్య ప్రపంచకప్ అంబాసిడర్ రోహిత్ శర్మ, ఐసీసీ అధ్యక్షుడు జై షాలు ఎంట్రీ ఇచ్చారు. బ్లాక్ డ్రెస్, తెలుపు షూతో తళుక్కుమన్న రోహిత్ వరల్డ్ కప్ ట్రోఫీతో మైదానంలోకి వచ్చాడు. పదో సీజన్ టీ20 ప్రపంచకప్ పోటీలతో క్రీడాభిమానులు పులకించిపోతున్నారు. భారత జట్టు మ్యాచ్‌కు వేదికైన వాంఖడే స్టేడియం కిక్కిరిసిపోయింది. డ్రమ్స్ శివమణి తన స్టయిల్ ప్రదర్శనతో అభిమానులతో స్టెప్పులు వేయించారు. మరోవైపు నృత్యకారులు.. యువతీయువకుల బృందం లయబద్ధంగా, హుషారుగా డ్రమ్స్ వాయిస్తూ వరల్డ్‌కప్ జోష్ నింపారు. అనంతరం ప్రపంచకప్ అంబాసిడర్, భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ మైదానంలోకి వచ్చాడు. ఐసీసీ ఛైర్మన్ జై షాతో కలిసి ఎంట్రీ ఇచ్చిన హిట్ మ్యాన్.. వరల్డ్‌కప్ ట్రోఫీని మైదానంలోకి తీసుకొస్తుంటే రోహిత్.. రోహిత్ నినాదాలతో స్టేడియం మార్మోగిపోయింది.



ఆట మొదలైంది


- వరల్డ్ కప్ తొలి మ్యాచ్ లో భారత్ విజయం

టీ20 ప్రపంచకప్‌లో భారత్ తమ జైత్రయాత్ర మొదలు పెట్టింది. ముచ్చటగా మూడోసారి టైటిల్ గెలువాలన్న పట్టుదలతో ఉన్న టీమ్ఇండియా.. తమ తొలి మ్యాచ్‌లో ఆకట్టుకుంది. శనివారం జరిగిన గ్రూపుఏ పోరులో భారత్ 29 పరుగుల తేడాతో అమెరికాపై విజయం సాధించింది. తద్వారా పొట్టి ఫార్మాట్‌లో అప్రతిహత విజయాల జోరు కొనసాగిస్తున్నది. తొలుత కెప్టెన్ సూర్యకుమార్‌యాదవ్(49 బంతుల్లో 84 నాటౌట్, 10ఫోర్లు, 4సిక్స్‌లు) అజేయ అర్ధసెంచరీతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 161/9 స్కోరు చేసింది. తిలక్‌వర్మ(25), ఇషాన్‌కిషన్(20) ఫర్వాలేదనిపించగా, అభిషేక్‌శర్మ(0), శివమ్‌దూబే(0), రింకూసింగ్(6), హార్దిక్‌పాండ్యా(5) ఘోరంగా విఫలమయ్యారు. షాడ్లె వాన్ షల్విక్(4/25) ధాటికి 77 పరుగులకే 6 వికెట్లు చేజార్చుకున్న జట్టును సూర్యకుమార్ ఒంటిచేత్తో సాధికారిక స్కోరు అందించాడు. టెయిలెండర్లతో కలిసి జట్టుకు విలువైన పరుగులు సాధించిపెట్టాడు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన అమెరికా 20 ఓవర్లలో 132/8 స్కోరుకు పరిమితమైంది. గాయంతో దూరమైన హర్షిత్‌రానా స్థానంలో జట్టులోకి వచ్చిన సిరాజ్(3/29) ధాటికి యూఎస్‌ఏ బ్యాటర్లు నిలదొక్కుకోలేకపోయారు. తన దేశవాళీ ఫామ్‌ను కొనసాగిస్తూ సిరాజ్ వికెట్ల వేట కొనసాగించాడు. శుభమ్(37), సంజయ్(37), మిలింద్(34) ఆకట్టుకోగా, మిగతావారు సింగిల్ డిజిట్ స్కోర్లకు పరిమితమయ్యారు. సాధికారిక ఇన్నింగ్స్‌తో జట్టు విజయంలో కీలకమైన సూర్యకుమార్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఈనెల 12న ఢిల్లీలో నమీబియాతో భారత్ తలపడనుంది. టాస్ గెలిచిన అమెరికా కెప్టెన్ మోనాంక్‌పటేల్ మరో ఆలోచన లేకుండా బౌలింగ్ ఎంచుకున్నాడు. కెప్టెన్ నిర్ణయాన్ని బలపరుస్తూ అమెరికా బౌలర్లు టీమ్ఇండియాను ఆదిలోనే కట్టడి చేయడంలో సఫలమయ్యారు. సూపర్‌ఫామ్‌మీదున్న హార్డ్‌హిట్టర్ అభిషేక్‌శర్మ తాను ఎదుర్కొన్న తొలి బంతికే భారీ షాట్ ఆడబోయి అలీఖాన్ బౌలింగ్‌లో సంజయ్ క్యాచ్‌తో డకౌట్‌గా వెనుదిరిగాడు. ఈ దశలో తిలక్‌వర్మ, ఇషాన్‌కిషన్ జట్టును గాడిలోపడేసే ప్రయత్నం చేశారు. వీరిద్దరు దూకుడు తగ్గకుండా వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు బాదుతూ స్కోరుబోర్డును గాడిలోపడేశారు. అయితే షెల్విక్ ఒకే ఓవర్‌లో ఇషాన్‌కిషన్, తిలక్‌తో పాటు దూబేను ఔట్ చేసి భారత్‌ను కష్టాల్లోకి నెట్టాడు. ప్రమోషన్‌లో బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొచ్చిన రింకూసింగ్ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేపోయాడు. మెహిసిన్ బౌలింగ్‌లో షాట్ ఆడబోయిన రింకూ ఐదో వికెట్‌గా ఔటయ్యాడు. ఆల్‌రౌండర్ హార్దిక్ ఇలా వచ్చి అలా వెళ్లిపోయాడు. దీంతో 70 పరుగులకే బ్యాటర్లంతా పెవిలియన్ చేరారు. ఈ స్థితిలో అక్షర్‌పటేల్(14) జతగా సూర్యకుమార్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా తనదైన శైలిలో షాట్లు ఆడుతూ కీలక పరుగులు జతచేశాడు. ఈ క్రమంలో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న సూర్య..నేత్రవాల్కర్ ఆఖరి ఓవర్‌లో విశ్వరూపం చూపెట్టాడు. ఆఫ్‌సైడ్ బంతులను వికెట్ల మీదుగా ఆడుతూ 4,6, 6,4తో దుమ్మురేపడంతో టీమ్ఇండియా స్కోరు 160 మార్క్ అందుకుంది. జట్టులో అనూహ్యంగా చోటు దక్కించుకున్న సిరాజ్ తన విలువను చాటుకున్నాడు. చివరి నిమిషంలో బుమ్రా కూడా దూరం కావడంతో సిరాజ్‌కు తుది జట్టులో చోటు దక్కింది. ఇదే అవకాశంగా మలుచుకుంటూ మూడు వికెట్లతో సిరాజ్ జట్టు విజయంలో కీలకమయ్యాడు. ఓపెనర్ అండ్రియస్ గౌస్(6)ను బోల్తా కొట్టించిన ఈ హైదరాబాదీ..సాయితేజ(2), శుభమ్‌ను ఔట్ చేసి ఆకట్టుకున్నాడు. సిరాజ్ జతగా అర్ష్‌దీప్, అక్షర్ వికెట్లు తీయడంతో అమెరికా లక్ష్యాన్ని అందుకోలేకపోయింది. మిడిలార్డర్‌లో మిలింద్, సంజయ్, శుభమ్ రాణించినా మిగతావాళ్ల వైఫల్యం గెలుపు అవకాశాలను దెబ్బతీసింది.



శ్రమించి.. ఓటమి తప్పించుకున్న పాక్

టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌కు తమ తొలి మ్యాచ్‌లోనే అతికష్టంగా ఓటమి నుంచి తప్పించుకుంది. శనివారం జరిగిన పోరులో పాక్ 3 వికెట్ల తేడాతో నెదర్లాండ్స్‌పై చెమటోడ్చి నెగ్గింది. నిర్దేశిత 148 పరుగుల లక్ష్యాన్ని పాక్ మరో మూడు బంతులు మిగిలుండగా 7వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. ఓపెనర్ షాహిబ్జాదా ఫర్హాన్(47) రాణించగా, ఆఖర్లో ఫహీమ్ అష్రఫ్ (11 బంతుల్లో 29 నాటౌట్, 2ఫోర్లు, 3సిక్స్‌లు) ఆపద్బాంవునిలా ఆదుకున్నాడు. అయితే డచ్ బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టడంతో ఒక దశలో 90/2తో మెరుగ్గా కనిపించిన పాక్ 16.1 ఓవర్లలో 114కు 7 వికెట్లు కోల్పోయింది. చివరి రెండు ఓవర్లలో జట్టు విజయానికి 29 పరుగులు అవసరమైన దశలో క్రీజులోకి వచ్చిన అష్రఫ్ మూడు సిక్స్‌లు, ఒక ఫోర్‌తో 24 పరుగులు పిండుకున్నాడు. దీంతో గెలుపు సమీకరణం కాస్తా ఆరు బంతుల్లో 5 పరుగులకు చేరగా, లీడ్ బౌలింగ్‌లో ఫోర్‌తో అష్రఫ్ మ్యాచ్‌ను ముగించాడు. అంతకుముందు కెప్టెన్ ఎడ్వర్డ్స్(37), లీడె(30) రాణించడంతో నెదర్లాండ్స్ 147 పరుగులు చేసింది.



శాండిల్ వుడ్‌పై ఫోకస్

చిన్న సినిమాతో నటిగా ప్రయాణం మొదలు పెట్టిన అమ్మడు అనతి కాలంలో స్టార్ హీరోలకు ప్రమోట్ అయినా? ఇంకా ఆ స్టార్ లీగ్ లో మాత్రం చేరలేదు. సెకెండ్ లీడ్స్ లోనే కంటున్యూ అవుతోంది. వెనుక వంద కోట్ల క్లబ్ లో చేరిన చిత్రం ఉన్నా? ఛాన్సులు అందుకోవడంలో వెనుకబడిందంటే? అదృష్టం కలిసి రాకనే అనాలి. ఇటీవలే విడుదలైన `అనగనగా ఒక రాజు`తోనూ మంచి విజయాన్ని అందుకుంది. సంక్రాంతికి రిలీజ్ అయిన సినిమా విమర్శకుల ప్రశంస లందుకుంది. మీనాక్షి పాత్రకు మంచి పేరొచ్చింది. కానీ అమ్మడి తాజా లైనప్ చూస్తే మాత్రం ఖాళీగానే ఉంది. ప్రస్తుతం చేతిలో ఉంది `వృషకర్మ` ఒక్కటే. ఇందులో యువ సామ్రాట్ నాగచైతన్యకు జోడీగా నటిస్తోంది. ఈ చిత్రం మినహా కొత్త ప్రాజెక్టే ఏది చేతిలో లేదు. ఈ సినిమా విజయం సాధించినా? వెంటనే మరో సినిమాకు సైన్ చేసే గ్యారెంటీ కూడా కనిపిం చడం లేదు. ఇవన్నీ అమ్మడు ముందుగానే గెస్ చేసిందో ఏమోగానీ తాజాగా మీనాక్షి చౌదరి ఫోకస్ శాండిల్ వుడ్ పై మళ్లించినట్లు కనిపిస్తోంది. కన్నడ స్టార్ రక్షిత్ హీరోగా నటించనున్న సినిమాలో హీరోయిన్ ఛాన్స్ అందుకుందని వార్తలొస్తున్నాయి. నాగవంశీ వ్యాఖ్యలు వైరల్ కిరణ్. రాజ్. కె ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. గతంలో ఇద్దరి కాంబినేషన్ లో రిలీజ్ అయిన `777చార్లీ` భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. కన్నడలో మరో 100 కోట్లు రాబట్టిన చిత్రాల జాబితాలో చార్లీ నిలిచింది. ఈ నేపథ్యంలోనే రక్షిత్ తో మరో ప్రాజెక్ట్ ప్లాన్ చేస్తున్నాడు. ఇందులో హీరోయిన్ గా తొలుత కన్నడ నటినే తీసుకో వాలనుకున్నారు. కానీ మీనాక్షి చౌదరి ఆ పాత్రకు పర్ఫెక్ట్ గా సూటవ్వడంతో ఆమెని ఎంపిక చేస్తున్నట్లు తెలుస్తోంది.



'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' ట్రైలర్ విడుదల

శివాజీ నిర్మాత గా మారి తన సొంత బ్యానర్ శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ పతాకంపై రెండవ చిత్రంగా 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' అనే చిత్రాన్ని చేస్తున్నారు. ఈ సినిమాలో సీనియర్ హీరోయిన్ లయ శివాజీకి జంటగా నటించారు. ఈ చిత్రంలో రోహన్, ప్రిన్స్, అలీ, ధన్‌రాజ్, ఇమ్మాన్యుయేల్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహించగా.. రంజిన్ రాజ్ సంగీతం అందించారు. ఈ సినిమాని ఫిబ్రవరి 12న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హిట్ మెషిన్ అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా విచ్చేశారు.



'ఫంకీ' ట్రైలర్... నవ్వుల మోత

వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయకుడు మాస్ కా దాస్ విశ్వక్ సేన్, హాస్య చిత్రాలకు చిరునామాగా మారిన దర్శకుడు కె.వి. అనుదీప్ కలయికలో వస్తున్న చిత్రం 'ఫంకీ'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో కయాదు లోహర్ కథానాయిక. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 13న థియేటర్లలో అడుగు పెట్టనున్న 'ఫంకీ' చిత్రంపై ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు, 'ధీరే ధీరే', 'రట్టాటటావ్' పాటలకు అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా ఈ చిత్రం నుంచి ట్రైలర్ విడుదలైంది. శనివారం సాయంత్రం హైదరాబాద్ లోని శ్రీరాములు థియేటర్ లో ట్రైలర్ ఆవిష్కరణ వేడుక ఘనంగా జరిగింది. 'ఫంకీ' ట్రైలర్ ఆద్యంతం వినోదభరితంగా సాగింది. కె.వి. అనుదీప్ శైలి కామెడీతో నవ్వులు పూయించింది. ప్రతి ఫ్రేమ్‌లో వినోదం ఉట్టిపడేలా రూపొందించిన ఈ ట్రైలర్, థియేటర్లలో నవ్వుల తుఫాన్ చూడబోతున్నామనే హామీ ఇచ్చింది. విశ్వక్ సేన్, కయాదు లోహర్ కలిసి తెరపై చురుకుగా, ఆకర్షణీయంగా కనిపిస్తున్నారు. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ చక్కగా కుదిరి.. చిత్రానికి కొత్త ఉత్సాహాన్ని, మరింత అందాన్ని జోడించింది. ప్రధాన తారాగణంతో పాటు ఇతర పాత్రలు కూడా నవ్వులు పూయిస్తూ 'ఫంకీ'ని పూర్తి స్థాయి వినోదభరిత చిత్రంగా మలిచాయి. మొత్తానికి ట్రైలర్ తో 'ఫంకీ' సినిమాపై అంచనాలు రెట్టింపు అయ్యాయి. ట్రైలర్ ఆవిష్కరణ వేడుకలో మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. "అందరినీ కలిసి దాదాపు సంవత్సరం అవుతుంది. ఒక మంచి సినిమా అందించాలనే ఉద్దేశంతోనే ఈ విరామం తీసుకోవడం జరిగింది. ఫంకీ సినిమా రెండు గంటల పది నిమిషాల పాటు మిమ్మల్ని నవ్విస్తూనే ఉంటుంది. ఫోన్ పెట్టుకోవాలనే ఆలోచనే రాదు. ప్రతి సన్నివేశం చూస్తూ నవ్వుకుంటారు. మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి థియేటర్ కి రండి. కడుపుబ్బా నవ్వుకుంటారు. ఫిబ్రవరి 13న థియేటర్లలో కలుద్దాం." అన్నారు.



సీతా పయనం' ట్రైలర్ రిలీజ్

14న నాలుగు భాషల్లో విడుదల

మల్టీ టాలెంటెడ్ నటుడు, దర్శకుడు యాక్షన్ కింగ్ అర్జున్ దర్శకత్వంలో శ్రీ రామ్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై రాబోతోన్న కొత్త చిత్రం 'సీతా పయనం'. ఈ మూవీలో యాక్షన్ కింగ్ అర్జున్ కుమార్తె ఐశ్వర్య అర్జున్ హీరోయిన్‌గా తెరకు పరిచయం కాబోతున్నారు. ఈ సినిమాలో నిరంజన్, సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ ఇతర ముఖ్య పాత్రల్ని పోషించారు. యాక్షన్ కింగ్ అర్జున్ కూడా ఓ ప్రత్యేకమైన పాత్రలో నటించారు. అతని మేనల్లుడు యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా మరో స్పెషల్ కామియో రోల్ పోషించారు. ఈ మూవీని ఫిబ్రవరి 14న రిలీజ్ చేయబోతున్నారు. ఈ క్రమంలో తాజాగా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200